
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

## చర్చలకు తిరస్కృతి కొనసాగిన ఇరాన్ దాడులు

- పశ్చిమాసియాలో సరికొత్త భద్రతా కూటమికి ఇరాన్ పిలుపు
- ప్రతిష్టాత్మకమైన అబ్రహాంలింకన్ నౌకపై దాడి
- లెబనాన్‌లో దాడులు ● తొమ్మిదిమంది మృతి

02

సంపుటి 09, సంచిక: 115 | గురువారం | 26-03-2026 | మహబూబ్‌నగర్
Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# కమ్యూనిస్టు శ్రేణులకు సురవరం ఆదర్శప్రాయుడు

## ప్రజా స్వరం సురవరం

విజయవాడలోనూ పుస్తకావిష్కరణ 04



- సుధాకర్‌రెడ్డి ఆశయాలు ముందుకు తీసుకువెళ్లినప్పుడే నిజమైన నివాళి
- సమాజంలో లింగభేదంతో పాటు అంతరాలు, విభేదాలు తొలగించాలి
- దేశంలో కమ్యూనిస్టు శక్తుల ఐక్యత అత్యవసరం

**సురవరం సుధాకర్‌రెడ్డి స్వీయ కథ 'ప్రజలతో నా ప్రయాణం' పుస్తకావిష్కరణలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా**

ప్రజాపక్షం/హైదరాబాద్

కమ్యూనిస్టు అగ్రనేత, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి కమ్యూనిస్టు శ్రేణులకు ఆదర్శప్రాయుడని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. విద్యార్థి నాయకుడిగా రాజకీయ జీవితం ప్రారంభించిన సురవరం సుధాకర్ రెడ్డి అంచలంచెలుగా ఎదుగుతూ దేశంలో గొప్ప కమ్యూనిస్టు నాయకుడిగా గుర్తింపు పొందారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళినప్పుడే ఆయనకు మనం నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని తెలిపారు. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి 84వ జయంతి పురస్కరించుకుని హైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్‌లో బుధవారం సురవరం సుధాకర్ రెడ్డి స్వీయ కథ ''ప్రజలతో నా ప్రయాణం'' పుస్తకావిష్కరణ సభ జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ''ప్రజలతో నా ప్రయాణం'' పుస్తకాన్ని డి.రాజా ఆవిష్కరించి అనంతరం సుధాకర్ రెడ్డి స్మారకోపన్యాసం చేశారు. సభలో గౌరవ అతిథిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. వేదికపై సిపిఐ సీనియర్ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి,

తరువాయి 12లో





# పెట్రోల్, డీజిల్ కొరత లేదు

- రాష్ట్రంలో సరిపడా ఇంధన నిలువలు
- వదంతులతో ఆందోళన చెందొద్దు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి కొరత ఉత్పన్నమయ్యే ప్రసక్తేలేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధానంగా హైదరాబాద్‌లో డీజిల్, పెట్రోల్ బంక్‌ల వద్ద పెద్ద ఎత్తున ఉన్న క్యూలను చూసి కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇంధన వనరులతో పాటు ఎల్‌పిజి కొరత అంటూ వస్తున్న వదంతులతో ప్రజాలేవరు గందరగోళంలో పడొద్దని ఆయన ఉద్బోధించారు. రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలసి బుధవారం ఆయన మీడియాతో ముచ్చటించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌తో పాటు

తరువాయి 2లో

## పాకిస్థాన్‌లాగా భారత్ 'దలాల్ నేషన్' కాదు

త్వరలో యుద్ధం ముగియాలని ట్రంప్‌కు మోదీ చెప్పారు


నిరసనలమధ్య అఖిలపక్ష సమావేశంలో జైశంకర్ వెల్లడి 04

---

### కాంగ్రెస్ పార్టీకి

## జీవన్‌రెడ్డి రాజీనామా

ఆయనకు మద్దతుగా మరో 1500 మంది కూడా రాజీనామా లేఖల విడుదల



ప్రజాపక్షం/జగిత్యాల

కాంగ్రెస్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న మాజీమంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి రాజీనామా చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అభిమానులు, రాజకీయ సహచరులు, కార్యకర్తల సమక్షంలో జీవన్ రెడ్డి చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. బాధాతప్త హృదయంతో పార్టీని వీడుతున్నానని ప్రకటించిన జీవన్ రెడ్డి భావోద్వేగ ప్రసంగం చేశారు. జీవన్ రెడ్డికి మద్దతుగా జగిత్యాల నియోజకవర్గం నుంచి 1500 మందికి పైగా వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ నాయకులు సైతం తమ రాజీనామా

తరువాయి 2లో



# చలో అసెంబ్లీ ఉద్రిక్తం

**ఎఐఎస్ఎఫ్ నాయకుల అరెస్ట్**

- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం
- బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి
- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించడంతో పాటు బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్న విద్యాశాఖకు బడ్జెట్ లో తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొరగా నిధులు కేటాయించారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి, కేవలం 8 శాతం

తరువాయి 2లో

## ఎల్‌పిజి సరఫరా సంక్షోభంపై ప్రతిపక్షాల ఆందోళన


- 'ఖాళీ సిలిండర్లు, ఖాళీ వాగ్దానాలు' అంటూ బ్యానర్‌తో ప్రదర్శన
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎంపిలు నినాదాలు

**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం నేపథ్యంలో దేశంలో ఎల్‌పిజి సరఫరా కొరతపై నిరసనగా బుధవారం పలువురు ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంట్ భవన ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. పార్లమెంట్ మకర ద్వారం సమీపంలో జరిగిన ఈ నిరసనలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎన్‌సిపి(ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే, ఎస్‌పికి చెందిన ధర్మేంద్ర యాదవ్, సిపిఐ(ఎంఎల్)కు చెందిన సుదామా ప్రసాద్, డిఎంకెకు చెందిన టి. సుమతి, జెఎంఎంకు

తరువాయి 12లో




## యుద్ధం ముగించేందుకు.. ట్రంప్ 15 అంశాల ప్రణాళిక



- ప్రణాళికను ఇరాన్ అందుకుంది : పాక్ వర్గాలు
- ఇరాన్ అధ్యక్షుడితో పాక్ ప్రధానమంత్రి మంతనాలు
- చర్చలకు సహకరించాలని మేక్రాన్ విజ్ఞప్తి
- శాంతి యత్నాలతో తగ్గిపోయిన క్రూడాయిల్ ధర

**వాషింగ్టన్ :** యుద్ధం ముగించేందుకు ఇరాన్‌కు 15 అంశాల ప్రణాళికను డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారని వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రకటించింది. అన్ని వైపుల నుండీ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న ట్రంప్ పశ్చిమాసియాలో యుద్ధం ముగించేందుకు నిజంగానే ముమ్మర యత్నం చేస్తున్నారా? ఇరాన్‌తో చర్చల ప్రక్రియ నిజమేనా? అని రెండు రోజులుగా సందేహాలు పట్టిపీడిస్తున్న తరుణంలో ఈ వార్త వచ్చింది. ఐతే ట్రంప్ ఇచ్చిన ఈ ప్రణాళికను ఇరాన్ అధికారులు పరిశీలిస్తున్నారని పాకిస్థాన్ అధికారులను ఉటంకిస్తూ అసోసియేటెడ్ ప్రెస్ కూడా బుధవారం ఒక వార్త ప్రచురించింది. పాకిస్థానీ మధ్యవర్తుల ద్వారా ఈ 15 అంశాల ప్రణాళిక ఇరాన్‌కు చేరింది. ఇరాన్ దీనిని పరిశీలిస్తోంది. 82వ పారాట్రూప్ డివిజన్ నుండి కొత్తగా దాదాపు 1000 మందిని పశ్చిమాసియాకు ట్రంప్ తరలించడం ప్రారంభించిన తరుణంలో

తరువాయి 2లో



విజయవాడలో ఉగ్ర కుట్ర

## సియిదా అరెస్ట్

ప్రజాపక్షం /హైదరాబాద్

విజయవాడలో వెలుగులోకి వచ్చిన ఉగ్రవాద అనుమానితుల కేసు దర్యాప్తు తెలంగాణకు విస్తరించింది. ఈ కేసులో కీలక మలుపుగా, హైదరాబాద్‌కు చెందిన సయిదాబేగంను మంగళవారం పాతబస్తీలోని ఆమె ఇంటిపై దాడి చేసిన ఆంధ్రపోలీసులు అదుపులోకి తీసుకోవడం సంచలనం సృష్టించింది. ఇటీవల విజయవాడలో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసిన

తరువాయి 2లో

### ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

## కుటుంబ పెద్దకే

- 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా
- డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

'కుటుంబ పెద్దకే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వర్తిస్తుంది' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రజలందరి సంక్షేమం కోసం సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, మధ్యతరగతి, ధనిక అని తేడా చూడకుండా 1.15 కోట్ల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా అందించనున్నట్లు ఆయన వివరించారు. ఇదే విషయాన్ని తాను ఈ నెల 20వ తేదీన శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా స్పష్టంగా చెప్పానని ఆయన

తరువాయి 2లో

### ఏప్రిల్ చివరి వారం నుంచి

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు

- గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించి పెండింగ్ పనులు పూర్తిచేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- శాసనసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్

ఇందిరమ్మ ఇళ్ళ కేటాయింపులు ఏప్రిల్ నెల చివరి వారం లేదా మే నెల నుంచి ప్రారంభించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. శాసనసభలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో బిజెపి సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి, పాయల్ శంకర్, రామారావు పవార్ అడిగిన ప్రధాన ప్రశ్నకు, విపక్షాలకు చెందిన సభ్యులు 19 మంది అడిగిన ప్రశ్నలకు మంత్రి సుదీర్ఘంగా సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడం ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన 'ఇందిరమ్మ ఇళ్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో గృహ నిర్మాణం జరిగిందని, అప్పటి సిఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో సుమారు 21 లక్షల ఇళ్లు నిర్మించారని వివరించారు. అనంతరం బిఆర్‌ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చినప్పటికీ,

తరువాయి 2లో

## వైద్యుల పర్యవేక్షణలో సోనియాగాంధీ



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ స్వస్థతకు గురికావడంతో మంగళవారం రాత్రి ఆమె ఢిల్లీలోని సర్‌గంగారామ్ ఆసుపత్రిలో చేరారు. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, సోనియాగాంధీని నిశిత వైద్య పర్యవేక్షణలో ఉంచినట్లు వైద్యులు బుధవారం తెలిపారు. కడుపు, మూత్ర నాళంలోకి ఇన్ఫెక్షన్ సోకిందేమోనని వైద్యులు తదుపరి పరీక్షలు నిర్వహిస్తున్నారని, చికిత్సలో భాగంగా యాంటీబయాటిక్స్ కూడా ఇచ్చారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వాతావరణ మార్పుల కారణంగా గాంధీ అస్వస్థతకు గురయ్యారని, పరిశీలన కోసం ఆమెను ఆసుపత్రిలో చేర్చారని ఇంతకుముందు వర్గాలు తెలిపాయి.

## రష్యా–ఉక్రేన్ మధ్య పెరిగిన దాడులు

**13 రష్యా రీజియన్స్‌లో 400 డ్రోన్లు కూల్చివేత**

**మాస్కో:** ఇటీవలి నెలల్లో ఎన్నడూలేనివిధంగా ఉక్రేన్–రష్యా మధ్య గడచిన రెండు రోజులుగా భారీ దాడులు కొనసాగుతున్నాయి. ఉక్రేన్‌కు చెందిన 400 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణమంత్రిత్వశాఖ బుధవారం ప్రకటించింది. క్రిమియా పెనిన్సులా సహా 13 రష్యా రీజియన్స్‌పై బుధవారం తెల్లవారుముందే ఈ దాడులు జరిగాయని, వాటిని అడ్డుకున్నామని తెలిపింది. నాలుగు సంవత్సరాలక్రితం యుద్ధం ప్రారంభమైన తర్వాత ఈ మధ్య రెండు దేశాలమధ్యా జరిగిన పెద్ద దాడులు ఇవే. ఏడు రోజులుగా ఉక్రేన్ చేసిన దాడుల్లో 14 మంది రష్యన్లు మరణించారని, మరో 130 మంది గాయపడ్డారని తెలియజేసింది. బెల్గరోడ్, ఖెర్సన్,జపోర్జియా,బ్రాన్స్క్ రీజియన్స్‌లో ఎక్కువమంది ప్రజలు ఉక్రేన్ సైనిక దాడులవల్ల తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఈ ప్రాంతంలో డ్రోన్లు, రాకెట్లతో ఉక్రేన్ సైనికులు ఎక్కువ దాడులు చేస్తున్నారని చెప్పారు. రష్యాపై పెరుగుతున్న ఉక్రేన్ దాడులు గమనిస్తే ఆ దేశంలో డ్రోన్ల ఉత్పత్తి ఇటీవలికాలంలో గణనీయంగా పెరిగిందని తెలుస్తున్నది. గడచిన 24 గంటల్లో ఉక్రేన్‌లోని పలు ప్రాంతాలపై 1000 డ్రోన్లు, మరో 34 క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో ఆరుగురు ఉక్రేనియన్లు మరణించగా, మరో 50 మంది గాయపడ్డారు. ఉక్రేన్ చేసిన యువివి దాడుల్లో వారం రోజులుగా 117 మంది గాయపడ్డారని రష్యా అధికారులు చెప్పారు. రష్యన్ ప్రాంతాలపై వారం రోజులుగా 3000 పేలుడు పదార్థాలను ప్రయోగించిందని చెప్పారు. గడచిన ఇరవైనాలుగు గంటల్లో ఎక్కువగా బెల్గరోడ్ ప్రాంతంలోనే 125 యువిఎలను ఉక్రేన్ ప్రయోగించిందని, అనేకమంది ప్రజలు ఈ దాడుల్లో గాయపడ్డారని చెప్పారు. ఉత్తర మాస్కో లెనిన్‌గ్రాడ్ రీజియన్ గవర్నర్ అలెగ్జాండర్ డ్రోజ్‌డెంకో ఒక ప్రకటన చేస్తూ, తమ ప్రాంతంలో 56 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేసినట్లు చెప్పారు. అంతకుముందు మోల్దోవా–యూరోప్‌ల మధ్య విద్యుత్ అనుసంధానం చేసే కీలకమైన ఇంధన వనరులను, ఇంధన కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని రష్యా దాడులు చేసింది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఉక్రేన్‌లో యుద్ధం ఇటీవల కొంత చల్లబడినట్టు కనిపించినప్పటికీ గడచిన పాతిక రోజులుగా అడపాదడపా దాడులు–ప్రతిదాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

# చర్చలకు తిరస్కృతి : కొనసాగిన ఇరాన్ దాడులు

**● పశ్చిమాసియాలో సరికొత్త భద్రతా కూటమికి ఇరాన్ పిలుపు ● ప్రతిష్టాత్మకమైన అబ్రహాంలింకన్ నౌకపై దాడి ● లెబనాన్‌లో దాడులు : తొమ్మిదిమంది మృతి**



**దుబాయ్:** యుద్ధం ముగించేందుకు ముమ్మరంగా సంధి యత్నాలు జరుగుతున్నాయని ట్రంప్ ప్రకటించినప్పటికీ ఇరాన్ చర్చలను తిరస్కరించి పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలపై 26వ రోజు బుధవారం దాడులను కొనసాగించింది. ఇజ్రాయెల్‌లో ఉన్న ప్రధానమైన విద్యుత్ ప్లాంట్లపై ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. సెంట్రల్ ఇజ్రాయెల్‌లో క్లస్టర్ బాంబులతో దాడులు చేసింది. టెలీఅవీవ్ సమీపంలో జరిగిన ఈ దాడుల్లో 12 మంది గాయపడ్డారు.ట్రంప్ 15 అంశాల ప్రణాళిక ఒక వ్యూహాత్మక వైఫల్యంగా పేర్కొంటూ పశ్చిమాసియాలో అమెరికా–ఇజ్రాయెల్ ప్రమేయం లేని ప్రాంతీయ భద్రతా కూటమి పునర్నిర్మాణం ఏర్పాటుకు ఇరాన్ పిలుపునిచ్చింది. మరోవైపు 4,00,000 మంది వరకూ రిజర్విస్టు సైనికులను యుద్ధంలోకి రప్పించేందుకు ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.ఇంతకుముందు దీనిని 2.80 లక్షలమందికే పరిమితం చేసింది. యుద్ధం మధ్యలో ఇరాన్‌తో అమెరికా చర్చలను అపరిపక్వ చర్యగా ఇజ్రాయెల్ విమర్శించింది. అమెరికాతో చర్చలను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. దాడులను కొనసాగించింది. బలాబలాలపై కాకుండా ఇరాన్ చేస్తున్న వాదనలు ఇరాన్ ప్రధాన కార్యకారి నిశితంగా విమర్శించారు. ఇరాన్ ఎప్పటికీ చర్చలకు వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రధానంగా ఇజ్రాయెల్, జోర్డాన్,కువైట్,ఇరాక్,సౌదీ అరేబియా, బహ్రైన్ దేశాలే లక్ష్యంగా దాడులు చేసింది. పశ్చిమాసియాలో సరికొత్త భద్రతా కూటమి ఏర్పాటుకు పిలుపు ఇచ్చింది. అమెరికాకు అత్యంత ప్రతిష్టాత్మకమైన అబ్రహాంలింకన్ యుద్ధ విమానాల వాహకనౌకపై దాడి చేసింది. అబ్రహాంలింకన్ నౌక కదలికలను కనిపెట్టి ఉన్నామని, దానిపై దాడిచేసే తీరుతామని బహిరంగ ప్రకటన చేసిన కొద్దిసేపటికే తాము దాడులు చేశామని ఐఆర్‌జిసి ప్రకటించింది. ఇరాన్ సైన్యాలు అబ్రహాం లింకన్‌పై క్షిపణులు ప్రయోగిస్తున్న వీడియోలను విడుదల చేసింది. ఐతే దీనిపై అమెరికా వెంటనే స్పందించలేదు. కాగా దక్షిణ లెబనాన్ కోస్తాప్రాంత నగరం టైర్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో తొమ్మిదిమంది మరణించారు. ఇరాన్ హెచ్చరికలు చేసినప్పటికీ ఇజ్రాయెల్ సైన్యం ఇరాన్‌లో విస్తారంగా దాడులు కొనసాగించింది. ప్రభుత్వ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసింది. వాయువ్య ఇరాన్ క్యాపిటల్ నగరంపై దాడులు చేసింది. ఇస్ఫహాన్ ప్రాంతంలో భారీ దాడులు పూర్తయినట్లు ప్రకటించింది. ఇరాక్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణి దాడుల్లో ఎర్బిల్ భవనం మంటల్లో దగ్ధమైంది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఇరాన్ డ్రోన్ దాడిలో చమురు ట్యాంకర్ మంటల్లో దగ్ధమైంది. అనేక డ్రోన్లను తాము కూల్చివేశామని కువైట్ ప్రకటించింది. చమురు సమృద్ధి ప్రాంతమైన తూర్పు రాష్ట్రంపై ఇరాన్ ప్రయోగించిన ఎనిమిది డ్రోన్లను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా ప్రకటించింది. యుద్ధ పరిణామాలపై ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. లెబనాన్‌లో సంయమనం పాటించాలని ఇజ్రాయెల్‌ను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటొని గుటెర్రెస్ విజ్ఞప్తి చేశారు. లెబనాన్,పాలస్తినా ప్రజలపై హింసకు పాల్పడితే సహించబోమని శక్తిమంతమైన క్షిపణులతో దాడులు ఉద్ధృతం చేస్తామని ఇజ్రాయెల్‌కు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ హెచ్చరించింది. ఈ పరిణామాలమధ్య పశ్చిమాసియాకు కొత్తగా 1000 మంది అమెరికా సైనికులు తరలివస్తున్నారు. మరో 5000 మంది బహుముఖ యుద్ధ నైపుణ్యాలు గల సైనికులను మోహరించేందుకు పెంటగాన్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, పశ్చిమాసియాలో యుద్ధం ముగించేందుకు ట్రంప్ ప్రతిపాదించిన 15 అంశాల ప్రణాళికను ఇరాన్ తీవ్రంగా ఎగతాళి చేసింది. ఈ ప్రణాళిక ప్రతిపాదిత అమెరికా వ్యూహాత్మక వైఫల్యంగా అభివర్ణించింది. అమెరికా సైనిక స్థావరాల ఉనికికి ఇరాన్ ప్రశ్నించింది. వాటికి ఉన్న విలువ ఏమిటి? అవి ఎందుకు ఉండాలి? అని గల్ఫ్ దేశాలను నిలదీసింది. అమెరికా–ఇజ్రాయెల్ ప్రమేయం లేని పశ్చిమాసియాలో ఒక సరికొత్త ప్రాంతీయ భద్రతా కూటమి ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను నొక్కిచెబుతూ ఆ దిశగా చర్చలు తీసుకోవాలని ప్రతిపాదించింది.గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలకు ఉన్న విలువ వివరించాలని ప్రశ్నించింది. హోర్ముజ్ జలసంధి పెత్తనం ఉండకూడదని, పశ్చిమాసియాలో ఉన్న అమెరికా స్థావరాలను ఎత్తివేయాలని, ఈ ప్రాంతంలో ఉన్న ఆంక్షలను తొలగించాలని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ అమెరికాను డిమాండ్ చేసింది. కాగా ఈ డిమాండ్‌లను అమెరికా తిరస్కరించింది. 26 రోజులుగా పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంలో మరణించిన ఇరానీయుల సంఖ్య 1500 దాటింది. ఇజ్రాయెల్‌లో 16 మంది మరణించగా, 13 మంది అమెరికా సైనికులు ఇప్పటివరకూ యుద్ధంలో మరణించారు. లెబనాన్‌లో 1000 మంది మరణించారు. 10 లక్షలమంది ఇళ్ళుకోల్పోయి నిరాశ్రయులయ్యారు.

# మీలాంటి వాళ్ళతో రాజీకి వచ్చేదేలేదు : జోల్ఘదర్

**మీ ఓటమిని మా ఒప్పందంగా భావించొద్దు :సైనిక కమాండ్**

**టెహ్రాన్:** మీలాంటి వాళ్ళతో ఎప్పటికీ రాజీకి వచ్చేదిలేదని ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి (ఎస్ఎన్ఎస్‌సి) కార్యదర్శి బ్రిగేడియర్ మహ్మద్ బఘేర్ జోల్ఘదర్ అమెరికాకు స్పష్టం చేశారు.కొద్దిరోజులక్రితం ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో హతుడైన లారీజానీస్థానంలో ఎస్ఎన్ఎస్‌సి కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్న జోల్ఘదర్ బుధవారం మొదటిసారి మాట్లాడుతూ, 'మీ అంతర్గత కలహాలు మీలో మీరే చర్చలు జరిపేస్థాయికి చేరుకున్నాయా?' అని ప్రశ్నించారు. 'మా ఇస్లామిక్ రివల్యూషనరీగార్డ్ కోర్ శక్తిమంతమైన బలాధిక్యత, వారి మద్దతువల్లనే ఈ ప్రాంతంలో సుస్థిరత సాధ్యమని మీరు గుర్తించేవరకూ గతంలో ఉన్న చమురు ధరలనుగానీ, ఈ ప్రాంతంలో మీ పెట్టుబడులనుగానీ మీరు మళ్ళీ చూడటం సాధ్యంకాదు, మా సైనిక బలాధిక్యతవల్లనే సుస్థిరత వస్తుందని మీరు గుర్తించేవరకూ పాత చమురు ధరలు మీకు కనిపించవు'' అని హెచ్చరిక చేశారు. అదేవిధంగా ఇరాన్ ఏకీకృత ప్రధాన సైనిక కమాండ్ ఖతమ్ అల్–అన్బియా కేంద్ర కార్యాలయం అధికార ప్రతినిధి స్పందిస్తూ, అమెరికా తనంతట తానుగా ఇరాన్‌ను సమీపించిందని, ఎలాంటి చర్చలూ రెండు దేశాల మధ్యా జరగలేదని అన్నారు. ''మీ ఓటమిని ఒక ఒప్పందంగా భావించకండి'' అని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేశారు. ఈ 15 అంశాల ప్రణాళికతో మీరు విజయం సాధిస్తామని అనుకుంటున్నారా? అని విమర్శించారు. యుద్ధం మొదటి రోజు నుండీ ఇప్పటివరకూ మేం ఒకటే మాట చెబుతున్నాం, మీలాంటి వాళ్ళతో మే రాజీకి వచ్చేలేదు అన్నారు. అనేక విడతలుగా జరిగిన చర్చల్లో అగ్రశ్రేణి అమెరికా దౌత్యవేత్తలుగా సంభాషణలు చేసిన స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్‌లతో అస్సలు సమావేశాలు జరిపే ప్రసక్తే లేదని కూడా ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్‌తో యుద్ధానికి మొదటి నుండి అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ వ్యతిరేకంగా ఉన్నారు. దీంతో పాకిస్థాన్ రాజధానిలో చర్చలకు సన్నాహాలు జరుగుతున్నాయని వస్తున్న వార్త నేపథ్యంలో జె.డి.వాన్స్‌ను చర్చల్లో ప్రధాన అనుసంధానకర్తగా ట్రంప్ ముందుకు తీసుకువచ్చారు. జె.డి.వాన్స్ పట్ల ఇరాన్ నాయకులు సానుకూల దృక్పథంతో ఉన్నారని కూడా వార్తలు వెలువడ్డాయి. అమెరికాతో చర్చల ప్రశ్నేలేదని ఇరాన్ మొదటి నుండీ చెబుతూ వచ్చింది.ఇరాన్‌లో అత్యంత గౌరవనీయమైన నాయకుడుగా పరిగణిస్తున్న వ్యక్తితోనే మంతనాలు చేస్తున్నట్లు ట్రంప్ గడచిన రెండు రోజులుగా చెబుతున్నారు. ఆ గౌరవనీయమైన వ్యక్తి ఇరాన్ పార్లమెంటు స్పీకర్ బఘేర్ ఘాలిబాఫ్ అని అమెరికా పత్రికలు ప్రచారం చేశాయి. దీంతో ఆయన ప్రముఖంగా వార్తల్లోకి



వచ్చారు. అమెరికా అధికారులతో ఎలాంటి చర్చలూ జరగలేదని, అంతర్జాతీయ చమురు మార్కెట్లను, స్టాక్‌మార్కెట్లను తారుమారుచేయడం కోసం ఈ నకిలీ వార్తలను ఉపయోగించారని ఎక్స్ వేదికగా ఆయన ప్రకటించారు.

### చర్చలు జరగలేదు : పాక్‌లో ఇరాన్ రాయబారి

అమెరికా–ఇరాన్ మధ్య ఎలాంటి చర్చలూ జరగలేదని పాకిస్థాన్‌లో ఉన్న ఇరాన్ రాయబారి రెజా అమీరీ మోఘాదం చెప్పారు. ప్రత్యక్షంగానీ, పరోక్షంగా గానీ ఎలాంటి చర్చలూ జరగలేదన్నారు. బుధవారం మధ్యాహ్నం బ్రిటన్ మీడియా ఈ వార్త ప్రచురించింది. ఇరాన్‌లో అత్యంత గౌరవనీయుడైన నాయకుడితో అమెరికా సంభాషణలు చేస్తోందని సోమవారం సాయంత్రం ట్రంప్ ప్రకటించారు. ఇరాన్–అమెరికా మధ్య సయోధ్య కుదిర్చి శాంతి సాధించాలని మిత్ర దేశాలు ప్రయత్నాలు చేస్తున్నాయని, బలవంతంగా మామీద రుద్దిన ఈ యుద్ధం తొలగిపోయి వారు చేసే ప్రయత్నాలు ఫలవంతం కావాలని తాము కోరుకుంటున్నామని ఆయన వ్యాఖ్యానించారు.

# డెన్మార్క్ ఎన్నికల్లో ఫలించని ఫ్రెడరిక్సన్ 'ట్రంప్‌కార్డ్'

**కింగ్‌మేకర్‌గా అవతరించిన రాస్ముసేన్**



**కొపెన్‌హాగన్:** గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించేందుకు ట్రంప్ చేసిన ప్రయత్నాలను ప్రధాన నినాదంగా తీసుకుని గడువుకు ముందుగానే పార్లమెంటు ఎన్నికలు నిర్వహించిన ప్రధానమంత్రి మెట్టే ఫ్రెడరిక్సన్ పోలింగ్ ఫలితాల్లో ఎదురుదెబ్బ తిన్నారు. పెద్ద పార్టీగా అవతరంచినప్పటికీ ఆమెకు మెజారిటీ రాలేదు. దేశం కష్టకాలంలో, ప్రపంచం సంక్షోభంలో ఉందని, అందువల్ల మూడోసారి తాను ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానని, తనకు మద్దతు ఇవ్వాలని ఆమె ఇతర పార్టీలను కోరారు. ఇక మధ్యేవాద మోడరేట్‌పార్టీ 14 సీట్లు గెలుచుకుంది. ఈ పార్టీ ఎటు మొగ్గు చూపితే వారే దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి వచ్చింది. మోడరేట్‌పార్టీ నాయకుడు లార్స్‌లోక్కే రాస్ముసేన్ ఇప్పుడు డెన్మార్క్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో కీలకవ్యక్తిగా, కింగ్ మేకర్‌గా మారారు. గ్రీన్‌లాండ్ అంశాన్ని ఓట్లుగా మలచుకోవాలని ఆమె చేసిన ప్రయత్నం ఫలించలేదు సరికదా అధికార సోషల్ డెమోక్రటిక్‌పార్టీ ఈసారి భారీగా ఓట్లు నష్టపోయింది. 2022 ఎన్నికల్లో ఆమె పార్టీకి 27.9 శాతం ఓట్లు లభించగా, ఈసారి 21.9 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. తీర్పు ఎటూ తేలకపోవడంతో అనిశ్చితి ఏర్పడింది. మొత్తం 179 స్థానాలున్న పార్లమెంటులో 2022 నుండి సోషల్ డెమోక్రాట్స్ ప్రభుత్వ సంకీర్ణంలో భాగస్వాములుగా ఉన్న పార్టీలు కూడా నష్టపోయాయి. మితవాదులు,అతివాదులెవ్వరికీ మెజారిటీ రాకపోవడంతో తీర్పు ఎటూ తేలలేదు. డెన్మార్క్ చాలా చిన్నదేశం. ప్రపంచంలోనే అతిపెద్దదైన గ్రీన్‌లాండ్ ద్వీపం కూడా డెన్మార్క్‌లో ఒక అంతర్భాగంగా ఉంది. ఈ దేశంలో మొత్తం 60 లక్షలమంది మాత్రమే జనాభా ఉన్నారు. వీరిలో 40.30 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. గ్రీన్‌లాండ్ సార్వభౌమత్వం అనే అంశంపై ఓటర్లు పెద్దగా స్పందించలేదు.

## కొరత లేదు

(మొదటి పేజీ తరువాయి)

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీలు ఇంధన సరఫరాలను గణనీయంగా పెంచాయని ఆయన పేర్కొన్నారు. డిమాండ్‌నీ మించి సరఫరా కొనసాగుతోందని, బుధవారం 17,246 కిలో లీటర్ల డిమాండ్ ఉండగా 17,898 కిలోలీటర్ల సరఫరా జరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. అంటే 652 కిలో లీటర్ల అదనపు నిల్వ మిగిలిందన్నారు. దీనికి తోడు అదనంగా 16 వేల కిలోలీటర్ల ఇంధనం నిల్వ ఉంచడంతో పాటు 1200 అదనపు ట్యాంకర్లను వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. అయితే అదే సమయంలో షికార్లు చేస్తున్న పుకార్లను నమ్మి వినియోగదారులు కంటైనర్లలో, డబ్బాలలో పెట్రోల్, డీజిల్ ని తీసుకెళ్లడం పూర్తిగా చట్టవ్యతిరేకమైన చర్య అని అంతకుమించి ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్ గృహ వినియోగదారులకు అవసరమైన ఎల్‌పిజి సమృద్ధిగా అందుబాటులో ఉందని, ప్రజలెవరు అయోమయానికి గురి కావొద్దని, వదంతులను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మొద్దని రాష్ట్ర ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

## చలో అసెంబ్లీ ఉద్రిక్తం

(మొదటి పేజీ తరువాయి)

కేటాయించి, నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికే ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ. 9500 కోట్లు ఇవ్వాల్సి ఉందని, బడ్జెట్‌లో వాటి ఊసే లేదని, వెంటనే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీ మినహా మిగతా అన్ని యూనివర్సిటీలకు నిధులు తగ్గించారని, హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీల పెంపు లేదని, ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ పాఠశాలల నిర్మాణాలకు ఈ నిధులు ఎలా సరిపోతాయో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. అనంతరం పోలీసులు విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి, వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ నాగ జ్యోతి, బానోత్ రఘురాం నాయక్, రెహమాన్, లెనిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చైతన్య యాదవ్, సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, అన్వర్, అంజి, హరీష్, శివ అభిరాం, ప్రణీత్, శ్రావణి, చరణ్, భాను, అనిల్, ఉదయ్, దత్తు రెడ్డి, అశోక్, మురళి, సాయి ఆజాద్, సందీప్, అరుణ్, సిద్దు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## జీవన్‌రెడ్డి రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

లేఖలను విడుదల చేశారు. దీంతో పలువురు మహిళా కార్యకర్తలు కన్నీరు పెట్టారు. జగిత్యాల నుంచే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పతనం పలుకుతామంటూ శాపనార్థాలు పెట్టారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి తన అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నిప్పుల చెరిగారు. చేవెళ్ల ఎంపీ స్థానానికి సునీత మహేందర్ రెడ్డిని తొలుత అభ్యర్థిగా నిర్ణయించిన అనంతరం బిఆర్ఎస్ నుంచి వచ్చిన రంజిత్ రెడ్డికి టికెట్ ఇవ్వడంతో సీఎం రేవంత్ రెడ్డి సొంత పార్లమెంట్ మహబూబ్ నగర్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందన్నారు.

ఇదే తరహాలో సికింద్రాబాద్ ఎంపీగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్‌ను కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేయించడంతో ఓడిపోయిందని దీనికి సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన కారణమని ఆరోపించారు. పోచారం శ్రీనివాస రెడ్డి, వేం నరేందర్ రెడ్డిలు ఎవరని వారు కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు, సంబంధాలు ఏమున్నాయని వారికి ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ పదవులు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. విధిలేని పరిస్థితుల్లో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నామని సీనియర్ కాంగ్రెస్ నాయకుల హక్కులకు భంగం కలుగనివ్వమని హామీలు ఇచ్చిన ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణు గోపాల్, తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ల మాటలు నిలబెట్టుకోలేదన్నారు.

గత 20 నెలలుగా జగిత్యాలలో నన్ను కించపరిచేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలే నా రాజీనామాకు ప్రధాన కారణమన్నారు. అవకాశం వస్తే జగిత్యాలను జాతీయ స్థాయిలో గుర్తు వచ్చేలా అభివృద్ధి చేస్తానన్నారు.

## కుటుంబ పెద్దకే

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. అసెంబ్లీ లాబీల్లో బుధవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై వ్యక్తం చేసిన పలు సందేహాలను డిప్యూటీ నివృత్తి చేశారు. వచ్చే జూన్ 2వ తేదీన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నామని, ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.4,000 కోట్లు ప్రతిపాదించామని ఆయన పునరుద్ఘాటించారు.

## పెట్రోల్,డీజిల్ కొరత లేకుండా చూడాలి: వివేకానంద

**ప్రజాపక్షం/హైదరాబాద్:**నగరంలో పెట్రోల్, డీజిల్ కొరతపై బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం మీడియాతో ఎంఎల్‌ఎ కెపి వివేకానంద మాట్లాడుతూ నగరంలోని పలు పెట్రోల్ బంకుల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారని తెలిపారు.

డీజిల్, పెట్రోల్, గ్యాస్ అవసరాలకు అనుగుణంగా సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు స్పష్టమైన భరోసా ఇవ్వడంలో విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరాలకు అనుగుణంగా కేంద్రానికి నివేదిక ఇచ్చి నిల్వలను పెంచుకోవాలని సూచించారు.

## సయిదా అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. మహ్మద్ రెహ్మతుల్లా షరీఫ్, మహ్మద్ దానిష్, మిర్జా సోహైల్ బేగ్‌లు సోషల్ మీడియా ద్వారా తీవ్రవాద భావజాలాన్ని ప్రోత్సహిస్తూ, నిషేధిత ఉగ్ర సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలతో పట్టుబడ్డారు. ఈ అరెస్టుల తర్వాత దర్యాప్తు కొనసాగించగా, ఈ ముగ్గురు యువకులకు హైదరాబాద్‌కు చెందిన సైదాబేగంతో పాటు 12 మంది ఈ గ్రూప్‌లో ఉన్నారు. వెస్ట్ బెంగాల్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, మహారాష్ట్ర, ఢిల్లీలో కార్యకలాపాలను నిర్వహించేందుకు ఈ గ్యాంగ్ సిద్ధమైనట్లు అధికారులు గుర్తించారు.. దీంతో విజయవాడ పోలీసులు ప్రత్యేక బృందాన్ని హైదరాబాద్‌కు పంపి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు రెహ్మతుల్లా సోషల్ మీడియా ద్వారా విదేశీ హ్యాండ్లర్ల ప్రభావానికి లోనై జిహాదీ భావజాలానికి ఆకర్షితుడయ్యాడు. అతడు తనతో పాటు ఇతరులను కూడా రాడికలైజ్ చేయడానికి ప్రయత్నించినట్లు వెల్లడైంది. పోలీసుల సమాచారం ప్రకారం, ఈ నెట్‌వర్క్ సోషల్ మీడియా వేదికగా యువతను ప్రభావితం చేసి, తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడమే లక్ష్యంగా పనిచేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ మాడ్యూల్ బిఇఎన్ఎక్స్ (బెన్ఎక్స్) పేరుతో దేశవ్యాప్తంగా విస్తరించే ప్రయత్నం చేసినట్లు అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌లో అరెస్టు చేసిన సైదాబేగం పాత్రపై ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. ఆమె నేరుగా కుట్రలో పాల్గొన్నదా లేదా కేవలం ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లో భాగమా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనతో మరోసారి హైదరాబాద్‌లో రాడికలైజేషన్ నెట్‌వర్క్స్ ఉన్నాయనే అంశం చర్చనీయాంశంగా మారింది. అయితే భద్రతా సంస్థలు మాత్రం దేశవ్యాప్తంగా విస్తరించిన చిన్న మాడ్యూల్స్‌లో ఇది ఒక భాగమేనని, అప్రమత్తంగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొంటున్నాయి. మొత్తం మీద, విజయవాడలో ప్రారంభమైన ఈ ఉగ్ర కుట్ర కేసు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలకు విస్తరించడంతో, కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు సమన్వయంతో చర్యలు కొనసాగిస్తున్నాయి. ఇదిలా ఉంటే 2025 జూన్‌లో గుజరాత్ ఎటిఎస్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేయడంతో అప్రమత్తం అయిన సయిదా బేగం అమె అనుచరులు.. పోలీసులకు ఎటువంటి అనుమానం రాకుండా జాగ్రత్త తీసుకున్నారు. ఇన్స్టాగ్రామ్‌లో 'అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్' పేరుతో సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. అలాగే ఈ గ్రూపులో మిగిలిన సభ్యులు బీహార్ వాసి దిల్కాష్ సహా మిగిలిన వారి కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. కాగా ఈ ఉగ్ర కార్యకలాపాలకు సంబంధించిన కేసు వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు

(మొదటి పేజీ తరువాయి)

వాటిలో అనేక పనులు పూర్తి కాలేదన్నారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు పెండింగ్‌లో ఉండగా, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఈ ఇళ్ల పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. గతంలో కేటాయించిన 12 వేల ఇళ్లలో లబ్ధిదారులు ప్రవేశించకపోవడంతో వారికి మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, 6 వేల మంది మాత్రమే ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని తెలిపారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్ధిదారులకు కేటాయించనున్నట్టు మంత్రి చెప్పారు. ఈ నెల 31 నాటికి 1.12 లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తవుతున్నాయని, మరో లక్ష ఇళ్లు జూన్ నాటికి సిద్ధమవుతాయన్నారు. గతంలో సగంలో ఆగిపోయిన గృహ లక్ష్మి ఇళ్లకు కూడా నిధులు అందజేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించినట్టు తెలిపారు. నగరాల్లో, ముఖ్యంగా బస్తీలకు సమీపంగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఖమ్మం, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ వంటి నగరాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తామన్నారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం త్వరలో టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అసహనం**

గత అసెంబ్లీ సమావేశాల అనంతరం గృహ నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించకపోవడంపై స్పీకర్ గడ్డం ప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. గతంలో తాను ఆదేశించినా మంత్రి రివ్యూ చేయలేదని, ఇప్పటికైనా సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై స్పందించిన మంత్రి పొంగులేటి, త్వరలోనే అన్ని పార్టీల ప్రతినిధులతో ఉమ్మడి జిల్లాల వారిగా సమీక్ష నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

**పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత కెసిఆర్‌దే : బిఆర్ఎస్ ఎంఎల్ఎ తలసాని**

అంతకు ముందు బిఆర్ఎస్ ఎంఎల్ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను నెరవేర్చింది అప్పటి సిఎం కెసిఆర్ ప్రభుత్వం అన్నారు. మొత్తం 2.31 లక్షల ఇళ్లు మంజూరు చేసి, 1.62 లక్షల ఇళ్లు నిర్మించామని తెలిపారు. జంట నగరాల్లో 65 వేల ఇళ్లను లాటరీ విధానంలో పారదర్శకంగా కేటాయించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో కొత్త ఇళ్ల నిర్మాణం జరగలేదని విమర్శించారు. డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల నాణ్యతపై విమర్శలు చేస్తున్న వారు ప్రత్యక్షంగా వచ్చి పరిశీలించాలని శ్రీనివాస్ యాదవ్ సవాల్ విసిరారు.

# 15 అంశాల ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)

ఈ శాంతి యత్నాలు జోరు అందుకున్నాయి. మరో 5,000 మంది ఉభయచర సైన్యాలను (భూ–జలమార్గాల్లో పోరాడే నైపుణ్యం) పంపించేందుకు పెంటగాన్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే పశ్చిమాసియాలో ఎప్పటినుండో 50,000 మంది అమెరికా సైనికులు తిష్ఠవేసి ఉన్నారు. ఈ దౌత్య చర్యలను ఇరాన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించి బుధవారం తాజాగా మరిన్ని దాడులు చేసింది.

ఐతే ఇది ఉభయతారకంగా ప్రయోజనకరమైన ప్రణాళికేనా? అనే విషయంపై స్పష్టత లేకపోయినప్పటికీ, ఆయన ప్రణాళికలో ఎక్కువగా ఉన్నవి షరతులేనని అంతర్జాతీయ మీడియా పేర్కొంది.ఇజ్రాయెల్‌కు చెందిన ఛానెల్–12 కూడా ఈ ప్రణాళికపై ఒక నివేదిక ఇచ్చింది. ఐతే ఈ ప్రణాళికపై వైట్‌హౌస్ ఇంతవరూ ఎలాంటి ధృవీకరణ ఇవ్వలేదు, ఇరాన్ వర్గాలు కూడా వారితో (అమెరికా) చర్చల ప్రసక్తే లేదని చెబుతున్నాయి. ''ఆంక్షల సడలింపు, పౌర అణు కార్యక్రమాన్ని ఇరాన్ ఉపసంహరించుకోవడం, అస్సలు అణ్వాయుధం ఊసే ఎత్తకపోవడం, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) పర్యవేక్షణకు లోబడి ఉండటం, క్షిపణులకు పరిమితులు పాటించడం, హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను స్వేచ్ఛగా అనుమతించడం'' వంటి అవశాలు ఈ ప్రణాళికలో ఉన్నాయని పాకిస్థాన్ అధికారులు పేర్కొన్నారు. ఇరాన్‌లో ఉన్న మూడు ముఖ్యమైన అణుకేంద్రాలను ధ్వంసం చేయడం, ఇరాన్ వద్ద ఉన్న 450 కేజీల యురేనియంను ఐఎఇఎ సంస్థకుఅప్పగించడం, ఇరాన్‌లో అణుక్యార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయడం, హోర్ముజ్‌ను ఎలాంటి రుసుములూ వసూలు చేయకుండా తెరచి ఉంచడం వంటి షరతులు ట్రంప్ విధించారు. ఎంతో సంతోషంగా ఈ చర్చలు ఆతిథ్యం ఇవ్వడానికి తమ దేశం సిద్ధంగా ఉందని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చెప్పారు.

మరోవైపు అంతర్జాతీయస్థాయిలో మధ్యస్థంగా ఉన్న నాయకులు కూడా చర్చలకు అంగీకరించాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. చర్చలపై విశ్వాసం ఉంచాలని,సంభాషణల్లో పాల్గొనేందుకు అంగీకరించి అందరికీ సహకరించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఇరాన్ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. అవతలి నుండి పాకిస్థాన్ కూడా ఇరాన్‌పై ఒత్తిడి తెస్తోంది. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో సంభాషించారు.

మరోవైపు బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్, సౌదీ అబియా క్రౌన్ మధ్య కూడా పశ్చిమాసియా సమస్యపై చర్చలు జరిగాయి. ఖతార్ ప్రభుత్వం మాత్రం ఈ చర్చల ప్రక్రియలో తాము జోక్యం చేసుకోబోమని ప్రకటించింది.

ఇరాన్‌కు 15 అంశాల శాంతి ప్రణాళికను ట్రంప్ ప్రతిపాదించిన వెంటనే ప్రపంచవ్యాప్తంగా చమురు మార్కెట్లలో ముడి చమురు ధర ఐదూశాతానికి తగ్గింది. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 99.29 డాలర్ల కు (74.16 పౌండ్లు) తగ్గిపోయింది. యుద్ధం ముగించేందుకు ముమ్మర యత్నాలు జరుగుతున్నాయని ట్రంప్, ఎలాంటి శత్రుత్వంలేని తటస్థ దేశాలు హోర్ముజ్ జలసంధిని స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చునని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ప్రకటించడంతో ఈ పరిణామం సంభవించింది. అమెరికాలో కూడా చమురు ధర 5.5 శాతం మేరకు క్షీణించి బ్యారెల్ ధర 88.41 డాలర్లకు తగ్గిపోయింది.

**ఇరాన్ విలువైన బహుమతి ఇచ్చింది**

**అందరినీ సస్పెన్స్‌లో పెట్టిన ట్రంప్ ప్రకటన**

ఇరాన్‌తో చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ చెబుతుంటే, అదంతా అబద్ధమని ఇరాన్ చెబుతున్నది. రెండు రోజులుగా కొనసాగుతున్న ఈ గందరగోళంమధ్య ప్రపంచం సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతుంటే ట్రంప్ మాత్రం తాజాగా మళ్ళీ షాకులు మీద షాకులు ఇస్తున్నారు. ఇరాన్ నుండి ఒక అద్భుతమైన బహుమతి అందిందని ఆయన బుధవారం పాత్రికేయులకు చెప్పారు. యుద్ధం ముగించేందుకు చాలా మంచి సంభాషణ జరిగిందని చెప్పారు. అదేమిటో ఆయన వివరించలేదు కానీ ''గుడ్‌విల్ గెశ్చర్''లో భాగంగా ఇరాన్ చాలా విలువైన, చమురు, సహజవాయువు, హోర్ముజ్ జలసంధి సంబంధమైన బహుమతి (ట్రెమండస్ ఎమౌంట్ ఆఫ్ మనీ) ఇచ్చింది, కానీ అదేమిటో నేను మీకు చెప్పదలచుకోలేదు, కానీ అది నాకెంతో విలువైన బహుమతి'' అని ట్రంప్ చెప్పినట్లు బుధవారం ఇజ్రాయెల్ పత్రిక ప్రకటించింది. ఇరానీయులను ఎందుకు నమ్ముతున్నారని పాత్రికేయులు ప్రశ్నించగా, తాను నమ్మడం లేదని చెబుతూ, ''నిన్నవారు ఒక అద్భుతమైన పనిచేశారు, వారు ఒక బహుమతి ఇచ్చారు, అది ఈరోజు అందింది, సొమ్ము పరంగా అది చాలా విలువైనది,కానీ అది చాలా ముఖ్యమైనది'' అన్నారు.

అణ్వాయుధాలను వదిలిపెట్టేందుకు కూడా ఇరాన్ అంగీకరించిందని ఆయన అన్నారు. అణువిధానంలో ఇరాన్ భారీ మార్పులు చేసుకుంటుందని, అణ్వాయుధాలు తయారు చేయబోమని స్పష్టమైన హామీ ఇచ్చిందని ఆయన ఇదే సందర్భంగా అన్నారు.

రెండు రోజులక్రితం (మార్చి 23 రాత్రి) పొద్దుపోయాక ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎక్కే సమయంలో కూడా పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ, అణ్వాయుధాలను పూర్తిగా వదలిపెట్టేందుకు ఇరాన్ అంగీకరించిందని చెప్పారు. కానీ ఇరాన్ మాత్రం, తమ అణుకార్యక్రమం శాంతియుతమైనదని, అణ్వాయుధాలకు తాము వ్యతిరేకమని ఎప్పటినుండో ప్రకటిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ''వారు చర్చలు కోరుకుంటున్నారు, మేం ఇరాన్‌లో సరైన వ్యక్తులతో సంభాషిస్తున్నాం, అన్ని సమస్యలూ త్వరలో పరిష్కారమవుతాయి'' అని ట్రంప్ చెప్పారు.

ఇరాన్ వ్యవహారంలో తాజా కీలక పరిణామం చోటు చేసుకుందని ఆయన అన్నారు. ''వారి నుండి చాలా పెద్ద బహుమతి వచ్చింది'' అంటూ ఆయన ఉత్సాహం ప్రదర్శించారు.

# వైద్య విధాన పరిషత్ రద్దు బిల్లుకు ఆమోదం

## అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి దామోదర్ రాజనర్సింహ





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ వైద్య విధాన పరిషత్(రద్దు) బిల్లు శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. శాసనసభలో రాష్ట్ర వైద్య విధాన పరిషత్ (టివివిపి) రద్దు బిల్లును వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై సభలో విస్తృత చర్చ జరిగింది. బిల్లుకు సిపిఐ, ఎంఐఎం, బిజెపి, బిఆర్ఎస్ సభ్యులు ఆమోదం తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య సేవల సమర్థవంతమైన అమలు కోసం పరిపాలనా వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం అవసరమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న వైద్య విధాన పరిషత్ వ్యవస్థలో పలు పరిమితులు ఉన్నాయని, సేవలు వేగం నాణ్యతను మెరుగుపరచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఉద్యోగుల హక్కులు, సేవా భద్రతకు ఎటువంటి భంగం కలగదని హామీ ఇచ్చారు. వైద్య సేవలను మరింత ప్రజలకు చేరువ చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ చట్టం, 1986 కింద తెలంగాణ విధాన పరిషత్(టివివిపి) ఒక స్వతంత్ర్య గ్రాంట్‌ఇన్‌ఎయిడ్ సంఘంగా ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ జిల్లా దవాఖానాలు, ప్రాంతీయ దవాఖానాలు, సముదాయక ఆరోగ్య కేంద్రాలు, సివిల్ డిస్పెన్సరీలతో పాటుగా ద్వితీయ స్థాయి ఆరోగ్య గ్రాంట్ల కింద నిధిని సమకురుస్తున్నదన్నారు. జీతాల నిమిత్తం 310/311 సహాయక గ్రాంట్ల పద్దు జీతాలు, కాక ఇతర వ్యయం 310/311 పద్ద కింద ఖాతాల నిర్వహణ జరుగుతుందన్నారు. స్వయం పాలన కొరకు చట్టబద్ధమైన ఏర్పాటు ఉన్నప్పటికీ, జీతాలు, భత్యాలు, పదవీ విరమణ ప్రయోజనాలన్నింటి కొరకు ప్రభుత్వంలోని ఆర్థిక శాఖ ముందస్తు ఆమోదం అవసరమున్నందున, తెలంగాణ వైద్య విధాన పరిషత్‌కు ఆర్థిక స్వేచ్ఛ లేకపోవడంతో నిరోధంగా మారాయన్నారు. దీనితో ప్రత్యేక వైద్యుల నియామకం, ద్వితీయ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను అందించటంలో, చెల్లింపులు అలస్యమై ఉద్యోగుల మనోధైర్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందన్నారు. ఉద్యోగులు, వారికి రావాల్సిన జీతాలు, ప్రయోజనాలు 010 పద్దు ద్వారా సకాలంలో చెల్లింపులు చేసేందుకుగాను నేరుగా ఖాజానా తీసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

### వైద్య విధాన పరిషత్‌లో సంస్కరణ ఆహ్వానించదగ్గ అంశం : కూనంనేని

తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో సంస్కరణలు తీసుకరావడం ఆహ్వానించదగ్గ అంశామని సిపిఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. ఆస్పత్రులలో వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా ఉందన్నారు. సమాజంలో విద్య, వైద్యం అత్యంత ముఖ్యమన్నారు. బడ్జెట్‌లో కేవలం 4 శాతం మాత్రమే నిధులు కేటాయించారని, బడ్జెట్‌లో నిధులు పెంచాలని కోరారు. గతంలో కొత్తగూడెంలో వైద్య సేవలు బాగుడేవని తెలిపారు. మాత శిశు ఆస్పత్రిలో బాధ్యత లేకుండా ఉందన్నారు. అత్యవసర కేసులను తమతో కాదని బయటకు పంపిస్తున్నారని చెప్పారు. ఆస్పత్రులలో మందులు ఉండటం లేదన్నారు. ఎక్స్‌రే మిషన్‌లు పనిచేయడం లేదన్నారు. పల్వాంచ ఆస్పత్రిలో సౌకర్యాలు లేక వైద్యులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ఆస్పత్రి కమిటీలలో ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించేవారని, ప్రస్తుతం కలెక్టర్ పరిధిలో కమిటీ ఉంటుందని, ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించాలన్నారు. పాల్వంచకు వంద పడకల ఆస్పత్రి మంజూరు చేయాలని కోరారు.

### బిల్లును స్వాగతిస్తున్నం : హరీశ్ రావు

తెలంగాణ వైద్య విధాన పరిషత్ రద్దు బిల్లును స్వాగతిస్తున్నామని బిఆర్ఎస్ ఎల్‌పి ఉప నాయకుడు టి.హరీశ్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆశ వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇస్తామని హామీనిచ్చిందని, హామీ ఎప్పటి నుంచి నేరవేరుస్తారని ప్రశ్నించారు. కెసిఆర్ కిట్ బంద్ చేశారని, దాని స్థానంలో తీసుకొస్తామన్న కొత్త పథకం ఎప్పుడు తెస్తారన్నారు. సిద్ధిపేటలో ఆస్పత్రి, నర్సింగ్ కాలేజ్‌ల పనులు 90 అయ్యాని, మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయాలని కోరారు.

### టివివిపి ప్రభుత్వం విలీనం మంచి పరిణామం : పాల్వాయ్ హరీశ్ బాబు

టివివిపిని ప్రభుత్వంలో విలీ నం చేయడం మంచి పరిణామని బిజెపి ఎమ్మెల్యే పాల్వాయ్ హరీశ్ బాబు అన్నారు. రాష్ట్రంలో మూడు స్థాయిలలో ఆస్పత్రులు ఉన్నాయన్నారు. ఆస్పత్రులలో సిటీస్కాన్, అల్ట్రాసౌండ్, ఎంఆర్ఐ లాంటి మిషన్‌లు, పరికరాలు సమకూర్చాలని కోరారు. చాలా చోట్ల ఎక్స్‌రే మిషన్‌లు పనిచేయడం లేదన్నారు. ప్రాథమిక వైద్య కేంద్రాల్లో వైద్యులు ఉండటం లేదన్నారు. వైద్యులు, వైద్య సిబ్బందిని నియాకం జరపాలని హరీశ్ బాబు ప్రభుత్వాన్ని కోరారు.

# ప్రతి మండలంలో ఒక 'సోలార్ విలేజ్'

## ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శాసనసభలో బుధవారం ప్రశోత్తరాల సమయంలో సోలార్ పవర్ ప్రాజెక్టులపై కాంగ్రెస్ సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, పైలట్ ప్రాజెక్టు కింద పూర్తిస్థాయిలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 81 గ్రామాల్లో గృహ, వ్యవసాయ అవసరాల కోసం పైలట్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయన్నారు. దీని ద్వారా 38,216 గృహాలకు, అలాగే 16,078 వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 'పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ' పథకం కింద రాష్ట్రంలో 40,349 గృహాలపై 2 కిలోవాట్ల సామర్థ్యం గల రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్స్‌ను ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు భట్టి విక్రమార్క సభకు తెలిపారు. పిఎం కుసుమ్ కాంపోనెంట్‌సి కింద 7.5 కిలోవాట్ల హైరైజ్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా 16,708 వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు వివరించారు. రాష్ట్రంలో పర్యావరణ హితమైన విద్యుత్ ఉత్పత్తిని పెంచడం ద్వారా అటు రైతులకు, ఇటు సామాన్య ప్రజలకు విద్యుత్ భారాన్ని తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు.

### పేదల సంక్షేమం అంటే ప్రతిపక్షానికి గిట్టదు : భట్టి విక్రమార్క

రాష్ట్రంలోని పేదల సంక్షేమం గురించి మాట్లాడేటప్పుడు వినే ఓపిక లేకనే ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీ నుంచి పారిపోయారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. అసెంబ్లీలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడ్జెట్‌పై జరిగిన చర్చకు సమాధానం వినకుండా సభను వీడటం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. గత పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మాయ మాటలతో మోసం చేసిందని భట్టి విక్రమార్క విమర్శించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో భ్రమలు కల్పించి ఓట్లు వేయించుకున్నారే తప్ప, ఏ ఒక్క పేదవాడికి ఇల్లు కట్టించి ఇవ్వలేదన్నారు. కీ.శే. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల స్ఫూర్తితోనే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందన్నారు. బడ్జెట్‌లో నిధులు తగ్గించామని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం పట్ల డిప్యూటీ సిఎం అభ్యంతరం వ్యక్తం చేశారు. రూ.22,500 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పేదవాడికి ఇల్లు లేకుండా ఉండకూడదన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

### 'ఇల్లు కట్టండి – బిల్లు తీసుకోండి'


పేదలు ఇల్లు కట్టుకునే ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. హౌసింగ్ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో పనులు వేగవంతం చేస్తున్నామని, గతంలో మాదిరిగా నెలల తరబడి వేచి చూడకుండా వారానికోసారి బిల్లులు చెల్లించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ పేదల ఆత్మగౌరవం కోసం వెనకడుగు వేయం. నిధులు సిద్ధంగా ఉన్నాయి. నిర్మాణాలు ఎంత వేగంగా జరిగితే అంత త్వరగా నిధులు విడుదల చేస్తాం' అని ఆయన అన్నారు. ఇప్పటి వరకు లబ్ధిదారులకు సుమారు రూ.5,000 కోట్ల వరకు బిల్లులు చెల్లించామని, క్షేత్రస్థాయిలో నిర్మాణాలు ఇంకా వేగవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఎమ్మెల్యేలందరూ తమ నియోజకవర్గాల్లో పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# బిఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుంటే తప్పేంటి?

## బిజెపి ఎంఎల్ఎ రాకేష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో భవిష్యత్తులో బిఆర్ఎస్‌తో కలిసి పోటీ చేస్తే తప్పేంటని బిజె పి ఎంఎల్ఎ పైడి రాకేష్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాజకీయాల్లో ఎన్నికల పొత్తులపై ఆయ న ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో పొత్తులు పెట్టుకోవడం, విడిపోవడం చా లా సహజమని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ లాబీల్లో మంగళవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మా ట్లాడారు. గతంలో తెలుగుదేశం పార్టీతో బిజెపి పొ త్తు పెట్టుకున్న విషయాన్ని రాకేష్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. 'గతంలో మేం టిడిపితో కలి సి పోటీచేశాం, ఆ తర్వాత విడిపోయాం. మళ్లీ కలి సి పోటీచేసి కేంద్రంలో, ఎపిలో అధికారంలోకి వచ్చాం. ఇప్పుడు తెలంగాణలో కూడా బిఆర్ఎస్‌తో కలిసి పోటీ చేస్తే అధికారంలోకి రావొచ్చు కదా?' అ ని ఆయన వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో నిలదొక్కుకోవడానికి ఇతర పార్టీల సహా యం తీసుకోవడంలో తప్పు లేదని రాకేష్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. 'నడవడానికి మనకు ఒక కాలు ఇబ్బందిగా ఉన్నప్పుడు, తా త్కాలికంగా మరొకరి సాయం తీసుకుంటాం. రాజకీయాల్లో కూడా మనం నిలదొక్కుకునేందుకు మరొకరి సాయం తీసుకుంటే తప్పేముంది?' అని ఆయన అన్నారు.

# ఇప్పపువ్వు సారా వల్ల గిరిజనులు అభివృద్ధి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ఆదివాసీలు,ఎస్‌టిలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా 'ఇప్ప పువ్వు సారా' తయారీని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎంఎల్ఎ జానంపల్లి అనిరుధ్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇప్ప పువ్వు ఉత్పత్తులను దేశ విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతుందని, గిరిజనులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇప్ప సారాను ప్రోత్సహిస్తే పదేళ్లలోనే విదేశీ మద్యాన్ని అధిగమించవచ్చని సూచించారు. 'ఇప్పపువ్వు'తో ఐస్‌క్రీమ్, కేక్స్,లడ్డూలు, బిస్కెట్లను రక రకాల ఆహార పదార్థాలను తయారు చేయవచ్చన్నారు. శాసనసభలో బుధవారం ''వ్యవసాయ, వాణిజ్యపన్నులు, పర్యాటక సాంస్కృతిక' తదితర పద్దులపైన జరిగిన చర్చలో జానంపల్లి అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చత్తీస్‌ఘడ్‌లో సుమారు 1.6 లక్షల మంది ఇప్పపూల సేకరణ ద్వారా ఉపాధి పొందుతున్నారని, మధ్యప్రదేశ్‌లో 'మాం డ్' అనే డ్రింక్ బాటిల్ రూ. 800 చొప్పున విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారని వివరించా రు. ఇక్కడి ఇప్పపువ్వులతో విదేశాల్లో వ్యా పారం చేస్తున్నారని వివరించారు. బ్రిటీష్ కాలంలో విధించిన పాత నిబంధనలను పక్కన పెట్టి, ఆధునిక పద్ధతుల్లో ఇప్ప ఉత్పత్తులను ప్రోత్సహించాలని అనిరుధ్ రెడ్డి డి మాండ్ చేశారు. తన నియోజకవర్గ పరిధిలోని తాండాల ప్రజలు గతంలో ఇప్పసారా తాగి వందేళ్ల వరకు ఆరోగ్యంగా జీవించారని గుర్తు చేశారు. ఇప్ప పువ్వును టీలో కలిపి తీసుకోవడం వల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుందని, ఆరోగ్యపరంగా మేలు జరుగుతుందని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా అనిరుధ్ రెడ్డి ప్రసంగం ముగియగానే రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అభినందిస్తూ స్వయంగా అనిరుధ్‌రెడ్డి వద్దకు వెళ్లి కరచలనం చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ ఎంఎల్ఎలు కూడా ఆయనను అభినంధిస్తూ కరచలనం చేశారు.


తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

Gaz. No. 56/2026

సంఖ్య. G2/790/2025 తేదీ. 18.02.2026

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

ఫారం. VII

(Declaration) రూఢీ ప్రకటన

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలములోని మేడిపూర్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్లో ఉదహరించిన **ఎ 0.15 గుంటలు** భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 28 (ML-15 Minor of MJR -1) నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ.లు 0.15 గు.** భూమి డిస్ట్రిబ్యూటరి కెనాల్ 28 (ML-15 Minor of MJR -1) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము: మేడిపూర్ మండలం: తాడూర్ జిల్లా: నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నం./సబ్ డి. నం. | పట్టా/ఇనాం etc., | భూమి వర్గీకరణ మెట్ట/తరి | సేకరించబడు భూమి విస్తీర్ణం ఎ. గుంటలు | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు [illegible] | [illegible] | నిర్మాణములు [illegible] | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 124 | పట్టా | మెట్ట | 0.15 | పెరుమాల్ల ఈశ్వరమ్మ భర్త రాములు<br>పెరుమాల్ల చంద్రయ్య తండ్రి లక్ష్మ య్య<br>పెరుమాల్ల వెంకటయ్య తండ్రి రాములు<br>ఎ. లావణ్య భర్త నర్సింహ్మ<br>చలిచీమల శ్రీలత భర్త శ్రీనివాసులు<br>జమ్ముల సతీష్ రెడ్డి తండ్రి జనార్ధన్ రెడ్డి<br>పెరుమాల్ల లక్ష్మ య్య తండ్రి పరుశరాములు<br>పెరుమాల్ల రాంచంద్రయ్య తండ్రి పెద్ద లక్ష్మ య్య<br>పెరుమాల్ల వెంకటమ్మ భర్త మల్లయ్య<br>గాని హరిత భర్త కృష్ణ కుమార్<br>పెరుమాల్ల శాంతయ్య తండ్రి రామస్వామి<br>పూడూరు గెల్వమ్మ భర్త రాములు | 125 | 123 | 123 | 126 | లేవు | లేవు | లేవు | లేవు |
| | మొత్తం | | | 0.15 | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013 లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంభందించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢి ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-1, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్


సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్

సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO NO. 1327/LA/PP/Advt/Pub/2025-26


# 'చేనేత రంగం' పరిరక్షణకు ఐక్య పోరాటం


## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చేనేత కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వంఒద్ద్కటకి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. పోరాటాల ఫలితంగా సాధించుకున్న పథకాలైన జాతీయ చేనేత బోర్డు, హాండిక్రాఫ్ట్ బోర్డు, మహాత్మా గాంధీ బునకర్ బీమా యోజన, ఐసిఐసిఐ లాంబార్డ్ హెల్త్ స్కీమ్, హౌస్ కమ్ వర్క్ షెడ్ పథకాలను అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. చేనేత పరిశ్రమ ముడి సరుకులైన రంగులు, రసాయనాలతో పాటు చేనేత చీరలపై జిఎస్‌టి విధించి, దేశ వ్యాప్తంగా చేనేత పరిశ్రమను చావు దెబ్బ తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత రంగం అనేది వ్యవసాయం తర్వాత అత్యంత పురాతనమైన రంగం అని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. చేనేత పరిశ్రమ, చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. కూనంనేని సాంబశివరావు, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, బిఆర్ఎస్ ఎంఎల్‌సి ఎల్.రమణ తదితరులు హాజరై దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా, యంత్రాలు ఎన్ని వచ్చినా సరే, చేనేత కార్మికుడు నేసిన వస్త్రాలకు సాటి రాదని అన్నారు. చేనేత రంగంపై లక్షలాది మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని, కాబట్టి ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలపై స్పందించి, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా చేనేత పరిశ్రమను ఆధునిక పరిశ్రమలుగా అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. గతంలో ప్రజలు ధర్నాకు చేస్తే ప్రభుత్వం నుంచి మంత్రి లేదా ఉన్నతాధికారి వచ్చి వారి సమస్యను తెలుసుకుని, వారిని ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లడంతో పాటు సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించేవారని, ప్రస్తుతం అలాంటి ధోరణి మాయమైందని చెప్పారు. ప్రజల స్వేచ్ఛను పాలకులు హరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హక్కులు అడిగితే ఇచ్చే పరిస్థితి లేదని, పోరాడి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. 2026 27 రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ. రెండు వేల కోట్లు, టెక్స్ టైల్స్ పవర్‌లూమ్‌కు రూ. రెండు వేల కోట్లు వేరు వేరుగా కేటాయించాలని చేనేత కార్మికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, వనం శాంతి కుమార్, గంజి మురళిధర్ తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడిపై దృష్టి పెట్టాలి

- రూ.500 కోట్లతో కొత్త గోదాముల నిర్మాణం
- మార్కెటింగ్ వ్యవస్థ బలోపేతానికి భారీగా నిధులు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రైతులు పంట మార్పిడిపై దృష్టి సారించాలని, సంప్రదాయ పంటల నుంచి లాభసాటి పంటల వైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. శాసనసభలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు బాలూ నాయక్ నేనావత్, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, చిక్కుడు వంశీ కృష్ణ, బిఆర్ఎస్ సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. తెలంగాణ నేలలు ఆయిల్ పామ్ సాగుకు అత్యంత అనుకూలమని అన్నారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల ఎకరాల్లో ఈ పంట వేసేందుకు అవకాశం ఉందని, దీనిని రైతులు అందిపుచ్చుకోవాలని కోరారు. ఇటీవల అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, పంట నష్టం వివరాలను సేకరించి త్వరలోనే ప్రకటన చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిందన్నారు. రూ.500 కోట్ల వ్యయంతో 5 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల 126 కొత్త గోదాములను నిర్మించినట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,377 గోదాములు ఉండగా, వాటి మొత్తం నిల్వ సామర్థ్యం 80.54 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉం దన్నారు. రానున్న రెండేళ్లలో మరో 5 లక్షల మెట్రి క్ టన్నుల అదనపు సామర్థ్యం కోసం మరిన్ని గోదాములను నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆయన వివరించారు. రైతుల పంటను వర్షాల నుంచి రక్షించేందుకు, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేశామన్నారు. 2023 నుంచి 2026 వరకు మార్కెటింగ్ కార్యకలాపాల కోసం రూ.116 కోట్లు కేటాయించామని, ఈ సీజన్‌లో రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రైతులకు ఇప్పటికే డ్రిప్, స్ప్రింక్లర్ సెట్లను అందజేశామని, అవసరమైన చోట మరిన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. 2023తో పోల్చితే 2024లో టార్పాలిన్లు 1,37,654, ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలు 3,916, తేమ కొలిచే మీటర్లు 4,131, ప్యాడీ క్లీనర్లు 1,611 కొనుగోలు చేశామని, ఈ కొనుగోళ్లకు మొత్తం రూ.81.73 కోట్లు ఖర్చు చేశామని మంత్రి వివరించారు.

# యుద్ధంతో ఎప్పడూ ప్రపంచ మానవాళికి పరాభవమే

## 'యుద్ధం వద్దు' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యుద్ధంతో ఎప్పుడూ ప్రపంచ మానవాళికి పరాభవమేనని, అణుశక్తి, ఆయుధాలు, కృత్రిమ మేధ మానవ హననంలో భాగమని, ప్రపంచ శాంతి కొసం ప్రతి ఒక్కరం నినదిద్దామని పలువురు కవులు, కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధాన్ని నిరసిస్తూ యుద్ధ వ్యతిరేక కమిటి ఆధ్వర్యంలో ఈనెల 29న నిర్వహించనున్న యుద్ధ వ్యతిరేక ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ ర్యాలీకి మద్దతుగా తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో 'యుద్ధం వద్దు' అనే అంశంపై కవులు, గాయకుల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యుద్ధ వ్యతిరేక కమిటీ చైర్మన్, టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ ఏలాంటి కారణంగా లేకుండా ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధం ఇలాగే కొనసాగితే ప్రజలు మరింత తీవ్ర ఇబ్బందులు పడడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ సైతం తీవ్రంగా నష్టపోనుందని హెచ్చరించారు. ఈ యుద్ధాన్ని నిలువరించేందుకు ప్రధాని మోదీ తక్షణమే ప్రపంచ దేశాలను కూడగట్టి అమెరికాపై ఒత్తిడి తేవాలన్నారు. ఇందు కోసం ఈనెల 29న నిర్వహించనున్న యుద్ధ వ్యతిరేక ర్యాలీలో ఎవరికి వారు స్వచ్ఛంధంగా భాగస్వామ్యం కావాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ మాట్లాడుతూ రష్యా, చైనా దేశాలు అమెరికాను కనీసం పట్టించుకోవడంలేదని, కానీ భారత ప్రధాని మోదీ ఏదో బలమైన లోసుకు ఉన్న కారణంగా ట్రంప్‌కు లొంగిపోయారన్న అనుమానం కలుగుతుందన్నారు. ప్రజానాట్యమండలి ఉమ్మడి ఎపి రాష్ట్ర కార్యదర్శి శాంతారావు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహారం ఓ పిచ్చివాని స్వర్గంలా ఉన్న నేపథ్యంలో శాంతి ఒక అవసరంగా ప్రపంచం ఇప్పుడు ఒక చైతన్యవంతమైన సమాజం వైపు నడవాలన్నారు. కవి యాకుబ్ మాట్లాడుతూ యుద్ధం కారణంగా పరోక్షంగా ఈ దేశంలోని సామాన్య ప్రజలు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇది ఇలాగే కొనసాగితే పెను భారంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు చక్రాల రవి, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ప్రజాసంఘాల నాయకులు ఎన్.జ్యోతి (తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య), వలీ ఉల్లా ఖాద్రీ, ఎన్.శ్రీకాంత్ (ఎఐవైఎఫ్), కె.శ్రీనివాస్, వేణు గోపాల్ చారి, హేమలత (ప్రజానాట్యమండలి) తదితరులు ప్రసంగించారు.

# అసెంబ్లీలో రవాణా మంత్రి చెప్పేవన్నీ అబద్ధాలే

## టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాల కాలంలో ఏడు సార్లు జరిగిన అసెంబ్లీ సమావేశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్‌టిసి సమస్యలపై ప్రతిపక్ష సభ్యులడిగిన ప్రశ్నలకు ఒకే రకమైన సమాధానం రిపీట్ చేస్తూ కార్మిక సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి. మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి అన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం గురించి గత బిఆర్ఎ స్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి, గవర్నర్‌తో గెజిట్ పబ్లిష్ చేసినప్పటికీ ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు విలీనం గురించి తీసుకున్న చర్యలు శూన్యమన్నా రు.


సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: కుత్బుల్లాపూర్ జోన్

| NIT No. | పనుల సంఖ్య | అంచనా విలువ (రూ. లక్షలలో) | బిడ్ దాఖలు ప్రారంభ తేదీ & సమయం / బిడ్ దాఖలు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 08/SE/ QBZ/CMC/ 2025-26, తేదీ: 25.03. 2026 | 2 | 147.00 | 26.03.2026న మ.12.30గం.ల నుండి 30.03.2026న మ.12.30గం.ల వరకు | సూపరింటెండింగ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ జోన్. 7995468066, 7331181426 |
| | | 53.00 | 26.03.2026న మ.12.30గం.ల నుండి 02.04.2026న మ.12.30గం.ల వరకు | సూపరింటెండింగ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ జోన్. 7702203156, 7331189186 |

మరిన్ని వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.inలో పొందుపరచడమైనది.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, కుత్బుల్లాపూర్ జోన్, సిఎంసి.

DIPR R.O. No. : 17612-PP/CL/ADVT/1/2025-26, Date: 25-03-2026

# ప్రజా స్వరం సురవరం

## దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన అగ్ర నాయకుడు

### 'ప్రజలతో నా ప్రయాణం' పుస్తక ఆవిష్కరణలో వక్తలు



**విజయవాడ:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం తన గళాన్ని వినిపించిన ప్రజా స్వరం సురవరం సుధాకర్‌రెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. విజయవాడలోని చంద్రం బిల్డింగ్స్‌లో బుధవారం సిపిఐ అగ్ర నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి 84వ జయంతి సందర్భంగా ఆయన స్వీయ రచనలో వెలువడిన 'ప్రజలతతో నా ప్రయాణం' పుస్తకావిష్కరణ కార్యక్రమం సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగింది. పుస్తకం ఆవిష్కరణ అనంతరం పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మంచి పట్టు కలిగి మేధావుల నుండి పామరుల వరకు మెప్పించిన నాయకుడు సురవరం అన్నారు. రాజకీయ నిర్ణయాలపై చాలా స్పష్టంగా ఉండేవారని తనతో నా రాజకీయ జీవితం ముడిపడి ఉందన్నారు. అనేక రకాలుగా అవమానాలు , తిట్లు, పొగడ్తలు అనుభవాల్లో కూడా కమ్యూనిస్టు పార్టీ సైద్ధాంతిక నిర్ణయాలకు కట్టుబడి పార్టీ కోసం పనిచేశారని అన్నారు. పార్టీ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఎంతో వేగంగా తీర్మానాలు వ్రాసే గొప్ప మేధాశక్తి గల నాయకుడుని పేర్కొన్నారు. అటువంటి నాయకుడు చివరిరోజుల్లో ఆయన పడిన బాధను తాను స్వయంగా చూశానని కారుణ్య మరణం చట్టం అవసరమనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిపారు. దేశంలో పరిస్థితులు నానాటికి క్షీణిస్తున్నాయని కలుషితమైన రాజకీయాలతో ప్రజలను తప్పుదారిపట్టిసున్న పరిస్థితి ఉందని ప్రజల పక్షంగా నిలిచిన సురవరం సుధాకర్‌రెడ్డిని వంటి నాయకులు దేశానికి అవసరమని ఆయనను స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకష్ణ మాట్లాడుతూ ఉన్నతమైన కుటుంబంలో పుట్టి సాధారణమైన జీవితం గడుపుతూ ప్రజల కోసం పనిచేశారని అన్నారు. విద్యార్థి, యువజన నాయకుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి కమ్యూనిస్టు పార్టీ అగ్రనాయకుడిగా ఎదిగి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని తెలిపారు. ప్రజల సమస్యలపై దష్టి సారించి పార్లమెంట్‌లో తన గళాన్ని వినిపించి సమస్యల పరిష్కారానికి కషి చేశారని అన్నారు. సిపిఐ(ఎం) ఎపి రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు జీవితాలు ఉద్యమాలు, పోరాటాలతో సాగుతాయని ఆ కోవలోనే భూస్వామ్య కుటుంబంలో జన్మించి ఫెడరల్ లిజం వైపు పోరాటాలు చేయడం సువరం సుధాకర్‌రెడ్డి దక్కిందన్నారు.

తుది శ్వాస వరకు పార్టీ కోసం పని చేసి ఎప్పటికైన కమ్యూనిస్టులు తిరిగి వస్తారని నమ్మిన నాయకుడని అన్నారు. ఆయన కల, ఆశ, ఆశయాలను ప్రతిఒక్కరు ఆచరణలో చూపవలసిన అవసరం ఉందన్నారు. యుద్ధం అనేది సామ్రాజ్య వాదం రాజకీయాలు చుట్టు తిరుగుతున్నాయని అన్నారు. ఆధిపత్య దుహంకార చర్యలను ప్రతిఒక్కరు వ్యతిరేకించాలని కోరారు. ప్రొఫెసర్ సి నరసింహారావు మాట్లాడుతూ మార్క్సిస్టు గాంధేయ వాది సురవరం సుధాకర్‌రెడ్డి అని, రాజకీయ సైద్ధాంతిక భావజాలం కలిగిన నాయకుడని అన్నారు. దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాలాడ చేశారని ఉద్యమాలే ఊపిరిగా దేశంలోని అన్ని జైల్లో జైలు జీవితాన్నా గడపారని తెలిపారు. భవిష్యత్తులో ఆయన చేసిన పోరాటాలు కార్యసాధనగా నిలుస్తాయని తెలిపారు. పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ జల్లి విల్సన్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలకు సురవరం సుధాకర్‌రెడ్డి ఆకర్షితులై విద్యార్థి, యువజన నాయకుడిగా పెద్దఎత్తున పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ముఖ్యంగా పేద ప్రజల ఆర్థిక భరోసా కల్పించే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. పార్లమెంట్‌లో ప్రజా గళం వినిపించి సమస్యల పరిష్కారానికి కషి చేసి అందరూ మెచ్చుకునే నాయకుడిగా ఎదిగారని అన్నారు. తొలుత ప్రజానాట్యమండలి నాయకులు చంద్రనాయక్, ఆర్ పిచ్చియ్య విప్లవ గేయాలు వినిపించి వీక్షకులను ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి డీజీయం టి మనోహర్‌నాయకుడు తదితరులతో పాటు పార్టీ నాయకులు, పలు ప్రజా సంఘాల నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బిజెపిల మధ్య తీవ్ర వాగ్వాదం

### బిజెపి ఎంఎల్‌ఎ పైడి రాకేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు శాసనసభలో దుమారం





**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఇప్ప పువ్వుసారా'కు ప్రభుత్వం 'ఇందిరమ్మ' పేరు పెట్టవద్దని బిజెపి ఎంఎల్‌ఎ పైడి రాకేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు శాసన సభలో తీవ్ర దుమారం రేపింది. కాంగ్రెస్, బిజెపిల మధ్య తీవ్ర వాగ్వావాదానికి దారి తీసింది. రాకేష్ రెడ్డి క్షమాపణ చెప్పాలని మంత్రులు, కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు పట్టుబట్టారు. చివరకు రాకేష్ రెడ్డి స్పందిస్తూ తాను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అంటే తనకు గౌరవమని, తాను చేసిన వ్యాఖ్యలు ఇబ్బంది అనిపిస్తే రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. దీంతో స్పీకర్ ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించారు. అనంతరం పద్దులపైన చర్చ కొనసాగింది. అంతకు ముందు శాసనసభలో పద్దులపైన జరిగినచర్చలో రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పపువ్వు సారా అంటే ఆర్గనిక్ విస్కీ అని, దీనిని ప్రభుత్వం ప్రోత్సహించాలని, కానీ దీనికి 'ఇందిరమ్మ 'పేరు మాత్రం పెట్టవద్దని ప్రభుత్వానికి సూచించారు. దీనిపైన మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ ఏం మాట్లాడుతున్నారు..?, తమాషానా..? సారా టకీల్ గురించి మాట్లాడుతూ ఇందిరమ్మ పేరు తీస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పసారా ,టకీలకు ఇందిరమ్మ పేరు పెట్టవద్దనడం మహిళలను అవమానించడమేనని, మహిళా సమాజాన్ని కించపర్చినట్టుగానే మాట్లాడారని విమర్శించారు. ఇందుకు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ అంటే ఉక్కుమహిళా అని, దుర్గాదేవి అని వాజ్‌పేయ్ కొనియాడిన విషయాన్ని పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. అనంతరం దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మాజీ ప్రధాని, దేశం కోసం త్యాగం చేసిన నాయకురాలు పట్ల ఇలా మాట్లాడడం బాధకరమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అడ్డగోలుగా మాట్లాడేందుకు ఇదేమైనా ప్లాట్‌ఫామా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరమ్మపైన ఇలా వ్యాఖ్యాలు చేస్తారా? అని మండిపడ్డారు. దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ మాట్లాడిన మాటలు మహిళా లోకాన్ని కించపర్చేవిధంగా ఉందన్నారు. చనిపోయిన ఇందిరమ్మపైన కూడా కసి పెట్టుకోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షోభాలను సృష్టించే వాటికి గొప్పవారి పేర్లు పెట్టరబోరని అన్నారు. ఇలా అక్కసును వెల్లగక్కడం సరైంది కాదని సూచించారు. జూపల్లి కృష్ణరావు మాట్లాడుతూ జరిగిన పొరపాటును ఒప్పుకుంటే కిరీటం కిందపడదు అని అన్నారు. బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు జోక్యం చేసుకుని మాట్లాడుతూ పొరపాటు ఉంటే సభ రికార్డుల నుంచి తొలగించి, పద్దులపైనచర్చను ముందుకు కొనసాగించాలని సూచించారు.

**అసభ్యపదజాలం వాడలేదు...**

అనంతరం బిజెఎల్‌పి నాయకుడు ఎల్లేటి మహేశ్వర్ రెడ్డి స్పందిస్తూ తమ సభ్యులు ఎక్కడ కూడా అసభ్య పదజాలాన్ని వాడలేదన్నారు. దీనిపైన మంత్రి శ్రీధర్ బాబు మరోసారి జోక్యం చేసుకుంటూ బాధ్యతగా తోటి ఎంఎల్‌ఎ తీరుకు ఏదో తప్పు జరిగిందని చెబుతారని అనుకున్నామని,కానీ ఆయన కూడా సమర్థించే కార్యక్రమం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు వారి రాజకీయపార్టీపైన ప్రభావం పడుతుందని సూచించారు. రాకేష్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉప సంహరించుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు, ఆ తర్వాత స్పీకర్ స్థానంలో ఉన్న ప్యానల్ స్పీకర్ బాలు నాయక్ పదే పదే విజ్ఞప్తి చేశారు. దీంతో రాకేష్‌రెడ్డి స్పందిస్తూ మాట్లాడుతూ తాను తప్పుగా మాట్లాడలేదని, తనకు ఇందిరాగాంధీ పట్ల గౌరవం ఉన్నదని, ఇటీవల సోషల్ మీడియాలో ఇందిరాగాంధీపైన అసభ్యకరంగా మాట్లాడితే తెలంగాణ రాష్ట్రంలో తాను ఒక్కడినే స్పందించానని అన్నారు. తాను చేసిన వ్యాఖ్యలతో ఇబ్బంది కరంగా బావిస్తే రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను ఆయన కోరారు. దీంతో స్పీకర్ స్థానంలో ఉన్న బాలు నాయక్ ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం సభలో పద్దులపైన చర్చ కొనసాగింది.

## తెలంగాణలో మరింత విస్తరించే దిశగా 'ఆర్‌టిసి' చర్యలు : మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాలక్ష్మి పథకంతో పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ఆర్‌టిసిని మరింత విస్తరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం మూడు రోజుల పాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో అసెంబ్లీ కమిటీ హాల్ 1 లో ఉమ్మడి జిల్లాల వారీగా ఇంచార్జి మంత్రి, జిల్లా మంత్రులు ,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో, ఆర్‌టిసి ఎండి, ఈడిలు, ఆర్ ఎంలు సహా ఉన్నతాధికారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించనున్నారు. మొదటి రోజు ఉమ్మడి నల్గొండ, మెదక్, రంగారెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల ప్రజా ప్రతినిధులు వారి నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలపై ఆర్‌టిసి అధికారుల సమక్షంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలు ఆర్‌టిసి అధికారులు నివేదిక రూపొందిస్తున్నారు. నల్గొండ జిల్లా నుండి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బాలు నాయక్, జయవీర్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతుందని, ప్రపంచంలోనే ఆర్‌టిసికి గొప్ప చరిత్ర ఉందని కొనియాడారు. రాష్ట్రంలో అవసరమైన నూతన బస్సుల కొనుగోలు, కొత్త రూట్‌లలో బస్సులు నడపడం, ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారంపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కి అండగా ఉంటామని తెలిపారు. కోదాడ, హుజూర్‌నగర్ బస్ స్టేషన్‌ల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇదే విధంగా ఆయా జిల్లాలకు సంబంధించిన నేతలు తమ ప్రాంతాల్లోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై ఆర్‌టిసి అధికారులు నోట్ చేసుకొని నివేదిక రూపొందించనున్నారు. సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.

## 3 వారాల్లోగా వినతులపై చర్యలు తీసుకోండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని హైకోర్టు స్పష్టం చేసింది. వినతి పత్రాన్ని మూడు వారాల్లో పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీకి ఆదేశాలు జారీ చేసింది. సొసైటీ పరిధిలో అనధికార నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడాన్ని ప్రశ్నిస్తూ సభ్యులు కె. జ్యోతిప్రసాద్, ఎం. ప్రభాకర్‌రావు వేసిన పిటిషన్లను జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారించారు. సొసైటీ ప్రాంగణంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని లాయర్ కోరారు. అనుమతిలేని రెస్టారెంట్, ఇతర వాణిజ్య కార్యకలాపాలను నిలిపివేయాలన్నారు. కమ్యూనిటీ సెంటర్‌లో ఏప్రిల్ 3 నుంచి నిర్వహించనున్న ఇండియా ఆర్ట్ ఫెస్టివల్‌ను నిలిపివేయాలని కోరారు. దీనిపై హైకోర్టు.. పిటిషనర్లు సమర్పించిన ఫిర్యాదును మూడు వారాల్లో పరిశీలించి చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీకి ఆదేశించింది.

## సమృద్ధిగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అపోహలు కలిగించే మాధ్యమాల కథనాలతో ఆందోళన చెందవద్దని వినియోగదారులకు సూచించారు. రెగ్యులర్‌గా కొనుగోలు చేసే దాని కంటే, ఎక్కువగా కొని నిల్వ చేయవద్దని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. శాసనమండలి సమావేశపు హాలులో బుధవారం రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కిషన్ రావులతో కలిసి గ్యాస్, పెట్రోల్ సరఫరాలను సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, గ్యాస్ నిల్వలు, పంపిణీలో ఎటువంటి ఇబ్బంది లేదని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బంకుల వద్దకు వచ్చే చివరి వాహనదాదారునికి కూడా పెట్రోల్, గ్యాస్ దొరుకుతుందనే భరోసా కల్పించాలని అధికారులు, ఏజెన్సీలను ఆదేశించారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచుటకు రెగ్యులర్ గా ప్రెస్ బ్రీఫింగ్స్ ఇవ్వాలని సూచించారు. బ్లాక్ మార్కెట్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులని ఆదేశించారు. పెట్రోల్, గ్యాస్ ఏజెన్సీ లకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ సమీక్షలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి. కర్ణన్, పోలీసు కమిషనర్లు సజ్జనార్, సుధీర్ బాబు, ఐఓసిఎల్, హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్ ఏజెన్సీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## 'ఆర్థిక బిల్లు-2026'కు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ :** లోక్‌సభలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. 'ఫైనాన్స్ బిల్లు2026'కు 32 ప్రభుత్వ సవరణలతో బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. 2026 ఫైనాన్స్ బిల్లును ఆమోదించడం ద్వారా లోక్‌సభ బడ్జెట్ ఆమోద ప్రక్రియలో తన భాగాన్ని పూర్తి చేసింది. ఇప్పుడు ఎగువసభ అయిన రాజ్యసభ ఈ బిల్లును పరిశీలించనుంది. రాజ్యసభ ఈ బిల్లును ఆమోదించిన తర్వాత , 2026–27 బడ్జెట్ ప్రక్రియ పూర్తి అవుతుంది. కేంద్ర బడ్జెట్ 2026–27 మొత్తం వ్యయం రూ.53.47 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది. కాగా, ఇది మార్చి 31తో ముగిసిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 7.7శాతం పెరుగుదలగా ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన మొత్తం మూలధన వ్యయం 12.2లక్షల కోట్లు. ఇది రూ.44.04లక్షల కోట్ల స్థూల పన్ను రాబడి వసూలును, రూ.17.2లక్షల కోట్ల స్థూల రుణాన్ని ప్రతిపాదిస్తుంది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు

### ట్రిబ్యునల్ చైర్మన్ స్పీకర్ కూడా..

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన ఏడుగురు ఎమ్మెల్యేలకు, అసెంబ్లీ ట్రిబ్యునల్ చైర్మన్ (స్పీకర్)లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఏడుగురు ఎమ్మెల్యేలు, ట్రిబ్యునల్ చైర్మన్ స్పీకర్‌లు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, టి. ప్రకాశ్‌గౌడ్ ఎ. గాంధీ, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలే యాదయ్యలపై అనర్హత వేటు వేయాలంటూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్లను బుధవారం హైకోర్టు విచారించింది. వారిపై దాఖలైన అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, కె.పి. వివేకానంద, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, జి. జగదీశ్‌రెడ్డి వేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. ఇప్పటికే దానం నాగేందర్‌పై బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన కేసుతో వీటిని జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. అన్నింటినీ కలిపి ఏప్రిల్ 16న విచారిస్తామని ప్రకటించింది. సీనియర్ లాయర్ గండ్ర మోహన్‌రావు వాదిస్తూ, పిరాయింపు ఎమ్మెల్యేలు సీఎం సమక్షంలో పీసీసీ అధ్యక్షుడి సారథ్యంలో కాంగ్రెస్‌లో చేరారని చెప్పారు. బహిరంగంగా కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారని, పార్టీ మారినట్లుగా జరిగిన కార్య క్రమం అన్ని టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యిందని చెప్పారు. ఈమేరకు ఉన్న స్పష్టమైన ఆధారాలను పరిగణలోకి తీసుకో కుండా స్పీకర్ పిటిషన్లను ఏకపక్షంగా, అన్యాయంగా కొట్టేశారన్నారు. పలు పిటిషన్లపై ఒకేరోజు తీర్పు చెప్పారని, కొన్ని పిటిషన్లపై విడిగా తీర్పు చెప్పారని, పేర్లు మార్పు తప్ప తీర్పులన్నీ ఒకే తరహాలో ఉన్నాయన్నారు. దానం నాగేందర్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని తెలిసి కూడా స్పీకర్ పట్టించుకోలేదన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ప్రభుత్వ సలహాదారుగా క్యాబినెట్ హోదాలో ఉన్నారన్నారు. ఈ విషయాలను స్పీకర్ పట్టించుకోకుండా సుప్రీం కోర్టు తీర్పులకు విరుద్ధంగా పిటిషన్లను కొట్టేశారన్నారు. పార్టీ మార్పుపై పిటిషన్లు వేసి ఏడాది గడిచినా స్పీకర్ స్పందించలేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత మాత్రమే స్పీకర్ చర్యలకు శ్రీకారం చుట్టారన్నారు. స్పీకర్ ఇచ్చిన తీర్పు ప్రతులు అందుబాటులో కూడా లేవన్నారు. వాదనల తర్వాత ప్రతివాదులకు నోటీసులు ఇచ్చిన హైకోర్టు తదుపరి విచారణను ఏప్రిల్ 16కు వాయిదా వేసింది.

# దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు ఇవ్వాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 4 వేల నుంచి రూ. 6 వేల వరకు పెంచుతామని హామీ ఇచ్చిందని, తక్షణమే దానిని అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టో అమలుతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం 'కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో అమలు సాధన సమితి' ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద 'వికలాంగుల రిలే నిరహార దీక్ష' చేపట్టారు. ఈ దీక్షకు కూనంనేని సాంబశివరావు హాజరై వికలాంగులకు పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివరావు ప్రసంగిస్తూ దివ్యాంగుల మనోధైర్యానికి, పోరాట శక్తికి అభినందనలు తెలిపారు. ఏ సమాజమైనా, ప్రభుత్వమైనా మొట్టమొదటగా వికలాంగుల సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఖర్చులో దివ్యాంగుల సమస్యలు తీర్చడం పెద్ద సమస్య కాదని, దీనిపై ప్రభుత్వంతో పోరాడైనా సరే దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తానని, కమ్యూనిస్టు పార్టీ దివ్యాంగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ఎం.నరసింహగౌడ్, భారతి ప్రసాద్ మాట్లాడుతూ 2016 వికలాంగుల హక్కుల చట్టం పూర్తిస్థాయి అమలుకు ముఖ్యమంత్రి చైర్మన్‌గా, అన్ని శాసనసభా పక్ష నాయకులతో శాసన సభ కమిటీని చీఫ్ సెక్రటరీగా, డిజిపి కన్వీనర్‌గా కార్యనిర్వహణ కమిటీని నియమించడంతో పాటు చట్టంలోని అన్నీ అంశాల వారీగా పూర్తిస్థాయి పటిష్ఠ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దివ్యాంగులకు అన్ని రకాల ఆర్‌టిసి బస్సులు, మెట్రో రైలులో ఉచిత ప్రయాణం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు గిద్దె గణేష్, మున్నా, వంశ రాజ్ రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## టిజిటిడిసి తాత్కాల్కిక ఉద్యోగులకు పెరిగిన వేతనాలు

### జయేష్‌రంజన్‌కు అభినందనలు తెలిపిన చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ టూరిజం కాంటాక్ట్ ఉద్యోగస్తులకు వేతనాలు పెంచినందుకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజాన్‌ను టూరిజం కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి పుష్పగుచ్ఛమిచ్చి కృతజ్ఞతలు తెలియజేశారు. టూరిజం లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యొక్క వయోపరిమితి 61 సంవత్సరాలకు పెంచాలని ఈ సందర్భంగా జయేష్ రంజాన్ కలిసి వివరించినట్లు వారు సానుకూలంగా స్పందించారని ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగస్తులకు వేతనాలు పెంచడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారని వారు తెలియజేశారు. కలిసిన వారిలో శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, జ్యోతి, రాజశేఖర్, ప్రదీప్‌లు ఉన్నారు.

# పాకిస్థాన్‌లాగా భారత్ 'దలాల్ నేషన్' కాదు

### త్వరలో యుద్ధం ముగియాలని ట్రంప్‌కు మోదీ చెప్పారు

### నిరసనల మధ్య అఖిలపక్ష సమావేశంలో జైశంకర్ వెల్లడి

### పార్లమెంటు ఉభయసభలో చర్చకు ప్రతిపక్షాల డిమాండ్

### సంక్షోభంపై ప్రభుత్వ మౌనం–సమాధానాలకు తీవ్ర అసంతృప్తి



**న్యూఢిల్లీ:** త్వరలోనే అనివార్యంగా పశ్చిమాసియాలో యుద్ధం ముగిసిపోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారని బుధవారం సాయంత్రం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల తీవ్ర నిరసనలమధ్య విదేశీమంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. పాకిస్థాన్‌లాగా భారత్ ఒక దలాల్ నేషన్ కాదని తెలిగ్గా కొట్టిపారేశారు. వహించారు. ప్రజలు క్రూడాయిల్ కోసం ఎలాంటి భయాందోళనా చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కావాల్సినంత చమురు నిల్వలు దేశంలో ఉన్నాయన్నారు. నాలుగు భారత్ నౌకలు ఇప్పటికే హోర్ముజ్ లసంధిని దాటేశాయని, ఇంకా హోర్ముజ్ వద్ద 18 నౌకలు ఆగి ఉన్నాయని దౌత్య వర్గాలు ప్రతిపక్షాలకు తెలియజేశాయి. ప్రతిపక్షాల ప్రశ్నలకు ఈ సమావేశంలో ఎక్కువగా జైశంకరే సమాధానాలు చెప్పారు.ప్రధానమంత్రి ఈ సమావేశం ఏర్పాటు చేయమని చెప్పారని, ఈ సంక్షోభానికి సంబంధించిన సమాచారాన్ని ప్రతిపక్షాలకు తెలియజేయమని చెప్పారని మంత్రి కిరెణ్ రిజిజు సమావేశంలో తెలియజేశారు. ఈ యుద్ధం వల్ల భారత్‌కు ఎంత నష్టం జరుగుతుందనే విషయం, విదేశీ విధానంపైనే ఎక్కువగా ప్రతిపక్షాలు ప్రశ్నలు సంధించాయి. సార్వభౌమాధికారదేశం ఇరాన్‌పై ఏకపక్షంగా అమెరికా చేసిన దాడి విషయంలో ప్రభుత్వం ఒక వైఖరి అనుసరించాలని ప్రతిపక్షాలు కోరాయి. యుద్ధానికి ముందు ప్రధానమంత్రి ఇజ్రాయెల్ పర్యటన, మధ్యవర్తిగా పాకిస్థాన్ పాత్ర గురించి ప్రతిపక్షాలు ప్రధానంగా ప్రభుత్వాన్ని నిలదీశాయి. పశ్చిమాసియా సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా మౌనంగా ఉండిపోయిందని ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. ఐతే ఈ విమర్శలను జైశంకర్ తిరస్కరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం చెప్పిన సమాధానాలపట్ల ప్రతిపక్షాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. పశ్చిమాసియా సంక్షోభంపై పార్లమెంటు ఉభయసభల్లో 193, 176 నిబంధనల కింద క్షుణ్ణంగా చర్చ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. పాకిస్థాన్ ఒక మధ్యవర్తిగా పాత్ర నిర్వహిస్తుంటే భారత్ మాత్రం మౌన ప్రేక్షకుడిలా మిగిలిపోయిందని కాంగ్రెస్ ఎంపి తారిఖ్ అన్వర్ విమర్శించారు.

పశ్చిమాసియాలో పరిణామాలను వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. పాకిస్థాన్‌లాగా భారతదేశం ఒక దలాల్ నేషన్ (ఒక విదేశాంగ విధానమంటూ లేని, ఇతరులపై ఆధారపడి స్వార్థపూరిత పనులు చేసిపెట్టి లాభపడే అపఖ్యాతి పాలైన దేశం లేదా బ్రోకర్ దేశం) కాదని, భారత్‌కు ఒక స్వతంత్ర విదేశాంగ విధానమంటూ ఒకటి ఉందని జైశంకర్ అన్నారు. ట్రంప్‌కు భారత్ ప్రయోజనాలను మోదీ తాకట్టుపెట్టారని పశ్చిమాసియా పరిణామాలపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ తరుణంలో పశ్చిమాసియాలో సంక్షోభంపై చర్చించేందుకు పార్లమెంటు కాంప్లెక్స్‌లో రెండు గంటలసేపు ఈ అఖిల పక్ష సమావేశం జరిగింది. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జైశంకర్,నిర్మలా సీతారామన్, జె.పి.నడ్డా, కిరెణ్ రిజిజు,సహా అనేకమంది ,విదేశీవ్యవహారాలశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి మంత్రులు ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం

ఇరాన్‌కు అమెరికాకు మధ్య ఒప్పందం కుదిర్చేందుకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం చేస్తున్న తరుణంలో జైశంకర్ ఈ సమావేశంలో మాట్లాడుతూ, 1981 నుండీ అమెరికా అనేక సందర్భాలలో అనేక విషయాలలో పాకిస్థాన్‌ను స్వార్థ ప్రయోజనాలకోసం మధ్యవర్తి కృషికి ఉపయోగించుకోవడం కొత్తగా వచ్చిన విషయం కాదని చెప్పినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ''మనది దలాల్ దేశం (బ్రోకర్) కాదు'' అని సమావేశంలో జైశంకర్ చెప్పారు. ప్రభుత్వం పశ్చిమాసియా సంక్షోభంపై నోరు విప్పకుండా మౌనంగా ఉండిపోయిందని ప్రతిపక్షాలు చేసిన విమర్శలను ఆయన తిరస్కరిస్తూ, ''మనం వ్యాఖ్యలు చేస్తున్నాం, ప్రతిస్పందిస్తున్నాం'' అని చెప్పారు. ఇరాన్ దేశ సర్వాధినేత అలీ ఖమేనీ మరణించినప్పుడు కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించలేదని, ప్రభుత్వం తన నైతిక బలహీనతను ప్రదర్శించిందని ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో ఈ సమావేశంలో విమర్శించగా, మంత్రి జైశంకర్ స్పందిస్తూ, ఆ రోజు ఇరాన్ కార్యాలయాన్ని తెరచిన వెంటనే విదేశీ వ్యవహారాలమంత్రిత్వశాఖ కార్యదర్శి వెళ్ళి అక్కడి పుస్తకంలో భారత్ తరపున సంతాప సందేశం రాశారని చెప్పారు. గల్ఫ్ ప్రాంతంలో కోటిమందికిపైగా భారతీయులు ఉన్నారని, వారి రక్షణ గురించే భారత ప్రభుత్వం ప్రధానంగా దృష్టి కేంద్రీకరించిందని, వారి భద్రత గురించే ఆలోచించిందని, అంతేకాకుండా దేశీయ ఇంధన వనరుల అవసరాల గురించి కూడా చాలా తీవ్రంగా ఆలోచించిందని చెప్పారు. ప్రభుత్వంపరంగా చూస్తే ఇప్పటివరకూ ఈ విషయంలో కేంద్రం ఎంతో విజయవంతంగా వ్యవహరించిందని చెప్పారు. ఐనప్పటికీ ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పించాయి. అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం చెప్పిన సమాధానాలు ఎంతమాత్రం సంతృప్తికరంగా లేవని ప్రతిక్షాలు విమర్శించాయి.

ప్రతిపక్షాల తరపున ధర్మేంద్ర యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), సస్మిత్‌పాత్ర (బిజు జనతాదళ్), సంజయ్ ఝా (జెడి–యు), శ్రీకాంత్ షిండే (శివసేన),సంజయ్ సింగ్ (ఆమ్ ఆద్మీ పార్టీ), జాన్ బ్రిట్టస్ (సిపిఐ(ఎం),సుప్రియా సూలే (ఎన్‌సిపి–ఎస్‌పి–)అరవింద్ సావంత్ (శివసేన–యుబిటి–)అసదుద్దీన్ ఒవైసీ (ఎఐఎంఐఎం) తదితరులు పాల్గొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ,టిఎంసి ఎంపీలు ఈ సమావేశానికి హాజరుకాకపోవడాన్ని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తప్పుపట్టారు. ఇది పూర్తి బాధ్యతారాహిత్యమని అన్నారు. అసలు ఆయనకు దేశ ప్రయోజనాలపట్ల ఆసక్తి ఉందా వదంతులు వ్యాప్తిచేయడంపట్ల ఆసక్తి ఉందా? అని ఎదురుదాడి చేశారు.

# ఒడిశాలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు లొంగుబాటు

**ఆయుధాలను వీడిన మరో నలుగురు రెడ్ రెబల్స్**

**భువనేశ్వర్/ఫుల్బానీ :** మావోయిస్టులకు వ్యతిరేకంగా మూడు దశాబ్దాలుగా సాగుతున్న పోరాటంలో ఒడిశా 239 మంది భద్రతా సిబ్బందిని కోల్పోయిందని, ఓ సీనియర్ అధికారి చెప్పారు. అయితే మోస్ట్ వాంటెడ్ రెడ్ రెబెల్ సుక్రూ అలియాస్ కోసా సోడితో సహా ఐదుగురు నక్సల్స్ లొంగిపోవడంతో ఈ తిరుగుబాటు తుది దశకు చేరుకుందన్నారు. కంధమాల్ జిల్లా కేంద్రమైన ఫుల్బానిలోని పోలీస్ రిజర్వ్ గ్రౌండ్‌లో, సిపిఐ(మావోయిస్ట్) రాష్ట్ర కమిటీ సభ్యుడు సుక్రూ (49)తో సహా ఐదుగురు రెడ్ రెబెల్స్ లొంగిపోయారు. ఈ విషయాన్ని అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (యాంటీనక్సల్ ఆపరేషన్స్) సంజీబ్ పాండా ధ్రువీకరించారు. 'నక్సల్స్‌కు వ్యతిరేకంగా మూడు దశాబ్దాలుగా సాగుతున్న పోరాటంలో రాష్ట్రం 239 మంది భద్రతా సిబ్బందిని కోల్పోయింది. అమరవీరులకు మేము మా అత్యున్నత నివాళులు అర్పిస్తున్నాము... మావోయిస్టులకు వ్యతిరేకంగా పోరాటం దాదాపు ముగిసింది. ప్రస్తుతం, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సుమారు ఎనిమిదితొమ్మిది మంది నక్సల్స్ మాత్రమే కంధమాల్ జిల్లాలోని చిన్న చిన్న ప్రాంతాలలో చురుకుగా ఉన్నారు. వారు మార్చి 31లోగా లొంగిపోతారని మేము ఆశాభావంతో ఉన్నాము' అని పాండా అన్నారు. ఐదుగురు మావోయిస్టులు లొంగిపోవడం నక్సల్ వ్యతిరేక ప్రయత్నాలకు ఊపునిస్తుందని, వారు స్వచ్ఛందంగా ఆయుధాలు విడిచిపెట్టి ప్రధాన స్రవంతిలో చేరాలని నిర్ణయించుకున్నారని ఆ అధికారి అన్నారు.

తెలంగాణా ప్రభుత్వము
భూ సేకరణ అధికారి మరియు సబ్ కలెక్టర్ వారి రూఢీ ప్రకటన
ఫారం - VII
(చూడుము సబ్ రూల్ 1 రూల్ - 25, సెక్షన్ - 19(1) చట్టము - 30/2013)
జిల్లా గెజిట్ నెం. ఎ3/27/2026 తేది: 17.03.2026
కలెక్టర్ ఫైల్ నెం నెం. జి1/75652/2024 తేది: 17.03.2026
భూ. సే అధికారి ఫైల్ నెం. A/1118/2025 తేది: 11.03.2026

తెలంగాణా ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, ఖమ్మం గారు దిగువ నిర్దిష్ట పరిచిన ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలములోని ఏరుగట్ల గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ. 09.21 1/2 గుం. నిమిత్తం అనగా SRLIP (సీతారామ లిఫ్ట్ నీటిపారుదల ప్రాజెక్టు) కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నందున భావించనైనది.

కావున ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలములోని ఏరుగట్ల గ్రామములో ఉన్న భూమి సుమారు ఎ.09.21 1/2 గుం. గల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వారి నుండి భూసేకరణ నిమిత్తం, రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

షెడ్యూలు

గ్రామం: ఏరుగట్ల మండలం: సత్తుపల్లి జిల్లా: ఖమ్మం

| క్ర.సం. | సర్వే నెం. | భూమి రకం | భూమి స్థితి | భూసేకరణకు గుర్తించిన భూమి ఎ.గుం. | అనుభవదారు / పట్టేదారు యొక్క పేరు మరియు చిరునామా | హద్దులు: తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు | కట్టడములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 10/2 | మెట్ట | పట్టా | 0.09 | బొంతు రధమ్మ భర్త సత్యం | 10/3 | 10/1 | 11 | 10/3 | - | - |
| 2 | 10/2 | మెట్ట | పట్టా | 0.01 1/2 | డొంక | | | | | - | - |
| 3 | 11/2 | మెట్ట | పట్టా | 0.10 1/2 | బొంతు రధమ్మ భర్త సత్యం | 11/1 | 5 | 11 | 10 | - | - |
| 4 | 11/2 | మెట్ట | పట్టా | 0.12 1/2 | బొంతు కృష్ణారావు S/o. గురవయ్య బానోతు నరేంద్ర తండ్రి వెంకటేశ్వరరావు | 11/1 | 5 | 11 | 10 | - | - |
| 5 | 5/2 | మెట్ట | పట్టా | 0.02 1/2 | బొంతు కృష్ణారావు S/o. గురవయ్య బొంతు నరేంద్ర తండ్రి వెంకటేశ్వరరావు | 11 | 6/1 | 4 | 5/1 | - | - |
| 6 | 5/2 | మెట్ట | పట్టా | 0.22 | బొంతు జగదీష్ తండ్రి పుల్లారావు బొంతు నాగ మని భర్త పుల్లారావు | 11 | 6/1 | 4 | 5/1 | జామాయిల్ - 15 | ఫెన్సింగ్ రాళ్ళు-26 |
| 7 | 5/2 | మెట్ట | పట్టా | 0.02 | డొంక | 11 | 6/1 | 4 | 5/1 | - | |
| 8 | 5/2 | మెట్ట | పట్టా | 0.06 1/2 | నిమ్మగడ్డ చంద్రరావు తండ్రి తాతయ్య | 11 | 6/1 | 4 | 5/1 | జామాయిల్ - 250 | - - |
| 9 | 5/2 | మెట్ట | పట్టా | 0.16 | లక్కినేని జోగారావు తండ్రి వీరయ్య | 11 | 6/1 | 4 | 5/1 | మామిడి చెట్లు-30, కొబ్బరి చెట్లు-30, జామాయిల్-500, పమోయిల్-10, వేప చెట్లు-1 | - |
| 10 | 6/2 | మెట్ట | పట్టా | 0.04 | లక్కినేని జోగారావు తండ్రి వీరయ్య | 5 | 6/1 | 159 | 6/1 | మామిడి చెట్లు-30, కొబ్బరి చెట్లు-30, జామాయిల్-500 | చేపల చెరువు-1, పైప్‌లైన్-150 అడుగులు, డ్రిప్‌లైన్-600 అడుగులు, బోర్-1 |
| 11 | 159/2 | మెట్ట | పట్టా | 0.34 | లక్కినేని జోగారావు తండ్రి వీరయ్య | 4 | 159/1 | 159/3 | 6 | మామిడి చెట్లు-30, కొబ్బరి చెట్లు-30, జామాయిల్-500, పమోయిల్-10, వేప చెట్లు-1 | - |
| 12 | 157/2 | మెట్ట | పట్టా | 0.20 | లక్కినేని జోగారావు తండ్రి వీరయ్య | 157/3 | 157/1 | 156 | 159 | మామిడి చెట్లు-30, కొబ్బరి చెట్లు-30, జామాయిల్-500, పమోయిల్-10, వేప చెట్లు-1 | - |
| 13 | 156/2 | మెట్ట | పట్టా | 0.10 | లక్కినేని జోగారావు తండ్రి వీరయ్య | 156/1 | 156/3 | 156/1 | 157 | మామిడి చెట్లు-30, కొబ్బరి చెట్లు-30, జామాయిల్-500, పమోయిల్-10, వేప చెట్లు-1 | - |
| 14 | 153/2 | మెట్ట | పట్టా | 1.23 1/2 | లక్కినేని జోగారావు తండ్రి వీరయ్య | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | మామిడి చెట్లు-30, కొబ్బరి చెట్లు-30, జామాయిల్-500, పమోయిల్-10, వేప చెట్లు-1 | - |
| 15 | 153/2 | మెట్ట | పట్టా | 0.02 | డొంక | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 16 | 153/2 | మెట్ట | పట్టా | 0.01 1/2 | గోగుల రత్నాకర్ తండ్రి సత్యం | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 17 | 153/2 | మెట్ట | పట్టా | 0.07 | చల్లి కొండయ్య తండ్రి రాములు | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 18 | 153/2 | మెట్ట | పట్టా | 0.02 | కండే లక్ష్మ య్య తండ్రి నారాయణ | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 19 | 153/2 | మెట్ట | పట్టా | 0.04 1/2 | వేల్పుల నాగేశ్వరరావు తండ్రి కోటయ్య | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | టిన్ పైకప్పు ఇల్లు (1 1/2 రూమ్స్) చిన్న బోర్-1 |
| 20 | 153/2 | మెట్ట | పట్టా | 0.00 1/2 | వేల్పుల మధు తండ్రి మల్లయ్య | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | టిన్ పైకప్పు ఇల్లు |
| 21 | 153/2 | మెట్ట | పట్టా | 0.02 1/2 | వేల్పుల రాంబాబు తండ్రి మల్లయ్య | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | టేకు చెట్లు-7 | టిన్ పైకప్పు ఇల్లు (2 రూమ్స్) ఎల్-పైపు -1 |
| 22 | 153/2 | మెట్ట | పట్టా | 0.02 1/2 | కేసరి తేజ సత్య లక్ష్మా రెడ్డి తండ్రి నాగిరెడ్డి | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 23 | 153/2 | మెట్ట | పట్టా | 0.10 1/2 | నేతుల వెంకటేశ్వరరావు తండ్రి కొమురయ్య | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 24 | 153/2 | మెట్ట | పట్టా | 0.06 | దొంతకాని వెంకటయ్య తండ్రి కొమరయ్య | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 25 | 153/2 | మెట్ట | పట్టా | 0.02 1/2 | నరసింగు శ్రీను తండ్రి రాములు | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 26 | 153/2 | మెట్ట | పట్టా | 0.03 | నేతుల లింగయ్య తండ్రి అప్పయ్య | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 27 | 153/2 | మెట్ట | పట్టా | 0.01 3/4 | చిట్టిమల్ల నాగమణి భర్త మొగిలి | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 28 | 153/2 | మెట్ట | పట్టా | 0.01 3/4 | చిట్టిమల్ల అప్పారావు తండ్రి సైదులు | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 29 | 153/2 | మెట్ట | పట్టా | 0.02 | నీతుల రాఘవులు తండ్రి అప్పయ్య | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 30 | 153/2 | మెట్ట | పట్టా | 0.02 | నేతుల లక్ష్మి నారాయణ తండ్రి అప్పయ్య | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 31 | 153/2 | మెట్ట | పట్టా | 0.11 | లకినేని జోగారావు తండ్రి వీరయ్య | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 32 | 153/2 | మెట్ట | పట్టా | 0.02 1/2 | పల్లెబోఇన శివవాని భర్త నీలాద్రి | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 33 | 153/2 | మెట్ట | పట్టా | 0.00 1/2 | ఎర్రోజు వెంకటేశ్వరరావు తండ్రి నంబయ్య | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 34 | 153/2 | మెట్ట | పట్టా | 0.15 1/2 | చల్లగుండ్ల రజిత భర్త మధు | 153/3 | 153/1 81 80 79 87 | 77, 75 | 153/1 | - | - |
| 35 | 77/2 | మెట్ట | పట్టా | 0.15 | చల్లగుండ్ల రజిత భర్త మధు | 77/3 | 77/1 | 93 | 75 | - | ట్రాన్స్‌ఫార్మర్ (25KV)-1, ఫెన్సింగ్ రాళ్ళు-40 |
| 36 | 77/2 | మెట్ట | పట్టా | 0.06 | పాకలపాటి వెంకటేశ్వరరావు తండ్రి చెన్నయ్య | 77/3 | 77/1 | 93 | 75 | - | - |
| 37 | 77/2 | మెట్ట | పట్టా | 0.04 | నిమ్మగడ్డ చందర్ రావు తండ్రి తాతయ్య | 77/3 | 77/1 | 93 | 75 | - | - |
| 38 | 77/2 | మెట్ట | పట్టా | 0.04 1/2 | నిమ్మగడ్డ మాణిక్యం భర్త లోకేశ్వరరావు | 77/3 | 77/1 | 93 | 75 | - | - |
| 39 | 77/2 | మెట్ట | పట్టా | 0.04 1/2 | బొంతు సుజాత భర్త జగదీష్ | 77/3 | 77/1 | 93 | 75 | - | - |
| 40 | 77/2 | మెట్ట | పట్టా | 0.07 1/2 | పాకలపాటి పుల్లారావు తండ్రి చెన్నయ్య | 77/3 | 77/1 | 93 | 75 | - | - |
| 41 | 77/2 | మెట్ట | పట్టా | 0.06 1/2 | గంగవరపు మేల్కగ్రేస్ భర్త దేవసహాయం | 77/3 | 77/1 | 93 | 75 | - | - |
| 42 | 93/2 | మెట్ట | పట్టా | 0.05 1/2 | గంగవరపు మేల్కగ్రేస్ భర్త దేవసహాయం | 93/3 | 93/1 | 93/1 | 93/1 | - | - |
| 43 | 93/2 | మెట్ట | పట్టా | 0.00 1/2 | కాకా సురేష్ తండ్రి రాజాలు | 93/3 | 93/1 | 93/1 | 93/1 | - | - |
| 44 | 92/2 | మెట్ట | పట్టా | 0.03 1/2 | కాకా సురేష్ తండ్రి రాజాలు | 92/3 | 92/1 | 92/1 | 92/1 | - | - |
| 45 | 92/2 | మెట్ట | పట్టా | 0.05 | కాకా రాము తండ్రి కన్నప్ప | 92/3 | 92/1 | 92/1 | 92/1 | - | - |
| 46 | 92/2 | మెట్ట | పట్టా | 0.01 1/2 | కాకా వెంకటేశ్వరరావు తండ్రి రాజాలు | 92/3 | 92/1 | 92/1 | 92/1 | - | - |
| 47 | 92/2 | మెట్ట | పట్టా | 0.06 | కాకా నాగమణి భర్త సత్యం(లేటు) | 92/3 | 92/1 | 92/1 | 92/1 | - | - |
| 48 | 92/2 | మెట్ట | పట్టా | 0.01 1/2 | మహంకాళి మురళి కృష్ణ తండ్రి వీరభద్రం (లేటు) | 92/3 | 92/1 | 92/1 | 92/1 | - | - |
| 49 | 92/2 | మెట్ట | పట్టా | 0.00 1/2 | బుసి ప్రసాద బాబు తండ్రి సత్యనారాయణ | 92/3 | 92/1 | 92/1 | 92/1 | - | - |
| 50 | 96/2 | మెట్ట | పట్టా | 0.10 | బుసి ప్రసాద బాబు తండ్రి సత్యనారాయణ | 96/1 | 96/1 | 96/1 | 96/1 | - | - |
| 51 | 96/2 | మెట్ట | పట్టా | 0.04 | బుసి సత్యనారాయణ తండ్రి లక్ష్మ య్య | 96/1 | 96/1 | 96/1 | 96/1 | - | - |
| | | మొత్తం | | 09.21 1/2 | | | | | | | |

సెక్షన్ (15) చట్టము ప్రకారము చట్టము 30/2013 క్రింద పై భూసేకరణపై వచ్చిన అభ్యంతరములకు గాను సంబంధిత సమాచారమును సంబంధిత వారికి తెలియచేసి వున్నాము. కావున ఇట్టి తుది ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ చట్టము ప్రకారము భూ నిర్వాసితులు అవుతున్న కుటుంబీకులకు భూ సేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకుగాను తదుపరి ప్రతిపాదనలు శ్రీయుత జిల్లా కలెక్టరు, ఖమ్మం గారి ద్వారా నియమించబడిన పునరావాస మరియు పునరుపాధి అధికారి మరియు శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి, కల్లూరు గారి ద్వారాజరుపబడును.

భూసేకరణ తలపెట్టిన ఆ భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును, లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయపు పని వేళలో జిల్లా కలెక్టరు, ఖమ్మం మరియు భూ సేకరణ అధికారి/ సబ్-కలెక్టర్, కల్లూరు వారి కార్యాలయములో పరిశీలించుకోను నిమిత్తము అందుబాటులో ఉండును.


సం./- సబ్-కలెక్టర్, కల్లూరు
సం./- అదనపు కలెక్టర్, ఖమ్మం
సం./- జిల్లా కలెక్టర్, ఖమ్మం
DIPR RO NO. 1341/LA/PP/Advt/Pub/2025-26

# డీలిమిటేషన్ పూర్తి చేయకుండానే...

# 'యూ-టర్న్ ఉస్తాద్' మహిళా కోటా చట్ట సవరణ యత్నాలు

**ప్రధాని మోదీపై కాంగ్రెస్ విమర్శలు**

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్రమోదీపై కాంగ్రెస్ బుధవారం విమర్శలు గుప్పించింది. యూ టర్న్‌‒ఉస్తాద్ ఇప్పుడు వచ్చే పక్షం రోజుల్లో పార్లమెంట్ ప్రత్యేక రెండు రోజుల సమావేశంలో సవరణను ఆమోదించడం ద్వారా డీలిమిటేషన్, జనాభా గణన ప్రక్రియలను పూర్తి చేయకుండానే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని చూస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రభుత్వ విదేశాంగ విధాన వైఫల్యాలు, ఎదురుదెబ్బ అలాగే దేశం ఎదుర్కొంటున్న ఎల్‌పిజి, ఇంధన సంక్షోభం నుంచి కథనాన్ని మళ్లించడానికి 'ఇది ఒక దృష్టి మరల్చే ఆయుధం' అని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. లోక్‌సభ, విధానసభల పరిమాణాన్ని 50శాతం పెంచాలని మోదీ ప్రభుత్వం యోచిస్తోందని, దీనిపై కూడా జాగ్రత్తగా చర్చ జరగాల్సి ఉందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరాం రమేశ్ అన్నారు. లోక్‌సభ, విధానసభలలో మహిళలకు ఒకవంతు రిజర్వేషన్ కల్పించడంతో పాటు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కోసం కేటాయించిన సీట్లలో మహిళలకు మూడవ వంతు రిజర్వేషన్ కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరించిన మహిళా రిజర్వేషన్ బిల్లు లేదా నారీవందన అధినియమ్2023 ఆమోదంతో 2023 సెప్టెంబరులో కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం జరిగిందని జైరాం రమేశ్ పేర్కొన్నారు.నియోజకవర్గాల పునర్విభజన, జనగణన ప్రక్రియలు పూర్తి అయిన తర్వాత ఈ రెండు రిజర్వేషన్లు అమలులోకి వస్తాయని ఆయన అన్నారు. నారీ వందన అధినియమ్ 2023పై చర్చ జరుగుతున్నప్పుడు 2024 లోక్‌సభ ఎన్నికల నుంచే దానిని తక్షణమే అమలు చేయాలని భారత జాతీయ కాంగ్రెస్ డిమాండ్ చేసిందని జైరాం రమేశ్ గుర్తుచేశారు. అయితే డీలిమిటేషన్, జనగణన రెండూ తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉన్నందున ఇది సాధ్యం కాదని మోదీ ప్రభుత్వం పేర్కొన్నదని జైరాం రమేశ్ వివరించారు. ఇప్పుడు 30నెలల తర్వాత మాట మార్చిన 'యూటర్న్ ఉస్తాద్' అకస్మాత్తుగా అతని మనసు మార్చుకుని డీలిమిటేషన్, జనాభా గణన ప్రక్రియ పూర్తిచేయకుండానే రిజర్వేషన్లు అమలుచేయాలని అనుకుంటున్నారని ఆరోపించారు. 'సామూహిక దారి మళ్లింపు ఆయుధాలను (డబ్ల్యుఎండి) ప్రయోగించడంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఎవరూ సాటిలేరన్నారు. ఆయన గతంలో చాలాసార్లు ఇలా చేశారు. ఇప్పుడు కూడా అలాగే చేస్తున్నారు. తన విదేశాంగ విధాన వైఫల్యాలు, ఎదురు దెబ్బల నుండి, దేశం ఎదుర్కొంటున్న ఇంధన, ఎల్‌పిజి సంక్షోభం నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తూ ఆయన ఈ కొత్త చొరవతో ముందుకు వచ్చారు' అని జైరాం రమేశ్ అన్నారు. దీని పూర్తి రాజకీయ ప్రయోజనం పొందాలనే ఉద్దేశంతోనే నారీ వందన్ అధినియమ్2023కు అవసరమైన సవరణలను ఆమోదించేందుకు వచ్చే పక్షం రోజుల్లో రెండు రోజుల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలియజేశారని జైరాంరమేష్ తెలిపారు. ఎన్నికల సంఘం మోడల్ కోడ్ కండక్ట్ (ఎంసిసి) ప్రధాని మోదీ ప్రచార నియమావళిగా మారిపోయిందని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉంటే, నారీ శక్తి వందన్ అధినియమ్‌ను సవరించే రాజ్యాంగ సవరణ బిల్లును ప్రభుత్వం రాబోయే కొద్ది రోజుల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం చాలా తక్కువగా ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. మంగళవారం సాయంత్రం వరకూ ఎలాంటి ప్రతిపాదన లేదని తెలిపింది. కాగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా సోమవారం ఎన్డీయేలోని కొన్ని భాగస్వామ్య పక్షాలతో, కాంగ్రెసేతర ప్రతిపక్ష నాయకులతో ఈ విషయమై చర్చించారు. అయితే ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ, మరొక ప్రతిపక్షమైన తృణమూల్ కాంగ్రెస్(టిఎంసి)తో సంప్రదింపులు ఇంకా జరగాల్సి ఉంది. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించే నిబంధనను 2023లో రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా తీసుకువచ్చారు. కానీ ఇది నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి అయిన తర్వాతే అమలులోకి వస్తుంది. అందుబాటులో ఉన్న స్థూల రూపురేఖల ప్రకారం లోక్‌సభ సీట్ల సంఖ్యలను ప్రస్తుతం ఉన్న 543 నుంచి 816 సీట్లకు పెంచి,మహిళా రిజర్వేషన్ చట్టాన్ని పెంచాలన్న ప్రభుత్వ ప్రణాళికకు ప్రస్తుత సీట్ల నుంచి కొత్త నియోజకవర్గాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం రావచ్చని కూడా ఆ వర్గాలు తెలిపాయి. సెప్టెంబరు 2023లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నారీ శక్తి వందన్ బిల్లుకు ఆమోదం తెలిపారు.ఈ చట్టాన్ని అధికారికంగా రాజ్యాంగ (106వ సవరణ) చట్టం అని పిలుస్తారు.



# అధికారిక కార్యక్రమాల్లో 'వందేమాతరం' గీతం తప్పనిసరి కాదు

**పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ :** దేశంలో నిర్వహించే అన్ని అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ జారీ చేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పటిషన్‌ను విచారణ చేయడానికి సుప్రీంకోర్టు బుధవారం నిరాకరించింది. అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం పాడడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేయలేదని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పాంచోలీల త్రిసభ్య ధర్మాసనం ఈ పటిషన్‌ను పరిశీలించింది. మహమ్మద్ సయీద్ నూరి దాఖలు చేసిన పిటిషన్ ప్రీమెచ్యూర్‌గా, వివక్ష ఎదుర్కోవాల్సి వస్తుందనే అనవసర ఆందోళన ఆధారంగా వేసినట్లు అభిప్రాయపడింది. పిటిషనర్ నూరి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, తాము దేశంలోని అన్ని మతాలను గౌరవిస్తామని అన్నారు. కానీ మతం, విశ్వాసంతో సంబంధం లేకుండా ప్రజలందరూ జాతీయ గేయం పాడాలని బలవంతం చేయకూడదని పేర్కొన్నారు. ఒక వేళ అలా బలవంతం చేస్తే అది దేశంపై విశ్వాసం చూపించాలని బలవంతం చేసినట్లు అవుతుందని అన్నారు. దీనిపై స్పందించిన జస్టిస్ బాగ్చీ, జాతీయ గేయం పాడనందుకు ఎవరికైనా శిక్ష పడిందా? లేదా వందేమాతరం పాడనందుకు ఎవరినైనా అధికారిక సభల నుంచి బయటకు పంపేశారా? కేంద్ర హోంమంత్రిత్వ శాఖ జారీ చేసిన సర్క్యులర్‌లో అలాంటి అంశాలు ఏమైనా ఉన్నాయా? అని పిటిషనర్‌ను ప్రశ్నించారు. దీనికి 'వందేమాతరం గేయం పాడినప్పుడు అంతరాయం కలిగిస్తే జరిమానా ఉంటుంది' అని హెగ్డే పేర్కొన్నారు. నిజానికి పాడనివారిపై లీగల్‌గా ఎలాంటి చర్యలు తీసుకోనప్పటికీ, జరిమానాలు వేయడం వల్ల, పాడడానికి, లేదా నిలబడడానికి నిరాకరించే వారిపై ఎప్పుడూ ఆర్థిక భారం పడే అవకాశం ఉంటుందని అన్నారు. ఇలా ప్రజలను జాతీయ గేయం పాడమని బలవంతం చేయవచ్చా? అని ఆయన తిరిగి ప్రశ్నించారు. దీనితో హెగ్డేను ఉద్దేశించి జాతీయ గేయం పాడమని బలవంతం చేస్తూ పిటిషనర్‌కు ఎవరైనా నోటీసు పంపారా?' అని సిజెఐ సూర్యకాంత్ ప్రశ్నించారు. 'కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశంలోని 5వ నిబంధన 'మే' అని చెబుతోంది. అంటే జాతీయ గేయమైన వందేమాతరాన్ని పాడడం లేదా పాడకపోవడం అనే విషయంలో అందరికీ స్వేచ్ఛ ఉంది. కనుక ఇది చట్టపరమైన హక్కులకు విరుద్ధం కాదు' అని జస్టిస్ బాగ్చీ అన్నారు. అయితే పిటిషనర్‌కు ఏదైనా నోటీసు లేదా శిక్ష పడే పరిస్థితి ఎదురైనప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతానికి పిటిషనర్ మహమ్మద్ సయీద్ నూరి వివక్షకు గురవుతామనే అనవసరపు ఆందోళనతో వేసిన పిటిషన్ తప్ప మరేమీ కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

# దేశంలో ఇంధన నిల్వలున్నాయ్

**ఎవరూ భయపడొద్దు : ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రకటన**



**న్యూఢిల్లీ :** భారత్‌లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు బుధవారం తెలిపాయి. అనవసరంగా భయపడి ఇంధనాన్ని కొనుగోలు చేయొద్దని స్పష్టం చేశాయి. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి కొరత ఏర్పడిందని ఊహాగానాలు వచ్చాయి. దీంతో మెట్రో నగరాలు, పలు సిటీల్లో ప్రజలు భయాందోళనతో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ఇంధన నిల్వలపై తాజాగా క్లారిటీ ఇచ్చాయి.

**ఆ వదంతులను నమ్మొద్దు : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్**

భారత్‌లో పెట్రోల్, డీజిల్ కొరత లేదని దేశంలోనే అతిపెద్ద చమురు సంస్థ అయిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) స్పష్టం చేసింది. ఆన్‌లైన్ (సోషల్ మీడియా)లో వస్తున్న వదంతులు ప్రజల్లో అనవసరమైన ఆందోళనను సృష్టించి, సాధారణ సరఫరా సరళికి అంతరాయం కలిగిస్తాయని పేర్కొంది. ఇండియన్ ఆయిల్ అవుట్‌లెట్లలో చమురు నిల్వలు పుష్కలంగా ఉన్నాయని వెల్లడించింది. తమ అవుట్‌లెట్లు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయని తెలిపింది. ప్రజలు భయపడి పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లు చేయడం మానుకోవాలని సూచించింది. ధ్రువీకరించిన సమాచారాన్ని మాత్రమే నమ్మాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత వార్తలు పూర్తిగా నిరాధారమైనవని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) తెలిపింది. దేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది. సరఫరా గొలుసులు సాధారణంగా నడుస్తున్నాయని వెల్లడించింది. నిరంతరాయ ఇంధన సరఫరాకు కట్టుబడి ఉన్నామని పేర్కొంది. ఈ మేరకు బిపిసిఎల్ ప్రకటన విడుదల చేసింది. దేశంలో చమురు కొరత లేదు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) సైతం ఇంధన కొరత గురించి వచ్చిన వార్తలపై క్లారిటీ ఇచ్చింది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత లేదని వినియోగదారులకు హామీ ఇచ్చింది. 'ప్రియమైన వినియోగదారులారా, దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి కొరత లేదు. ఇంధన సరఫరాలు స్థిరంగా ఉన్నాయి. సరిపడ్డా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారులు వదంతులను పట్టించుకోవచ్చు. భయాందోళనలకు గురై కొనుగోళ్లు చేయవద్దని సూచిస్తున్నాం. దయచేసి సాధారణ వినియోగ పద్ధతులను కొనసాగించండి. హెచ్‌పిసిఎల్ తన నెట్‌వర్క్ అంతటా నిరంతరాయ, నిరాటంకమైన ఇంధన సరఫరాను నిర్ధారించడానికి కట్టుబడి ఉంది' అని హెచ్‌పిసిఎల్ ప్రకటన విడుదల చేసింది.

# అటవీప్రాంత నివాసితుల రక్షణకు అనేక చర్యలు తీసుకున్నాం

**వయనాడ్ పునరావాసం కోసం కాంగ్రెస్ వాగ్దానం చేసిన ఇళ్లు ఎక్కడ ఉన్నాయ్**

**కేరళ సిఎం పినరయ్ విజయన్ నిలదీత**

**కొట్టాయం :** కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగన్న నేపథ్యంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం కొండ ప్రాంతాల ప్రజలను పరామర్శించారు. కేంద్ర చట్టాల వల్ల ఆటంకాలు ఎదురవుతున్నప్పటికీ, వారి ప్రాణాలను, జీవనోపాధిని కాపాడటానికి తమ ప్రభుత్వం చట్టపరమైన, ఆర్థిక చర్యలు తీసుకుందని ఆయన అన్నారు. బుధవాం కంజిరపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొండచరియలు విరిగిపడిన వయనాడ్‌లో పునరావాస కార్యక్రమాల విషయంలో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్న ప్రతిపక్ష యుడిఎఫ్ ఆరోపణలను ఖండించారు. నిర్మాణాత్మకంగా చర్చలు జరపకుండా, ప్రతిపక్షం తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆయన ఆరోపించారు. కొండ ప్రాంతాల్లో మానవవన్యప్రాణుల సంఘర్షణ రాష్ట్రంలోని ప్రజల జీవితాలను, జీవనోపాధిని నేరుగా ప్రభావితం చేసే ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందని విజయన్ అన్నారు. 'ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం జోక్యం చేసుకుంటోంది. అయితే, కేంద్ర వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972, రాష్ట్రం స్వతంత్రంగా వ్యవహరించే సామర్థ్యాన్ని పరిమితం చేస్తూ ఒక పెద్ద అడ్డంకిగా మిగిలిపోయింది' అని ఆయన అన్నారు. పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ, అడవి పందులను హానికరమైన జీవులుగా ప్రకటించేందుకు కేరళకు కేంద్రం అనుమతి ఇవ్వలేదన్నారు. 'ఈ చట్టాన్ని కాంగ్రెస్ తీసుకువచ్చింది, కానీ బిజెపి ప్రభుత్వం అవసరమైన సవరణలు చేయడంలో విఫలమై, ఈ సమస్యను మరింత క్లిష్టతరం చేసింది' అని ఆయన ఆరోపించారు. ఈ పరిమితుల్లోనే, ప్రజలను విడిచిపెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగిందని విజయన్ అన్నారు. వన్యప్రాణుల దాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ.10 లక్షల నుంచి రూ.14 లక్షలకు పెంచినట్లు ఆయన తెలిపారు.

# సంస్థాగత సమగ్రతకు హామీ ఏదీ?

# ఇసి పత్రంపై బిజెపి చిహ్నమా!

**సిపిఐ ఎంపి సందోశ్ కుమార్ ప్రశ్నలు**



**న్యూఢిల్లీ:** సంస్థాగత తటస్థ వైఖరికి, విధానపరమైన సమగ్రతకు హామీ ఏదంటూ సిపిఐ ఎంపి పి. సందోశ్‌కుమార్ ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తీ రును ఆక్షేపించారు. కేరళలో సిఇఒజారీ చేసిన అ ధికారిక పత్రంపై బిజెపి ముద్ర ఉండటాన్ని ప్ర శ్నించారు. దీనిని మానవతా తప్పిదంగా కొట్టిపా రేయడాన్ని నిందించారు. లోపభూయిష్ట మార్గ దర్శకాలు ఇవ్వడాన్ని నిలదీశారు. ఈ మేరకు ఆయ న ప్రధాన ఎన్నికల అధికారి (సిఇసి) జ్ఞానేశ్ కుమా ర్‌కు బుధవారం ఒక లేఖ రాశారు. కేరళ ఘటనపై తక్షణమే నిష్పాక్షి కంగా విచారణ జరిపించి, బా ధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని సందోశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం అ ధికారిక పత్రంపై బిజెపి ముద్ర ఉండటాన్ని మానవ తప్పిదమంటూ కేరళ ఎన్నికల అధికారి (సిఇఒ) కొ ట్టిపారేయడం సంస్థాగత ఉదాసీనతకు అద్దం ప ట్టిందని వ్యాఖ్యాని ంచారు. ఎన్నికల పారదర్శకత, ప్రజాస్వామ్యం పరిరక్షణ బాధ్యతగల అధికారి ను ంచి ఇంత నిర్లక్ష్యపు సమాధానం ఆశించలేదన్నారు. ఇది సాధారణ తప ్పు కాదని, భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) విశ ్వసనీయతకు, తటస్థ వైఖరికి, రాజ్యాంగ బద్ధ సమగ్రతకు విఘాతమన్నారు. దీంతో ఎన్నికల ప్రక్రియపై ప్రజలు విశ్వాసం కో ల్పోతారన్నారు. అభ్యర్థుల నేర చరిత్రపై కాలం చె ల్లిన ఎఫ్‌ఏక్యూలతో సమాచారాన్ని ప్రచారంలోకి తేవడంపై సందోశ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేరళ సిఇఒ తాజా మార్గదర్శకాలు అనేక ప్రశ్నలకు, అనుమానాలకు తావిస్తున్నట్లు తెలిపారు. చట్టపర మైన, విధానపరమైన అవసరాల తాజా సమా చారానికి బదులు పాత వివరాలతో సిఇఒ కార్యా లయం మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా రాష్ట్రం లోని రాజకీయ పార్టీలను తప్పుదోవ పట్టించడం లేదా నష్టం కలిగించడం కోసం ప్రయ త్నాలు జరు గుతున్నాయా అన్న అనుమానం కలు గక మానదని సందోశ్‌కుమార్ వ్యాఖ్యానిం చారు. ఈ పరిణామాల క్రమంలో తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశా లివ్వాలని, ఇందుకు కాల పరిమితిని నిర్దేశించాలని సిఇసి జ్ఞానేశ్ కు మార్‌ను కోరారు. ఇసిఐ పత్రంపై రాజకీయ పార్టీ ముద్ర అన ధికారికంగా వినియోగి ంచడంపై, కా లం చెల్లిన స మాచారంతో మార్గద ర్శకాలు ఇవ్ వడంపై స్వతంత్ర దర్యాప్తు జరిపిం చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం సమగ్రత దేశ ప్రజాస్వామ్యానికి ఆధారమని, దీంతో రాజీ పడితే అత్యంత కఠినంగా వ్యవహరించడం అవసరమని సూచించారు.

केनरा बैंक Canara Bank Syndicate
సూర్యాపేట ఎంజి రోడ్ శాఖ, హోటల్ బాలాజి గ్రాండ్ లేన్ ఎదురుగా, సూర్యాపేట ఎంజి రోడ్, సూర్యాపేట జిల్లా - 508213

**ఇ-వేలం అమ్మకం ప్రకటన**

**వేలం తేది మరియు సమయం: 30.03.2026 ఉ.11.30 గం.నుండి మ.12.30 గం.వరకు (అమ్మకం పూర్తయ్యేవరకు ప్రతిసారి 5 నిమిషాల అపరిమిత ఎక్స్‌టెన్షన్స్‌తో) దరావతు డిపాజిట్‌కు చివరి తేది: 29.03.2026 సా.5.00 గం.వరకు.**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8 (6) యొక్క నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటర్(ల)కు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ఛార్జి చేయబడిన మరియు **సూర్యాపేట ఎంజి రోడ్ శాఖ** యొక్క అధీకృత అధికారిచే సంభావిత/ భౌతిక స్వాధీనత చేపట్టబడిన దిగువతెలిపిన స్థిరాస్తి, కెనరా బ్యాంక్, సూర్యాపేట ఎంజి రోడ్ శాఖకి రావల్సిన బకాయిలు **రూ. 9,96,193.66 (తొమ్మిది లక్షల తొంబై ఆరు వేల ఒక వంద తొంబై మూడు రూపాయల అరవై ఆరు పైసలు మాత్రమే)** (17.12.2025 నాటికి కాంట్రాక్చువల్ బకాయిలు) రాబట్టుకునేందుకు **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది, అక్కడ అది అలానే"** ప్రాతిపదికన 30.03.2026న విక్రయించబడుతుంది.

**రుణగ్రహీతల పేరు చిరునామా: శ్రీ ఈర్లల జ్యోతి భర్త వెంకన్న,** ఇంటి నెం.1-10-99, అంబేద్కర్ నగర్, సూర్యాపేట 508213. (కో-ఆబ్లిగెంట్) **శ్రీ ఈర్లల వెంకన్న,** తండ్రి: రాములు, ఇంటి నెం.1-10-99, అంబేద్కర్ నగర్, సూర్యాపేట 508213. గ్యారంటర్: **శ్రీ కె. శ్యామ్‌సన్ తండ్రి అబ్రహం,** ఇంటి నెం.1-8-64/3/ఎ, చర్చ్ కాంపౌండ్, సూర్యాపేట 508213. ఆస్తి పూర్తి వివరం: సూర్యాపేట జాయింట్ సబ్-రిజిస్ట్రార్-15 మరియు నల్గొండ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ అధికార పరిధిలో బ్లాక్ నెం.10, వార్డు నెం.1, బి మాధారం రెవిన్యూ గ్రామంలోని అంబేద్కర్ నగర్ రెసిడెన్షియల్ ఏరియా వద్ద గల మొత్తం 199.52 చ.గజాల ఆర్‌సిసిలో 100.31 చ.గజాల విస్తీర్ణంలో ఇంటి నెం.1-10-99 మరియు 99.21 చ.గజాల విస్తీర్ణంలో ఇంటి నెం.1-10-100 గల ఆస్తి యావత్తు. సరిహద్దులు: **ఉత్తరం:** నూకల వెంకన్న ఇల్లు, **దక్షిణం:** 30 అ.రోడ్, **తూర్పు:** తిరుపతయ్య ఇల్లు, **పడమర:** 20 అ. రోడ్.

**రిజర్వు ధర: రూ.5,57,000/- ధరావతు (ఇఎండి): రూ.55,700/-**

బ్యాంక్‌కు తెలిసిన ఎన్కంబ్రెన్సులు లేవు. ఆన్‌లైన్ పోర్టల్ **https://baanknet.com** ద్వారా వేలం నిర్వహించబడుతుంది. రిజర్వుధరలో 10% ధరావతు మొత్తాన్ని నేరుగా మెసర్స్ **PSB** అలయెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (బ్యాంక్ నెట్) పోర్టల్ యొక్క ఇ-వాలెట్‌లో చెల్లించాలి లేదా చలాన్ జనరేట్ చేయడం ద్వారా సదరు చలాన్‌లో తెలిపిన విధంగా ఖాతా వివరాలతో **RTGS/NEFT** ద్వారా ధరావతును చెల్లించాలి.

బిడ్డింగ్ ప్రాసెస్ మాన్యువల్, బిడ్డరు రిజిస్ట్రేషన్ మరియు ధరావతు చెల్లించుట కొరకు ఆన్‌లైన్ పోర్టల్ వెబ్‌సైట్ **https://baanknet.com**ను చూడవచ్చును. సంప్రదించు నెం. 8291220220. ఇ-మెయిల్: **support.baanknet@psballiance.com** విక్రయ సవివర నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ **(www.canarabank.com)** లో ఇచ్చిన **"ఇ-వేలం"** లింక్‌ను చూడగలరు లేదా ఏదేని పని రోజున కార్యాలయ వేళలలో **బ్రాంచ్ మేనేజర్/ మేనేజర్, కెనరా బ్యాంక్, సూర్యాపేట ఎంజి రోడ్ శాఖ వారిని ఫోన్ నెం.7901618271 పై** సంప్రదించగలరు.

**తేది: 01.03.2026, ప్రదేశం: సూర్యాపేట** సం/- **అధీకృత అధికారి**

# గందరగోళం మధ్య ప.బెంగాల్ ఎన్నికలు

నాలుగు రాష్ట్రాలు – కేరళ, అసోం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు – కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీలకు ఎన్నికల నిర్వహణ షెడ్యూలును భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన దరిమిలా ఒకవైపు రాజకీయ పక్షాలు పొత్తులు, ప్రచారం ఏర్పాట్లలో, మరోవైపు ఎన్నికల కమిషన్ నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమైనాయి. పై నాలుగు రాష్ట్రాల్లో మూడింటిలో, యుటిలో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాల సమగ్ర సమీక్ష(ఎస్ఐఆర్) నిర్వహించి ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు తుది ఓటర్ల జాబితాలను ప్రకటించింది. ఒక్క పశ్చిమ బెంగాల్‌కు సంబంధించి అసంపూర్ణ జాబితా వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లో మాత్రమే 'సర్' విషయంలో ఎందుకింత వివాదం అని సుప్రీంకోర్టు ధర్మాసనం కూడా సంబంధిత కేసు విచారణ సందర్భంలో ప్రశ్నించింది. ఆ విషయానికి వచ్చేముందు ఓటర్ల జాబితా విశేషాలు తెలుసుకోవటం అవసరం. 'సర్' ప్రకటనకు ముందు మొత్తం ఓటర్ల సంఖ్య 7 కోట్ల 89లక్షలు. ఇంట్లో లేరు, వేరు చోటికి మారారు, చనిపోయారు, డూప్లికేట్ కారణాలతో ఎన్నికల కమిషన్ సుమారు 64 లక్షల ఓట్లు తొలగించింది. మరింత స్క్రూటినీ అవసరం అనే కేటగిరి కింద మరో 60లక్షల మంది ఓటర్ల పేర్లు ఉంచింది. దీన్ని విచారించిన సుప్రీంకోర్టు ఆ మినహాయింపులను న్యాయాధికారుల పరిశీలన – నిర్ణయం కోసం ఆదేశించింది. ఒడిశా, చత్తీస్‌ఘడ్‌ల నుంచి కూడా న్యాయాధికారులను రప్పించారు. కలకత్తా హైకోర్టు పర్యవేక్షణ కింద మొత్తం 700 మంది ఓటర్ల ఫిర్యాదులు పరిశీలిస్తున్నారు. ఎన్నికల కమిషన్ సోమవారం రాత్రి బాగా పొద్దుపోయాక ఆ 60లక్షల్లో న్యాయాధికారులు పరిష్కరించిన 29లక్షల ఓటర్ల జాబితాను ప్రకటించింది. వాటిలో ఎన్ని ఆమోదం పొందాయో, ఎన్ని నిరాకరించబడ్డాయో వివరణ, వివరాలు లేవు. కనీసం 10లక్షలమంది పేర్లు తొలగించబడినట్లు అనధికార సమాచారం. ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరుగుతున్నందున ఆలోపు మిగతా 30 లక్షల ఓట్లపై న్యాయాధికారులు నిర్ణయం చేయటం, ప్రకటించటం సాధ్యమా అన్నది ఇప్పుడు ఎదురవుతున్న ప్రధాన ప్రశ్న. అంతేగాక, తిరస్కరించబడిన ఓటర్ల అప్పీళ్ల పరిష్కారానికి హైకోర్టు 19 ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేసింది. తిరస్కరణకు గురైన ఓటర్లందరూ అప్పీలు చేసుకోగలరా? అప్పీలు చేసుకున్నా సకాలంలో పరిష్కారమౌతాయా? రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచార క్షేత్రంలో మునిగి ఉన్నందున వీరిపై వారు శ్రద్ధ పెట్టటం సాధ్యం కాదు.

ఓటర్ల జాబితాలో స్థానం కోల్పోయిన వారిలో ఒక మంత్రి, తృణమూల్ అభ్యర్థి ఒకరు కూడా ఉన్నారు. సోమవారం ప్రకటించిన తొలి అనుబంధ జాబితాలో వారి పేర్లు లేవు. మంత్రి గులాం రబ్బానీ పశ్చిమ దినాజ్‌పూర్ జిల్లాలోని గోయల్ పోఖర్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే. మూడు పర్యాయాలు తృణమూల్ ఎమ్మెల్యేగా గెలిచిన రబ్బానీని పార్టీ మళ్లీ అభ్యర్థిగా నియమించింది. ఆయన నియోజకవర్గంలో 70వేలమంది ఓటర్లు 'అడ్జ్యుడికేషన్' కింద ఉన్నారు.

15 సంవత్సరాలుగా అధికారంలో ఉండి, నాల్గవ పర్యాయం ప్రజల తోడ్పాటు అర్థిస్తున్న మమతా బెనర్జీ ప్రభుత్వంపై ఎంతో వ్యతిరేకత ఉంది. అయితే 'సర్' వివాదంలో తలెత్తిన భావోద్వేగ 'ఉపజాతి' అంశాలతో అవన్నీ వెనక్కుపోయాయి. ఈ ధీమాతోనే ఆమె 226 సీట్లు గెలుస్తామని గంభీర ప్రకటనలు చేస్తున్నారు. తృణమూల్ కాంగ్రెస్, బిజెపి మధ్య ప్రధాన పోటీ ఉండగా, సిపిఐ(ఎం) లెఫ్ట్ ఫ్రంట్, కాంగ్రెస్ ఈసారి విడివిడిగా పోటీ చేస్తున్నాయి. దీంతో చతుర్ముఖ పోటీలు జరుగుతాయి

'సర్'పై ప.బెంగాల్‌లోనే ఎందుకింత వివాదం? ఈ సరిహద్దు రాష్ట్రంలో ముఖ్యంగా 1972లో బంగ్లాదేశ్ (ఒకనాటి తూర్పు బెంగాల్) విముక్తి పోరాటం నాటినుంచీ కాందిశీకుల రాక పెద్ద ఎత్తున జరిగింది. వారిలో అత్యధికులు ముస్లింలు. ప.బెంగాల్‌లో ఆదినుంచీ ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వలస వచ్చిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆవాసం కల్పించాయి. కాలక్రమంలో వారిలో కొందరు ఓటర్లుగా కూడా నమోదు అయి ఉండవచ్చు. ముస్లింలు సహజంగా ఒకప్పుడు కమ్యూనిస్టులకు, తర్వాత తృణమూల్ కాంగ్రెస్‌కు ఓటు బ్యాంక్‌గా ఉన్నారు. కాబట్టి 'చొరబాటుదారులు' అనే పేరుతో పెద్ద ఎత్తున ముస్లింలను ఓటర్ల జాబితా నుంచి తొలగించకపోతే బిజెపి అధికారం ఆశలు నెరవేరవు. అందుకని 'సర్'ని ప్రయోగించింది. తొలగించిన, అడ్జ్యుడికేషన్ కేసులో పెట్టిన 1 కోటి 24లక్షల మందిలో అత్యధికులు ముస్లింలు ఎక్కువగా ఉన్న ఐదారు జిల్లాల్లోనే ఉన్నారు. పౌరులుగా ధృవీకరణ పత్రాలులేని దళితులు, బలహీన వర్గాలు కూడా పెద్దసంఖ్యలో ఓటు హక్కు కోల్పోయారు. వారి ఓటు హక్కు రక్షణకు మమతా బెనర్జీ నాయకత్వంలోని టిఎంసి గట్టిగా పోరాడుతూ, ఎన్నికల కమిషన్‌ను అడుగడుగునా నిలదీస్తున్నది, సుప్రీంకోర్టులో సైతం న్యాయపోరాటం చేస్తోంది. ఢిల్లీలోని బిజెపి నాయకుల చేతిలో ఎన్నికల కమిషన్ కీలుబొమ్మగా మారిందని ప్రచారం సాగిస్తోంది.

ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై పార్లమెంటు ఉభయ సభల్లో 150 మందికిపైగా ప్రతిపక్ష సభ్యులు అభిశంసనను ప్రతిపాదించటంతో ప్రతిపక్షాలు – ఎన్నికల కమిషన్ మధ్య ఘర్షణ పతాక స్థాయికి చేరింది. పక్కనే ఉన్న అసోంలోనూ బిజెపి బెంగాలీ ముస్లింలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తోంది. దాడులు సైతం జరిగాయి. బెంగాల్, అసోంల్లోని బెంగాలీ ముస్లింలందరూ బిజెపికి 'చొరబాటుదారులు'గానే కనిపిస్తున్నారు. బెంగాలీల ఓటు హక్కు కాపాడేందుకు మమతా బెనర్జీ పోరాటం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ బిజెపి పక్షపాతాన్ని ఎండగడుతూ ఓటర్ల సానుభూతి పొందుతున్నారు. తృణమూల్ కాంగ్రెస్ అధికారం నిలుపుకుంటే జ్ఞానేశ్‌కుమార్‌కు అదే నిజమైన అభిశంసన అవుతుంది. ●



## ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి

**డీలిమిటేషన్, సీట్ల పెంపు, రానున్న 30 ఏళ్ల పాటు రాష్ట్రాలకు ప్రస్తుత ప్రాతినిధ్య వాటా కొనసాగుతుందనే హామీ కోసం రాజ్యాంగ సవరణలు చేయడానికి జూన్‌లో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. నాలుగు ప్రధాన రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో లబ్ధి పొందడమే బహుశా ఈ (కేంద్రం తీసుకున్న చర్య) లక్ష్యం'. మహిళా రిజర్వేషన్ల చొరవను ఎటువంటి ముందస్తు షరతులు లేకుండా పూర్తిగా సమర్థిస్తున్నా. అదే సమయంలో న్యాయమైన నియోజకవర్గాల పునర్విభజనకు తమకున్న హక్కును కూడా కాపాడాలి. 'రాష్ట్రాల ప్రస్తుత దామాషా ప్రాతినిధ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భంగపరచకూడదు. దీనిని సాధించడానికి, రాష్ట్రాల మధ్య నియోజకవర్గాల పునర్విభజన, పంపిణీలో, రాబోయే 30 సంవత్సరాల పాటు దీనిని నిర్ధారించే రాజ్యాంగ నిబంధనను చేర్చాలి.**

– తమిళనాడు ముఖ్యమంత్రి
ఎం.కె. స్టాలిన్

## మూర్ఛ రోగం-మెదడును ప్రభావితం చేసే నాడీ సంబంధ వ్యాధి

మూర్ఛ వ్యాధి పట్ల మానవాళికి అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మార్చి 26వ తేదీని 'పర్పుల్ డే లేదా అంతర్జాతీయ మూర్ఛ దినోత్సవం'గా పాటిస్తారు. ఈ సంవత్సరం పర్పుల్ డే–2026 యొక్క ఇతివృత్తం 'అనుభవ కథలను కార్యాచరణగా మార్చడం'. ఇది మూర్ఛ వ్యాధిగ్రస్తులు ఈ ఆరోగ్య సమస్యను ఎదుర్కోవడానికి, దాని నుండి కోలుకోవడానికి అవసరమైన మద్దతు యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. మూర్ఛ అనేది మెదడును ప్రభావితం చేసే ఒక నాడీ సంబంధిత వ్యాధి, ఇది ఫిట్స్‌కు కారణమవుతుంది.

ప్రపంచంలో అత్యంత సాధారణ దీర్ఘకాలిక వ్యాధులలో మూర్ఛ ఒకటి, ఇది అన్ని వయసుల, జాతు లు, లింగాల ప్రజలను ప్రభావితం చేస్తుంది. మూర్ఛపై ప్రజల అవగాహనను పెంచడం, దానితో ముడిపడి ఉన్న కళంకాన్ని తగ్గించడం, ఈ వ్యాధితో జీవిస్తున్న వారికి మద్దతు ఇవ్వడం పర్పుల్ డే యొక్క లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా 50 మిలియన్ల కంటే ఎక్కువమంది మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారు, అయినప్పటికీ చాలామంది సరైన చికిత్స, మద్దతు పొందడానికి ఇప్పటికీ ఇబ్బంది పడుతున్నారు.

**మూర్ఛ వ్యాధి ఓ ప్రజారోగ్య సమస్య :** అవగాహన వ్యాప్తికి సహాయపడటానికి, పర్పుల్ డే రోజున ప్రజలను ఊదా రంగు దుస్తులు ధరించమని, కార్యక్రమాలను నిర్వహించమని, మూర్ఛ వ్యాధి గురించి సమాచారాన్ని పంచుకోమని ప్రోత్సహిస్తారు. ఈ రుగ్మత ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేస్తోంది, అందువల్ల ఈ ఆరోగ్య సమస్యను పరిష్కరించడానికి ప్రపంచవ్యాప్త చర్యలు అవసరం. మెదడులోని సాధారణ విద్యుత్ కార్యకలాపాలకు అంతరాయం కలిగినప్పుడు మూర్ఛలు వస్తాయి, దీనివల్ల స్పృహ కోల్పోవడం, కండరాల నొప్పులు లేదా వణుకు సంభవిస్తాయి. చాలా మందికి మూర్ఛ అనేది జీవితాంతం ఉండే పరిస్థితి అయినప్పటికీ, సరైన చికిత్సతో దీనిని నియంత్రించవచ్చు. ఈ చికిత్సలో మందులు, జీవనశైలి మార్పులు, కొన్నిసార్లు శస్త్రచికిత్స కూడా ఉంటాయి. దురదృష్టవశాత్తు, వైద్య చికిత్సలో పురోగతి సాధించినప్పటికీ, మూర్ఛ వ్యాధిపై ఒక అపవాదు కొనసాగుతోంది, చాలా మందికి ఈ పరిస్థితి గురించి పూర్తిగా తెలియదు. అందువల్ల, అవగాహన పెంచడానికి, అపోహలను తొలగించడానికి, ఆ దురదృష్టవంతులకు మద్దతు ఇవ్వడానికి పర్పుల్ డే చాలా కీలకమైనది.


**మూర్ఛ వ్యాధి – చేయవలసినవి, చేయకూడనివి:**

పర్పుల్ డే యొక్క ప్రధాన లక్ష్యం అవగాహన కల్పించడం, మూర్ఛ వ్యాధికి సంబంధించిన అపోహలను తొలగించడం, పరిశోధన పురోగతిపై అవగాహన కల్పించడం, ఊదా రంగు దుస్తులు ధరించడం ద్వారా బాధితులకు మద్దతు ఇవ్వడం, పరిశోధనా కేంద్రాలకు విరాళాలు ఇవ్వడం, ఇతరులందరికీ అవగాహన కల్పించడం, సోషల్ మీడియా ప్రచారాల ద్వారా అవగాహన కల్పించడం. మూర్ఛ రోగులకు మద్దతు ఇచ్చేవారికి సూచించే సలహాలు: ప్రశాంతంగా ఉండండి, ఆ వ్యక్తిని సురక్షితంగా ఉంచండి, వారిని సున్నితంగా పట్టుకోండి, వారి తలకు దిండు పెట్టండి, వారి నోటిలో ఏమీ పెట్టవద్దు, వారిని గట్టిగా పట్టుకోవద్దు మరియు వారిని బలవంతంగా నిద్రలేపవద్దు.

అవగాహన కల్పించడం, ఇతరులకు విద్యను అందించడం, మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న వారికి మద్దతు ఇవ్వడం ద్వారా, మనం మరింత సమ్మిళితమైన, అవగాహనతో కూడిన ప్రపంచాన్ని నిర్మించగలము.

**(మార్చి 26న అంతర్జాతీయ మూర్ఛ లేదా పర్పుల్ దినోత్సవం సందర్భంగా)**

# 'డబుల్ ఇంజన్' అందమైన నినాదం : సమాఖ్య విధానంపై గంభీరమైన ప్రశ్న



ఎస్‌వై. ఖురైషీ
భారత మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్

ప్రతీ ఎన్నికలు గుర్తుండిపోయే నినాదాలను సృష్టిస్తాయి. ఓట్లు లెక్కించిన తర్వాత అవి చాలావరకు మరుగున పడిపోతాయి. కానీ కొన్ని మాత్రం నిలిచిపోయి, పరిపాలనను, పౌరుల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేయటం ప్రారంభిస్తాయి. అలాంటి ఒక పదమే 'డబుల్ ఇంజిన్ సర్కార్'. మొదటిసారి విన్నప్పుడు, అభివృద్ధిని వేగవంతం చేయడానికి రెండు ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేయడం అనేది నిరపాయకరంగా, ముద్దుగా కూడా అనిపిస్తుంది. అయినప్పటికీ, ఈ రూపకం వెనుక భారతదేశ సమాఖ్య ఒప్పందానికి సంబంధించిన ఒక తీవ్రమైన రాజ్యాంగపరమైన ప్రశ్న దాగి ఉంది.

ఈ ఆలోచన చాలా సరళమైనది. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉంటే, ఆ రెండు ప్రభుత్వాలు సామరస్యంగా పనిచేస్తాయి కాబట్టి వేగంగా అభివృద్ధి జరుగుతుంది. పైకి ఇదేమి అభ్యంతరకరం కాదు. నిజానికి వివిధ స్థాయిలలోని ప్రభుత్వాలు సమన్వయం చేసుకోవాలి. అదే సహకార సమాఖ్యవాదం. అసలు ప్రశ్న ఏమిటంటే, వాటికి ఒకే రాజకీయ భావజాలం లేనప్పుడు ఏమి జరుగుతుంది? కానీ 'డబుల్ ఇంజిన్' అనే నినాదంలో ఒక లోతైన అంతరార్థం ఉంది. కేంద్రం లో ఏ పార్టీ అధికారంలో ఉంటుందో అదే పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకే ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి వెళ్తుందని ఇది సూచిస్తుంది.

### 'ఒకే పార్టీ రాష్ట్రాల' ప్రయోజనం

ఎన్నికల ప్రచారాల సమయంలో చాలా స్పష్టంగా ఒక సందేశం తరచుగా ఇవ్వబడుతుంది. 'కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీని ఎన్నుకోవడం ద్వారా మీ రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధి నుండి ప్రయోజనం పొందగలదు. మీరు అలా చేయకపోతే, మీకు నిధులు అందవు.' రాజ్యాంగపరమైన చిక్కు ఇక్కడే మొదలవుతుంది.

రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంలోని అధికార పార్టీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడే వ్యవస్థను భారత రాజ్యాంగం ఆశించదు. ఇది కేంద్రం, రాష్ట్రా లు తమ తమ అధికార పరిధులలో భాగస్వాములుగా ఉండే సమాఖ్య నిర్మాణాన్ని సృష్టించింది. కేంద్ర ప్రభుత్వం కేవలం న్యూఢిల్లీలో అధికారంలో ఉన్న పార్టీ పరిపాలించే రాష్ట్రాలకు మాత్రమే కాకుండా, మొత్తం గణతంత్ర దేశానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

జాతీయ పన్నుల ద్వారా వసూలు చేసిన ప్రజాధనం భారత యూనియన్‌కు చెందుతుందే తప్ప అధికారంలో ఉండే పార్టీకి కాదు. ప్రతి రాష్ట్రంలోని పౌరులు ఎవరికి ఓటేసారనే అంశంతో సంబంధం లేకుండా వారి నుండి గణతంత్రం పేరు మీద పన్నులు వసూలు చేయబడతాయి. ఈ వనరుల పంపిణీ ఒక రాష్ట్రాన్ని ఏ పార్టీ పాలిస్తుందనే దానిపై ఆధారపడి ఉండకూడదు. కేరళ లేదా తమిళనాడులోని పౌరుడు చెల్లించే పన్నులనే ఉత్తర ప్రదేశ్ లేదా మధ్య ప్రదేశ్‌లోని పౌరుడు కూడా చెల్లిస్తాడు. ప్రతిఫలంగా ఇద్దరికీ వారి న్యాయమైన వాటా లభిస్తుందన్నదే రాజ్యాంగ హామీ.

భారత రాజ్యాంగ నిర్మాతలు ఈ ప్రమాదాన్ని అర్థం చేసుకున్నారు. అందుకే వారు వ్యవస్థలో సంస్థాగత రక్షణలను పొందుపరిచారు. వాటి లో అత్యంత ముఖ్యమైనది ఆర్థిక సంఘం. ఆర్టికల్ 280 ప్రకారం కేంద్ర ఆదాయాలను రాష్ట్రాలతో ఎలా పంచుకోవాలో సిఫార్సు చేయడానికి ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఆర్థిక సంఘాన్ని నియమించాలి. దీని ఉద్దేశ్యం చాలా కీలకమైనది. అది ద్రవ్య(ఆర్థిక) బదిలీలు నియమాల ఆధారంగా జరగాలి తప్ప రాజకీయంగా చర్చల ద్వారా కాదు. ఈ కమిషన్ నిష్పాక్షిక ప్రమాణాల ఆధారంగా రాష్ట్రాలను మూల్యాంకనం చేస్తుంది – రాష్ట్రాల ఆదాయాలు జాతీయ సగటు కంటే ఎంత వెనుకబడి ఉన్నాయో, వాటి జనాభా, భౌగోళిక పరిమాణం, ఆర్థిక సామర్థ్యం ఆ ప్రమాణాలు. దీనివల్ల ఎవరికి ఏమి లభిస్తుందో రాజకీయాలు నిర్ణయించలేవు.

### రాష్ట్రాలు లేవనెత్తిన సమస్యలు, సమాఖ్య ఘర్షణ

ఆర్థిక సమాఖ్యవాదంపై ఇటీవలి చర్చలు ఈ అంశం ఎంత సున్నితమైనదో తెలియజేస్తున్నాయి. జనాభా పెరుగుదలను విజయవంతంగా నియంత్రించినందుకు, కేటాయింపు సూత్రాలలో ఇటీవలి జనాభా గణాంకాలను ఉపయోగించడం తమను శిక్షించటం అవుతుందని దక్షిణ రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మరో సమస్య ఏమిటంటే, కేంద్ర ప్రభుత్వం సెస్సులు, సర్‌ఛార్జీలను ఎక్కువగా ఆశ్రయించడం. ఇవి పంపిణీ పరిధిలోకి రావు, రాష్ట్రాలతో పంచుకోబడవు. ఇది రాజ్యాంగబద్ధంగా పంపిణీ చేయాల్సిన వనరుల పరిమాణాన్ని సమర్థవంతంగా తగ్గిస్తుంది. తద్వారా ఆర్థిక అధికారం కేంద్రం చేతుల్లో కేంద్రీకృతమవుతుంది. రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తి బలహీనపడుతుంది. ప్రస్తుతం చర్చలు జరుపుతున్న పదహారవ ఆర్థిక సంఘం, ఆర్థిక సమాఖ్యవాదంలోని నిష్పాక్షికతపై విశ్వాసాన్ని పునరుద్ధరించాలంటే ఈ ఆందోళనలను తీవ్రంగా పరిష్కరించాల్సి ఉంటుంది.

జనాభాను స్థిరీకరించడానికి ముందుగా చొరవ తీసుకున్న రాష్ట్రాల ను జాతీయ వనరుల పంపిణీలో శిక్షించకూడదని తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు వాదించాయి. ఈ రాష్ట్రాలకు చెందిన సీనియర్ మంత్రులు అప్పుడప్పుడు తీవ్ర నిరాశతో రాజ్యాంగబద్ధంగా తమకు చెందాల్సిన నిధుల కోసం యాచించే 'భిక్షగాళ్లుగా' మారిపోయామని వ్యాఖ్యానించారు. ఇది రాజకీయ రంగస్థలి భాష కాదు. భారత యూనియన్‌లో రాష్ట్రాలు పాలుపంచుకునే నిబంధనల పట్ల ఉన్న నిజమైన వ్యవస్థాగత ఫిర్యాదును ఇది ప్రతిబింబిస్తుంది.

సమాఖ్య విషయంలో ఘర్షణ కేవలం ఆర్థిక విషయాల్లోనే కాకుండా శాసన ప్రక్రియలో కూడా కనిపిస్తుంది. ఇటీవలి సంవత్సరాలలో, కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికైన శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు సుదీర్ఘకాలం పాటు తొక్కిపెట్టడం ద్వారా తమ రాజ్యాంగ పదవిని రాజకీయ ద్రోహానికి ఒక సాధనంగా సమర్థవంతంగా ఉపయోగిస్తున్నారు. ప్రత్యేకించి తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో సుదీర్ఘ జాప్యాలు చోటుచేసుకున్నాయి. ఈ ధోరణిని విస్మరించడం కష్టం. కేంద్రంలోని అధికార పక్షానికి వ్యతిరేక పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాల్లోనే ఈ జాప్యాలు చోటుచేసుకున్నాయి.ఎన్నికైన శాసనసభ ఆమోదించిన చట్టానికి గవర్నర్ ఆమోదం నిలిపివేసే విధానమంటే రెండో ఇంజిన్‌ను వెనక్కి నడవడంతో సమానం.

ఇలాంటి జాప్యాలు న్యాయవ్యవస్థ దృష్టిని ఆకర్షించాయి. స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ ప్రిన్సిపల్ సెక్రటరీ టు ది గవర్నర్ ఆఫ్ పంజాబ్ (2023)కేసులో, శాసన ప్రక్రియను నిలిపివేయడానికి గవర్నర్ నిష్క్రియాత్మకతను ఉపయోగించలేరని భారత సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎన్నికైన శాసనసభపై గవర్నర్ కార్యాలయం సమాంతర రాజకీయ అధికారంగా పని చేయడానికి ఉద్దేశించబడింది కాదని కోర్టు నొక్కి చెప్పింది.

ఇటీవల స్టేట్ ఆఫ్ తమిళనాడు వర్సెస్ గవర్నర్ ఆఫ్ తమిళనాడు (2025)కేసులో, కోర్టు, గవర్నర్ సుదీర్ఘకాలం పాటు చర్య తీసుకోకపోవడం అనేది బిల్లులకు ఆమోదం తెలపడంలో రాజ్యాంగపరంగా అనుమతించబడదు. ఈ తీర్పులన్నీ కలిపి చూస్తే, ఎన్నికైన రాష్ట్ర చట్టసభల శాసన సార్వభౌమాధికారాన్ని పరిరక్షించడానికి న్యాయవ్యవస్థ దృఢంగా కట్టుబడి ఉందని సూచిస్తున్నాయి.

గత దశాబ్ద కాలంలో ఢిల్లీలో జరిగిన అనుభవం ఇందుకు మరో నిదర్శనం. ఎన్నికైన ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు లెఫ్టినెంట్ గవర్నర్, కేంద్ర ప్రభుత్వంతో వివాదాలలో చిక్కుకున్నాయి. చివరికి న్యాయస్థానాలు జోక్యం చేసుకోవలసి వచ్చింది. ఈ గుణపాఠం కేవలం ఒక నగరానికి సంబంధించినది కాదు. ప్రజలకు సేవ చేయడానికి బదులుగా, ఒక రాజకీయ ప్రత్యర్థిని శిక్షించేందుకు సమాఖ్య పరిపాలన యంత్రాంగాన్ని ఉపయోగించినప్పుడు ఏమి జరుగుతుందో తెలియజేసే విషయమే ఇది.

ద్రవ్యం బదిలీలు, గవర్నర్ల జాప్యం, ఢిల్లీ ప్రతిష్టంభన వంటి పరిణామాలను కలిపి చూస్తే, వాటిలో ఒక పొందికైన నమూనా కనిపిస్తుంది. 'డబుల్‌ఇంజిన్' నినాదం కేవలం ఒక ప్రచార రూపకం మాత్రమే కాదు. వాస్తవానికి రాజకీయ సఖ్యత లేనప్పుడు పరిపాలన ఎలా పనిచేస్తుందో చెప్పే ఒక వివరణ. సరిగ్గా అదే రాజ్యాంగపరమైన సమస్య. సమాఖ్యవాద స్వరూపం నిలబడుతుంది కాని దాని స్ఫూర్తి నిశ్శబ్దంగా డొల్లగా మారిపోతుంది. భారత సమాఖ్య వ్యవస్థ గతంలో కూడా ఇలాంటి ఉద్రిక్తతలను ఎదుర్కొంది. గత దశాబ్దాలలో, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను తొలగించడానికి ఆర్టికల్ 356ను తరచుగా దుర్వినియోగం చేశారు. ఎస్. ఆర్.బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో కోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ఆ పద్ధతిపై ముఖ్యమైన పరిమితులను విధించింది. నేటి సవాలు మరింత యుక్తివంతమైంది. ప్రభుత్వాలు అధికారంలో కొనసాగవచ్చు, కానీ, పరిపాలన రాజకీయ పొందికలో బందీ కావచ్చు.

### వ్యవస్థాగత సంస్కరణ అవసరం

కావలసింది కేవలం న్యాయపరమైన జోక్యం మాత్రమే కాదు, వ్యవస్థాగత సంస్కరణ. ఆర్థిక సంఘం సిఫార్సులను మరింతగా శిరోధార్యం చేయవచ్చు. బిల్లులపై గవర్నర్లు చర్యలు తీసుకోవడానికి మూడు నెలల వంటి ఒక నిర్దిష్ట చట్టబద్ధమైన కాలపరిమితిని నిర్దేశించవచ్చు, ఆ గడువులోగా చర్యలు తీసుకోని పక్షంలో ఆమోదం లభించినట్లే భావించబడాలి. ఆర్టికల్ 263 కింద ఇప్పటికే ఏర్పాటు చేయబడిన అంతర్‌రాష్ట్ర/ప్రభుత్వ మండళ్లను, కేవలం లాంఛనప్రాయ సమావేశాలుగా కాకుండా, సహకా ర సమాఖ్యవాదానికి నిజమైన వేదికలుగా పునరుజ్జీవింపజేయవచ్చు. ఇవి విప్లవాత్మక ప్రతిపాదనలు కావు. రాజ్యాంగ రూపకర్తలు ఉద్దేశించిన రాజ్యాంగ నిర్మాణానికి ఇవి తార్కికమైన ముగింపులు.

రాజకీయ నినాదాలు ఎన్నికల ప్రచారాలకు ఊపునిస్తూనే ఉంటాయి. కానీ, రాష్ట్ర స్థాయిలో 'తప్పుడు' పార్టీని ఎంచుకుంటే అభివృద్ధి మందగిస్తుందని పౌరులను పరోక్షంగా బెదిరించే నినాదం, కేవలం ఎన్నికల ఎంపికను వక్రీకరించడమే కాదు, అది సమాన పౌరసత్వమనే రాజ్యాంగ వాగ్దానాన్ని క్షీణింపజేస్తుంది. అభివృద్ధి రాజకీయ పొందికలపై ఆధారపడకూడదు. అది ప్రతి రాష్ట్రాన్ని, ప్రతి పౌరుడిని సమాన న్యాయంతో చూసే నియమాలు, సంస్థలపై ఆధారపడి ఉండాలి.

భారతదేశ సమాఖ్య ప్రజాస్వామ్యానికి నిజంగా అవసరమైన ఏకైక ఇంజన్ ఆ రాజ్యాంగ సమతుల్యత తప్ప ఒకే రైలును లాగే ఇంజన్ల సంఖ్య కాదు.

*(ది హిందూ సౌజన్యంతో)*

# నిత్య జ్వలిత పోరాటాల స్ఫూర్తి... ధర్మబిక్షం

'గొప్ప పనులు సాధించాలంటే ఎంతో తపన కావాలి.. అదే ఓ మార్పు తీసుకురావాలంటే తపనతో పాటు సాహసం తోడ్పడాలి' అని విప్లవ యోధుడు చేగువేరా చెప్పిన మాటలను ఒకచోట చేరిస్తే దానికి రూపం ఇస్తే ఆ రూపం ధర్మ బిక్షం గారిలా కనబడుతుంది. స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రజల మనిషి బొమ్మగాని ధర్మ బిక్షం 15వ వర్ధంతి మార్చి 26వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించబడుతున్న సందర్భం ఇది.

ఈ సందర్భంలో పుట్టుక నుండి మరణించే వరకు మధ్య గల జీవితాన్ని ప్రజల కొరకు, దేశం కొరకు అంకితం చేసిన ప్రజానాయకు డు, ప్రజల మనిషి ధర్మబిక్షం చేసిన సేవలను, పోరాటాలను, త్యాగాలను స్మరించు కొని వాటిని ఈ తరానికి తెలియ చెప్పటం ద్వారా ఈ తరాన్ని సమసమాజ నిర్మాణం కోసం కృషి చేసే సైనికులుగా, దేశభక్తులుగా, సామాజిక బాధ్యతలను నిర్వహించాలని ఆలోచనలను కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే కర్తవ్యాన్ని నిర్వహించిన వాళ్ళమవుతాము.




కె.వి.ఎల్
రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి
తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం
9490952649

అందుకే మనము ఈ సందర్భంగా చరిత్రను ఒక్కసారి చదువుకోవాలి.

'మానవ మేధస్సు స్వేచ్ఛను కోరుతుంది
స్వేచ్ఛలో హక్కులు కలిసి ఉంటాయి
హక్కులు రాజ్యాన్ని కోరుతాయి 'అని

బ్రిటిష్ రాజనీతి కోవిదుడు హెచ్ గ్రీన్ చెప్పినట్లుగానే ఈ దేశంలో మేధావులు దేశాన్ని ,బ్రిటిష్ సామ్రాజ్యవాద కబంధహస్తాల నుండి విడిపించాలనుకున్నారు. ఆ పిలుపును ప్రజలకు అందించారు కాబట్టి వేలు లక్షలు గా ప్రజలు స్వాతంత్ర పోరాటాన్ని నిర్వహించారు. ఆ చరిత్రను ,సమాజాన్ని చదువుకున్న వ్యక్తిగాధర్మ బిక్షం ఆనాటి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని చురుకైన పాత్ర ను నిర్వహించాడు.

విద్యార్థి దశ నుండే స్వాతంత్ర్య భావాలతో అభ్యుదయకరమైన ఆలోచనలతో, సమాజ మార్పు లక్ష్యంతో, ముందుకు సాగాడు. పేదరికం వెంటాడుతున్న, ఆయనకు ముందు వెనక ఎవరూ లేకున్నా పాఠశాలలో చదువులో ఫస్ట్ ,ఆటలలో ఫస్ట్, వ్యాసరచన పోటీ, డిబేట్స్ లో కూడా ఫస్ట్ వరుసలో నిలిచాడు. స్కూల్ హెడ్మాస్టర్ సుభాని సాబ్ ధర్మభిక్షం చురుకుదనాన్ని చూసి ముగ్ధుడయ్యాడు, ధర్మ భిక్షాన్ని ప్రోత్సహించాడు. సమాజ స్పృహ మరింతగా పెరిగింది. నిజాం నవాబు నికృష్ట పరిపాలన గురించి అవగాహన కలిగింది. పాఠశాల స్థాయిలోనే తనకు వచ్చే స్కాలర్‌షిప్‌ను పేద విద్యార్థులకు సహాయంగా అందజేశాడు. విద్యార్థి నాయకుడిగా విద్యార్థులను కూడగట్టి బ్లాక్ మార్కెట్ దారులపై దాడి చేశాడు. వారి దోపిడీని ఎండగట్టాడు. కంట్రోల్ వస్తువులు పేదలకు సక్రమంగా అందేలా చూసాడు. నిజాం నవాబు పుట్టినరోజు వేడుకలను బహిష్కరించాలని విద్యార్థులకు పిలుపునిచ్చాడు. విద్యార్థులకు ధైర్యంగా ముందు వరుసలో నిలబడ్డాడు. పాఠశాలను బహిష్కరించి విద్యార్థులను వీధిలోకి తీసుకొచ్చి నిజాముకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేయించిన మొట్టమొదటి విద్యార్థి వీరుడు ధర్మ బిక్షం. ఈ వార్త నిజాం రాష్ట్రమంతా సంచలనాన్ని రేపింది. ఆ క్షణము నుండి ధర్మబిక్షాన్ని నిఘా నేత్రాలు వెంటాడుతున్నాయి ధర్మభిక్షం ప్రమాదకర వ్యక్తిగా నిజాం నవాబు దృష్టిలో ఉన్నది. అయితేనేం ధర్మబిక్షం భయపడలేదు. వందేమాతరం ఉద్యమంలో గొంతు కలిపాడు. ఆర్య సమాజ నిర్మాణానికి, కార్యక్రమాల విస్తరణకు కృషి చేశాడు. జంతుబలిని నిషేధించాలని కోరాడు. ఒకటి, రెండు కాదు ఎన్నెన్నో రూపాలుగా ప్రజా సమస్యలపై ధర్మబిక్షం గొంతెత్తి నినదించాడు.



విద్యార్థులను చైతన్యవం తం చేయాలని భావించి తెలంగాణ రాష్ట్రం లో మొట్టమొదటిసారిగా విద్యార్థుల హాస్టల్ నిర్మించాడు. హాస్టల్లో విద్యార్థులకు గురువుగా, బహు విధాలుగా సేవలందించాడు. దేశభక్తిని నూరిపోశాడు. ధర్మ బిక్షం ఆనాడు పెట్టిన హాస్టల్ దేశభక్తుల, వీర యోధులను తయారుచేసే ఉద్యమ కేంద్రంగా పేరుగాంచింది. హాస్టల్లో చదువుకున్న విద్యార్థులు ఎందరో నాయకులుగా, ఐఏఎస్ ఆఫీసర్లుగా, మంత్రులు గా, డాక్టర్లు, యాక్టర్లుగా, లాయర్లుగా, తెలంగాణ సాయుధ పోరాట యోధులుగా సేవలందించి సమాజ మార్పు, ప్రగతి కొరకు కృషి చేసినారు. ఎందరో స్వాతంత్ర సమరయోధులు త్యాగ మూర్తులు పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్య ఫలం ఎంత మంది కి దక్కుతుందని ఆలోచించ వలసినటువంటి సందర్భం ఇది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని స్వేచ్ఛ, మానవ హక్కులు, వాక్ స్వాతంత్ర్యం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, ప్రకటన స్వేచ్ఛ, శాంతియుత నిరాయుధ సమావేశ స్వేచ్ఛ, సంస్థ, సంఘాలను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ, దేశమంత టా సంచార స్వేచ్ఛ, దేశంలో స్థిర నివాసం ఏర్పరుచుకునే స్వేచ్ఛ, వృత్తి, వర్తక, వాణిజ్య స్వేచ్ఛ ,ఇష్టమైన మతా న్ని స్వీకరించే స్వేచ్ఛ లాంటి ఎన్నో స్వేచ్ఛలు ప్రశ్నలుగా మన ముందు దీనంగా నిలిచి వెక్కిరిస్తున్న సందర్భం ఇది. చిత్తశుద్ధి లేని పాలకుల ప్రజా వ్యతిరేక, విద్యార్థి వ్యతిరేక, మహిళా వ్యతిరేక, పాలన విధానాలు ప్రజలను, దేశాన్ని మరింత ప్రమాదంలోకి, అగాధంలోకి నెట్టివేస్తున్నాయి. విద్యార్థులకు పాఠశాలలో, కళాశాలలో, యూనివర్సిటీల్లో ఎన్నికలు మృగ్యమైనాయి. కార్మికులకు సంఘాలు పెట్టుకునేటటువంటి హక్కుకు ఆటంకా లు కలుగుతున్నాయి. సమ్మె, ప్రదర్శనలు రాస్తారోకోలు బందులు నిర్వహిస్తుంటే దేశద్రోహులుగా ముద్రలు వేస్తూ శిక్షలకు గురి చేసే పరిస్థితి తలెత్తింది. ఇదేనా మనం కోరుకున్న ప్రజాస్వామ్యం? ఇందు కెనా మన పూర్వీకులు స్వాతంత్రం గురించి పోరాడింది అని ఆలోచించే తలలు కావాలి ఇప్పుడు! నలుగురితో చర్చించి పిడికిలి బిగించే చైతన్యం కావాలి ఇప్పుడు ! ఆధైర్యం, ఆ చైతన్యం, ఆ తెగింపు నిజాం పరిపాలనలో, బ్రిటిష్ పరిపాలనలో, ధర్మ బిక్షం లాంటి యోధాను యోధులు ఎందరో పాలకులకు, నిరంకుశత్వానికి ,నిర్బంధాలకు, వెట్టి ,బానిసత్వానికి వ్యతిరేకంగా ప్రాణాలు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర చదవగలిగితే మనకు మార్గాలు సులువుగా దొరుకుతాయి.

'అయ్యా నీ భాంచన్, దొర కాళ్ళు మొక్కుతా' అన్న మట్టి మనుషుల చేత బందూకులు పట్టించిన ఆనాటి పోరాట యోధుల జీవితాన్ని చదివితే ఇప్పుడు చేయవలసిన కర్తవ్యాన్ని బోధిస్తాయి.

నిజాం పాలనలో నిరంతరం భయంతో బతుకే రోజుల్లో ఒక మనిషి వేరే ఒక మనిషిని కలుసుకునే వీలు లేని రోజుల్లో చెట్టుకు ఒకరు ,పుట్టకొకరు ఉన్న గీత కార్మికులను ఏకం చేసి గీత పనివారల సంఘమును స్థాపించాడు. ధర్మబిక్షం వేలం పాటల విధానాన్ని రద్దు చేయించాడు, సహకార సంఘాలకు పోరాడి విజయం సాధించాడు. ధర్మ బిక్షం నాయకత్వములో చేసిన పోరాటం, ఈనాడు కార్మికుల ఇండ్లలో వెలుగులు నింపింది. అఖిల భారత స్థాయిలో కల్లుగీత సంఘాన్ని నిర్మించి జాతీయ అధ్యక్షుడిగా సేవలందించాడు. కల్లుపై నిషేధానికి వ్యతిరేకంగా పోరాడి కల్లుగీత వృత్తిని రక్షించాడు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొట్టమొదటిగా కమ్యూనిస్టు పార్టీ శాఖను నిర్మించిన నాయకుడు అతను . శ్రమజీవులకు ప్రజా సంఘాలు ప్రాణమని ప్రజా సంఘాలకు పోరాటాలే దారులనే సిద్ధాంత ప్రాతిపదిక మీద నడవాలని కార్యకర్తలు క్రమశిక్షణతో నిబద్ధతతో జీవించాలని బోధించిన గొప్ప నాయకుడు ధర్మ బిక్షం. ధర్మబిక్షం, దృష్టి ఆలోచనలు చాలా లోతైనవి, విశాలమైనవి. సెలవు ఉన్నచోట పోరాడితే పరిష్కారం ఉంటుందని నమ్మిన వ్యక్తి. అవసరాల గురించి గొంతెత్తి నప్పుడే పాలకులు ఆలోచిస్తారంటాడు. హామీలకు పొంగిపోవద్దు, పరిష్కారాన్ని సాధించేంతవరకు అలసిపోవద్దు అని అనేక సమావేశాల్లో క్యాడర్‌ను నిత్యం సమరోన్ముఖులను చేస్తుండే వాడు. ధర్మ బిక్షం మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపిగా చట్టసభల్లో ప్రజా గొంతుకై ప్రజల పక్షాన నిలిచాడు. ప్రాజెక్టుల నిర్మాణము,అభివృద్ధి ,సాగు, తాగు నీటి సమస్య పరిష్కారము లాంటి అనేక సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించారు. మొత్తంగా దేశం కోసం, తాను నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి లక్ష్య సాధన బాటలో పయనిస్తూ తన 90వ ఏట కన్ను మూసిన ధర్మ బిక్షం జీవితం ఒక గొప్ప ఆదర్శ గ్రంథం. ప్రజలందరికీ ధర్మబిక్షం ఒక స్ఫూర్తి ప్రదాత. అందుకే తెలంగాణ రాష్ట్రంలోని అనేక జిల్లాలలో దాదాపు పది ప్రాంతాలలో ధర్మబిక్షం గారి విగ్రహాలను ఆవిష్కరించుకున్నారు. ప్రతి సంవత్సరం ఆయన జయంతి, వర్ధంతి లను నిర్వహిస్తూ ఆయన జీవితం నేర్పిన పాఠాలను వింటూ స్ఫూర్తి పొందుతూ తమను తాము తీర్చిదిద్దుకుంటూ ఈ సమాజాన్ని మార్చటానికి పిడికిళ్ళు బిగిస్తుంటారు. సమాజ మార్పుకు, సమసమాజ నిర్మాణం కొరకు పోరాడుదాం. అదే ధర్మబిక్షం గారికి మనమిచ్చే నిజమైన నివాళి..

ప్రజల మనిషి ధర్మబిక్షం గారికి జోహార్లు.

స్థానికం LOCAL NEWS
మహబూబ్‌నగర్
గురువారం
26-03-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily




## రోడ్డు భద్రతపై అవగాహన

**ప్రజాపక్షం/చర్లపల్లి:** రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చునని ట్రాఫిక్ సిఐ శివశంకర్ అన్నారు. బుధవారం మల్కాజ్ గిరి కమిషనరేట్ కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని కీసర బస్టాండ్ వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎస్ఐలు హరిప్రసాద్, జోజి, తదితరులు పాల్గొన్నారు.



## డిసిపి సురేష్‌కుమార్‌కు అభినందనలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఉప్పల్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కొల్లు సురేష్‌కుమార్‌ను పిపి సల్లూరి శివరామకృష్ణ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావులు మర్యాదపూర్వకంగా కలసి వెంకటేశ్వరస్వామి కళ్యాణ జ్ఞాపికను అందజేశారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనక మేడల రాంబాబు, పి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు గొప్ప వరం

### మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకం గొప్ప వరమని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి కొల్తూర్‌లోని 17 వ వార్డులో మున్సిపల్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో ఇచ్చంత్రం యశోద బాల్ నర్సింహులు గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం నిరుపేదలైన ఇళ్లు లేని కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ పథకం బంగారు అవకాశంగా భావించి అర్హులైన ప్రతి ఒక్కరు ఈ పథకం ద్వార ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజి వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు పాపిరెడ్డి, మల్లేష్‌యాదవ్, ఇందిరమ్మ కమిటి సభ్యులు పాండు, శ్రీకాంత్ గౌడ్, సీనియర్ నాయకులు యాదగిరి, అనంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## కార్మికులకు అన్యాయం జరిగితే సహించేదిలేదు

### శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కార్మికులకు అన్యాయం జరిగితే సహించేదిలేదని బిఆర్‌టియు రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గోపన్నపల్లి తండా ఇండస్ట్రీ ఏరియా రెడీమిక్స్ కంపెనీలో అజిత్ కుమార్ సింగ్ సెక్యూరిటీ వర్కర్‌గా గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. యాజమాన్యం కారణం చెప్పకుండా డ్యూటీలో నుండి అజిత్ కుమార్‌ను తొలగించారు. అతనికి సెప్టెంబర్, అక్టోబర్ రెండు నెలల వేతనం మొత్తం రూ.32000 పిఐపిఎల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వాళ్లు ఇవ్వాల్సి ఉండగా ఆ డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. ఈ విషయంపై రవిని కలిసి తనకు న్యాయం చేయాలని అజిత్ కుమార్ కోరారు. వెంటనే స్పందించిన రవి రెడీమిక్స్ కంపెనీ దగ్గరికి వెళ్లి సెక్యూరిటీ వర్కర్‌కు రావలిసిన వేతనం గురించి పలుమార్లు చర్చించి, రెండు నెలల వేతనం బుధవారం ఇప్పించగలిగారు. ఈ సందర్భంగా అజిత్ కుమార్ రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలకు తక్షణ పరిష్కారం

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** ఎల్లమ్మబండ పరిధిలో స్థానిక సమస్యలపై రాజన్న టీమ్ ఫిర్యాదుతో అధికారులు వేగంగా స్పందించి చర్యలు చేపట్టారు. ఆల్విన్‌కాలనీ సర్కిల్ డీసీ చాముండేశ్వరి ఆదేశాల మేరకు సమస్యలను పరిష్కరించారు. భారతి విద్యాలయ స్కూల్ సమీపంలోని కమ్యూనిటీ హాల్‌ను కొంతమంది వ్యక్తులు తమ స్వప్రయోజనాల కోసం వినియోగిస్తూ రాజకీయ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు రాజన్న టీమ్ సభ్యుడు బుల్లెట్ రవి ఫిర్యా దు చేశారు. దీనిపై స్పందించిన డిసి చాముండేశ్వరి అధికారులను ఆదేశం చి అక్కడ ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తియిన అనంతరం అన్ని కాలనీల ప్రజల కు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తామని అధికారులు తెలిపారు. వెంటనే సమస్యలను పరిష్కరించినందుకు రాజన్న టీమ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.




# ముదిరాజ్‌లను బిసి-ఎలోకి మార్చేందుకు
# జిఒ15ను పునరుద్ధరించండి

### మంత్రులను కోరిన కాసాని వీరేశ్



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ముదిరాజ్ కులస్థులను బిసిడి నుండి బిసి ఎలోకి మార్చేందుకు జీవో ఎంఎస్ నంబరు 15\2009ని పునరుద్ధరించాలని జాతీయ ముదిరాజ్ మహా సభ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్ మంత్రులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం రాష్ట్ర పశు సంవర్థక, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లను కలిసిన కాసాని వీరేశ్ ముదిరాజ్, ముత్రాసి, తెనుగు సమాజ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి బిసిడి నుండి బిసిఎలోకి మార్చాలని విన్నవించారు. ఈ సందర్భంగా కాసాని వీరేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్థుల సమస్యలను పరిష్కరించడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం ముదిరాజ్ ఆత్మగౌరవ భవన్ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పలువురు నేతలు పాల్గొన్నారు. కోసం కోకాపేటలో కేటాయించిన స్థలంలో భవన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. భవన నిర్మాణం కోసం ప్రభుత్వం నుండి ఐదు కోట్ల నిధులను మంజూరు చేసి నిర్మాణాన్ని



## తీవ్రమవుతున్న పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి గ్యాస్ కొరత

* నోస్టాక్ బోర్డులతో పంపుల మూసివేత
* రోడ్లపై బారులు తీరుతున్న ఆటోలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావంతో గత రెండు రోజులుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ కోసం వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలస్యం చేస్తే ఇక పెట్రోల్, డీజిల్ ఇక దొరకదన్న పుకార్లు దావానలంలా వ్యాపించటం, దీనికితోడు పలు ప్రాంతాల్లో పెట్రోల్ పంపులు నో స్టాక్ బోర్డులు పెడుతూ తరచు మూసి వేస్తుండటంతో వాహనదారుల్లో భయం నెలకొని ఎలాగైనా తమ వాహనాల్లో ట్యాంకులు ఫుల్ చేసుకోవటం, వీలయితే ఏవైనా డబ్బాల్లో పెట్రోల్ తీసుకొని వెళ్లి స్టాక్ చేసుకోవాలన్న ఆలోచనలతో తెరచి ఉన్న పెట్రోల్ పంపుల వద్ద రెండు రోజుల నుండి బారులు తీరారు. పెట్రోల్ పంపుల వద్ద వాహనదారుల సంఖ్య పెరిగిపోతుండటం, పంపులు దాటి రోడ్లపై సైతం వారి క్యూలైన్లు పాకిపోవటంతో పలు ప్రాంతాల్లో ఆ మార్గంలో ప్రయాణించే వారు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. తార్నాక, మౌలాలి, నాచారం, మల్లాపూర్, రాంపల్లి, కూకట్‌పల్లి, కొంపల్లి ఇలా ఏ ప్రాంతం చూసినా పలు పెట్రోల్ పంపుల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. వాహనదారుల రద్దీని అదుపు చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు సైతం చేరుకోవాల్సి వచ్చింది. పెట్రోల్ పంపు నిర్వాహకులు ఒక్కో బైకుకు రూ.200, కార్ల వంటి వాహనాలకు రూ.1000 వరకు పరిమితి విధిస్తూ సరఫరా చేసా రు.



**సిఎన్‌జి గ్యాస్ ఆటోవాలాల తిప్పలు**

సిఎన్‌జి గ్యాస్‌పై ఆధారపడే ఆటోలు, కార్లకు సైతం పెట్రోల్ పంపుల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. దినసరి ఆదాయంపై ఆధారపడే ఆటో డ్రైవర్లు గ్యాస్ కోసం బంకుల చుట్టూ తిరుగుతూ పూటల కొద్దీ వేచి చూడాల్సి వస్తుండటంతో నానా యాతన పడుతున్నారు. పలు గ్యాస్ స్టేషన్లు, పెట్రోల్ పంపుల వద్ద సిఎన్‌జి గ్యాస్ నింపుకొని వెళ్లాలని వస్తే అప్పటికే అక్కడ వందల సంఖ్యలో పంపు నుండి అర కిలో మీటర్ దూరం మేరకు లైను కట్టి ఉండటం కళ్ల కు నీరు వచ్చేలా ఉందని పలువురు వాపోతున్నారు. అద్దెకు తెచ్చి ఆటోలు నడిపిస్తున్న తాము గ్యాస్ కోసం పూటల కొద్దీ వేచి ఉండటం వల్ల తాము ఏ విధంగా మిగిలిన సమయంలో ఆటో లు నడిపించి వచ్చే ఆదాయంతో కుటుంబాలు ఎలా పోషించుకోవాలి, ఆటో అద్దెను ఏ విధం గా చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంటల కొద్దీ రోడ్డు పక్కన ఎండనక వాననక, తిండీ తిప్పలు లేకుండా వేచి ఉండి తమ వంతు వచ్చే సరికి నోస్టాక్ బోర్డు కనపడుతున్న పరిస్థితులు సైతం పలు సందర్భాల్లో ఎదురవుతున్నాయన్నారు. భారీ క్యూ లైన్లు చూసి మరో పంపు చూద్దామని వెళితే అక్కడ సైతం ఇదే పరిస్థితి నెలకొనటం, ఏక్కడ స్టాక్ ఉందో తెలియక ఇక్కడా అక్కడా తిరుగుతుండటంతో ఉన్న గ్యాస్, పెట్రోల్ సైతం అయిపోతోందని బాధ వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థులను ప్రతి సబ్జెక్టుపై పరిపూర్ణంగా సిద్ధం చేయాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం/నవాబుపేట్:** విద్యార్థులను ప్రతి సబ్జెక్టుపై పరిపూర్ణంగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి బోధనా సిబ్బందికి సూచించారు. బుధవారం నవాబ్ పేట్ మండలంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్ కార్యాలయాల సందర్శనతోపాటు ఉపాధి హామీకింద చేపడుతున్న పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న క్రమంలో ప్రత్యేక తరగతులను నిర్వహించడం జరుగుతుందని ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులందరూ ప్రతి సబ్జెక్టుపై పట్టును సాధించాలని, ఏవైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ముందుగా విద్యార్థుల హాజరు పట్టిక, సైన్స్, ఫిజిక్స్, క్రీడా సామాగ్రి, ఎంబ్రాయిడింగ్, కుట్టు పని నేర్పించే గదులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన క్రమంలో ప్రజలందరికీ పూర్తిస్థాయిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారికి సూచించారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలపైన ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని వైద్య అధికారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం షెడ్ నిర్మాణం చేపట్టాలని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్ కుమార్‌కు కలెక్టర్ సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలు, వైద్య పరీక్షల నమోదు రిజిస్టర్‌లు, ఇన్ పేషెంట్ గదిని కలెక్టర్ పరిశీలించారు. తదనంతరం కేశవ పల్లి గ్రామంలో నిర్మించే సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతతో నిర్మాణ పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ నిర్మాణానికి సంబంధించి అంచనాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. నిర్మాణ దశలో ఉన్న మహిళా సమాఖ్య భవనాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ పర్యటనలో తహసిల్దార్ బుచ్చయ్య, ఎంపిడిఒ అనురాధ, ఎంఇఒ అబ్దుల్ రెహమాన్, ప్రిన్సిపల్ కృష్ణ కుమార్, డాక్టర్ రోహిత్ కుమార్, సర్పంచ్ లు బలవంత రెడ్డి, నరసింహా రెడ్డి, పావని మాణిక్యం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చింతలకుంటను పరిశీలించిన అధికారులు




**ప్రజాపక్షం/దుండిగల్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలోని చింతలకుంట లేక్ ఐడి 2833 కుంట విస్తీరణ15 ఎకరాలుగా ఉండడం ఇదే కుంటలో చెత్త చెదారం వెయ్యడం చుట్టుపక్కల ఎఫ్‌టిఎల్, బఫర్ ప్రాంతాలలో కొందరు నాయకులు కబ్జాలు చేపట్టడంతో కుంట ప్రాంతం కుదించుకు పోయింది. వివరాల్లోకి వెళితే 'ఇది ఎక్కడి ప్రజా పాలన, పడకేసిన పారిశుద్ధ్యం, కంపు కొడుతున్న చింతలకుంట' అంటూ వరుస వార్త కథనాలు వెలువడడంతో బుధవారం ఇరిగేషన్ రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కాంగ్రెస్ నాయకుడు బొంగునూరి కిషోర్ రెడ్డితో కలిసి చింతలకుంట ప్రాంతాన్ని పరిశీలించి తగు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

**చింతలకుంట పై ఇరిగేషన్ డి.ఇ వివరణ**

చింతలకుంటపై ఇరిగేషన్ డి.ఇ ఏ.జైపాల్ కుమార్‌ను వివరణ కోరగా చింతలకుంట ప్రాంతంలోని స్టోరేజ్ వాటర్ అలుగునుండి పోకపోవడం పక్కనే ఉన్న స్మశానవాటిక ప్రహరీ నిర్మించడంతో ఇబ్బందులు తలెత్తాయని ప్రహరీ వద్ద నుండి స్టోరేజ్ వాటర్ బయటికి వెళ్లేలా చేశామని రానున్న రోజుల్లో చెరువు నుండి ఇంకో చెరువుకు వెళ్లేలా నాళాలను ఏర్పాటు చేసి సుందరీకరణ పనులు చేపడుతామని రానున్న వేసవి కాలంలో పనులు మొదలుపెట్టి వర్షాకాలం లోపు పనులు పూర్తి చేస్తామని పై అధికారుల పూర్తిస్థాయిలో సమాచారం అందజేస్తున్నామని రెవెన్యూ ఇరిగేషన్ మున్సిపల్ అధికారులను సమన్వయం చేసుకొని పనులు చేపడతామని అన్నారు. కుంట వద్ద చెత్త చెదారం వెయ్యకుండా కెమెరాల ఏర్పాటుకు హైడ్రా అధికారులకు సమాచారం అందజేశామని త్వరలోనే సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని చింతలకుంట ఎఫ్టిఎల్, బఫర్ ప్రాంతాలలో కబ్జాలకు గురికాకుండా సర్వేయర్ సర్వే చేయించి పూర్తిస్థాయిలో కబ్జాలను తొలగిస్తామని అన్నారు.

## ఇనుమును కరిగించే రియాక్షన్ పేలుడు

**ప్రజాపక్షం/పరిగి:** సుగుణ స్టీల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించి ఒక్కసారిగా స్టీల్ పాంట్లో ఇనుమును కరిగించే రియాక్టర్‌పేలడంతో మంట లు భారీగా ఎగసిపడ్డ ఘటన పరిగి మండల పరిధిలోని లక్ష్మీదేవి పల్లి గ్రామ సమిపంలోని సుగుణ మెటల్స్ లిమిటేడ్ కంపెనీలో జరిగింది. కంపెనీలోదట్టమైన పొగలు రావడంతో, చుట్టుపక్కల ప్రాంతంలో ఉన్న ప్రజలు ఆందోళన చెందినారు. ఈ పేలుగు సమయంలో కంపెనిలో ఉన్న కార్మికులకు గాయలైనట్లుతెలుస్తుంది. ప్రమాదాన్ని కప్పిపుచ్చేందుకు కంపెనీ యాజమన్యం ప్రయత్నిస్తుంది.లారీ టైర్ పేలిందని కంపెనీ యాజమన్యం బొకాయింపు మాటలు చెప్పడంతో స్థానికులు,ఫ్యాక్టరీలోరి వెళ్లేందుకు అనుమతించని కంపెనీ యాజమాన్యం ,గాయపడిన కార్మికులకు రహస్యంగా ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం మొదట్లో ఏం జరిగిందో తెలుసుకోవాడానికి లోపలికి వెళ్లడానికి ప్రయత్రించిన మీడియా ,స్థానికులు అక్కడికి చేరుకొగా సెక్యూటరిటీ సిబ్బంది గేట్లు వేసి లోపలికి ఎవ్వరిని రానివ్వలేదు ,ఘటన గురించి అడగగా అది ప్లాంట్‌లో పేలుడు కాదని వస్తవలను కప్పిపుచ్చే ప్రయత్నం చేయడంపై పలు అనుమానాలకు దారితీస్తుంది. ఈ సంఘటన స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్ వెంకటేశ్వరి ,పోలీసులు జరిగిన సంఘటను తెలియజేయలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సచ్చిదానందస్వామిని కలిసిన ట్రస్టు చైర్మన్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** సనాతన భారతీయ సంప్రదాయ తత్వప్రబోధకులు శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిని శ్రీ రామనూజ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ధనంజయ మర్యాదు పూర్వకంగా కలిశారు. నెహ్రూ నగర్ శ్రీ విరాట్ అభయాంజనేయ స్వామి వారి సన్నిధిలో నిర్వహించే శ్రీ సీతారామ కళ్యాణానికి ఆహ్వానం పలికారు.స్వామివారిని తప్పకుండా దర్శించుకుంటానని ఆయన తెలిపారు.శ్రీ సీతారామ కళ్యాణానికి భక్తులు పాల్గొని తిలకించి అనంతరం నిర్వహించే అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## వాహనదారులకు ఇక్కట్లు

### బహుదూర్ పల్లి హెచ్‌పి పెట్రోల్ పంపు వద్ద క్యూలైన్లో బారులు తీరిన వాహనదారులు

**ప్రజాపక్షం/దుండిగల్:** రాష్ట్రంలో ఒకవైపు డీజిల్, పెట్రోల్ కు ఎటువంటి కొరతలేదని వివిధ మాధ్యమాల ద్వారా ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు, సివిల్ సప్లై శాఖ అధికారులు ప్రకటనలు విడుదల చేస్తున్నా అవి ఎక్కడా ఆచరణలోకి రావడం లేదు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని బహుదూర్‌పల్లిలోని ప్రైమార్క్ ఎదురుగా ఉన్న లక్ష్మీ వినాయక ఫిల్లింగ్ స్టేషన్ హెచ్‌పి పెట్రోల్ పంపులో వినూత్న పరిస్థితి ఎదురయింది. వాహనాలను పెట్రోల్ పంపు నిర్వాహకులు లోపలికి అనుమతించకపోవడంతో వాహనాలను బయటే పార్కు చేసిన వాహనదారులు రేషన్ షాప్ వద్ద క్యూలైన్లో నిల్చున్నట్లు చేతిలో వాటర్ బాటిళ్లు, క్యాన్లు పట్టుకొని మండుటెండలో సైతం క్యూలో నిలబడ్డారు. క్యూలైన్లో నిలుచున్న వారికి మాత్రమే పెట్రోలు అమ్మకాలు చేపడుతున్న పంపు నిర్వాహకులు ఇదేంటని ప్రశ్నిస్తే ప్రజలంతా ఒకేసారి వస్తే మేమేం చేయాలంటూ సమాధానం ఇచ్చారు. కార్లు భారీ వాహనాలకు సప్లై లేకుండా కేవలం పెట్రోల్ మాత్రమే బాటిళ్ళలో సరఫరా చేస్తున్న పరిస్థితి ఇక్కడ నెలకొంది. ఇప్పటివరకు సోషల్ మీడియాలో ప్రకటనలు విడుదల చేసిన ఏ ఒక్క అధికారి కూడా ఇటువైపు కన్నెత్తైనా చూడకపోవడం వారి పనితనానికి అద్దం పడుతుందని ప్రజలు అంటున్నారు.





## ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలి : ఎమ్మెల్యే వివేకానంద

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** జగద్గిరిగుట్టలో బస్ డిపోను ఏర్పాటు చేసి, ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. బుధవారం బడ్జెట్ సమావేశాల్లో భాగంగా హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణా అభివృద్ధిపై నగరానికి చెందిన ఎమ్మెల్యేలతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగద్గిరిగుట్టలో అధునాత బస్ టెర్మినల్ నిర్మించాలన్నారు. జగద్గిరిగుట్ట నుంచి నగరంతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలలోని వివిధ ప్రాంతాలకు నిత్యం వెలాది మంది ప్రయాణం చేస్తూ ఉంటారు. వివిధ జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చే బస్సులు రాత్రి వేళల్లో హాల్ట్ అవడం వల్ల సరైన సుదపాయాలు లేక రోడ్లపైనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. జగద్గిరిగుట్ట పైప్‌లైన్ రోడ్డులోని సర్వే నెంబర్ 223, 224, 237, 238లో గల ప్రభుత్వ భూమి సబ్ డిపోకు అనుగుణంగా ఉండడంవల్ల ఈ ప్రభుత్వ భూమిని డిపోకు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. కుత్బుల్లాపూర్‌లో నూతనంగా ఏర్పాటైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలకు సరైన ప్రజా రవాణా సదుపాయం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల ఉంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. బాచుపల్లి నిజాంపేట్ నుంచి సికింద్రాబాద్ (వయా ప్రగతినగర్, జెఎన్‌టియూ, గండిమైసమ్మ), మెహిదీపట్నం (వయా జెఎన్‌టియు), మియాపూర్ టూ కూకట్‌పల్లి (వయా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, సాయినగర్ బాచుపల్లి), మియాపూర్ సికింద్రాబాద్ (వయా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, సాయినగర్ బాచుపల్లి), మియాపూర్ టు గండిమైసమ్మ (వయా పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, సాయినగర్ బాచుపల్లి) బాలాయ్యనగర్ నుంచి బాలానగర్, కెపిహెచ్‌బి నుంచి బాలయ్య నగర్‌కు, లాల్‌సాహెబ్‌గూడ నుంచి సికింద్రాబాద్‌కు , నూతన బస్సు సర్వీసు 224/జి, మియాపూర్ నుంచి మేడ్చల్ (వయా ప్రణీత్ ప్రణవ్ ఫ్లోరా అపార్ట్‌మెంట్స్, బహదూర్‌పల్లి, పున:ప్రారంభం 229ఎల్ నాగులూరు నుంచి మేడ్చల్ , బస్సురూట్ పరిధి పెంపులో భాగంగా బస్ నెంబర్ 195, 195పి, 195ఎం అండ్ జి (ప్రగతినగర్ కమాన్ నుంచి మల్లంపేట్ వయా బొద్దురాయి, శంభీపూర్, బస్ నెంబర్ 229సికింద్రాబాద్ బహదూర్‌పల్లి బస్సును బౌరంపేట్ క్రాస్ రోడ్ వరకు పొడిగించాలని కోరారు. ఎమ్మెల్యే వినతిపై మంత్రి ప్రభాకర్ స్పందించి అధునాత బస్ టర్మినల్‌తో పాటు బస్ డిపోను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించి బస్ డిపోను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థినులకు పౌష్టికాహారాన్ని అందించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రభుత్వ మైనారిటి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ మనుచౌదరి వారితో కల్సి తిని చూసారు. కీసర మండలం నాగారంలో నిర్వహిస్తున్న తెలంగాణా మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన విద్యార్థినులకు నిర్దిష్ట మెనూ ప్రకారం ఆహార పదార్థాలను రుచికరంగా శుభ్రంగా అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకోవటంతో పాటు వారితో కల్సి స్వయంగా భోజనాన్ని ఆరగించి వంట పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఆయన పాఠశాల ప్రిన్సిపాల్ , సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థినులకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పూర్తి స్థాయిలో పౌష్టికాహారాన్ని అందించాలని, సిబ్బంది సైతం వారిలో ఒకరిగా కలిసి వండిన పదార్థాలను తిని చూడాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సంగీతం లాంటి తమకు ఆసక్తి ఉన్న అంశాలను ఎంచుకొని, వాటిని తమ అధ్యాపకులు, తల్లిదండ్రులకు తెలియచేసి తగిన శిక్షణ పొందటం ద్వారా ఆయా రంగాల్లో రాణించాలని కలెక్టర్ సూచించారు. దీనివల్ల వారిలో దాగి ఉన్న ప్రతిభ బయట పడుతుందన్నారు. బిడియాన్ని వదిలి ఆత్మవిశ్వాసంతో తమకు ఉన్న నైపుణ్యంతో ప్రతి విషయాన్ని పది మందిలో ధైర్యంగా చెప్పగలిగిన నాడే అనుకొన్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతారన్నారు. విద్యతో పాటు కాలానుగుణంగా వస్తున్న సాంకేతికను వినియోగించుకొనేందుకు అందుబాటులోకి వచ్చిన జెమిని, చాట్ జిపిటి వంటి ఏఐ టూల్స్ వాడుతూ సమయాభావాన్ని తగ్గించుకొని ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. ఏఐ టూల్స్ ద్వారా పెయింటింగ్, వెబ్ డిజైనింగ్, ప్రోగ్రామింగ్, ఫ్యాషన్ టెక్నాలజీలాంటి పలు రంగాలు అభివృద్ధి చెందుతున్నాయన్న విషయాన్ని కలెక్టర్ తెలిపారు. విద్యార్జనతో పాటు సమాజంలో, ప్రపంచంలో ఏం జరుగుతుందన్న విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొంటూ అవగాహన పెంచుకోవటంతో పాటు తమకు అవసరమైన వాటిని వినియోగించుకోవటానికి కృషి చేయాలన్నారు. జిల్లా మైనారిటీ అధికారి కాంతమ్మ, కీసర ఎంఆర్ఓ యాదగిరిరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**జిల్లా కోర్టులో ప్రభుత్వ ప్లీడర్ ఛాంబర్ ప్రారంభం:** కుషాయిగూడలోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టులో ప్రభుత్వ ప్లీడర్ ఛాంబర్‌ను ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వి. బాలభాస్కరవారుతో కల్సి జిల్లా కలెక్టర్ మనుచౌదరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్లీడర్ కె. రాంచందర్‌రెడ్డిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ జిల్లా జడ్జి అమరావతి, నాలుగవ ఎడిజె డి.కిరణ్‌కుమార్, జిల్లా లీగల్ సెల్ సర్వీస్ అథారిటి సెక్రటరి రవీందర్, ఫస్ట్ జూనియర్ సివిల్ జడ్జి రాజు, సెకండ్ జెసిజె ప్రశాంతి, మూడవ జెసిజె సరళరేఖ, సీనియర్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బాపిరెడ్డి, జూనియర్ ఎజిపి సునితారాజ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, యాక్టింగ్ ప్రెసిడెంట్ సంజయ్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



## వ్యాధుల పట్ల అప్రమత్తత

డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మీ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల అనేక రకాల కొత్త వ్యాధులు వస్తున్నాయని, వాటిని నియంత్రించేందుకు ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటితోపాటు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా పెట్టుకోవాలన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులను అంధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రఘురాం, శ్రీనివాస్‌రెడ్డి, జయేందర్, వెంకటముని, ల్యాబ్ టెక్నిషియన్ సలాం కహన్, హెల్త్ అసిస్టెంట్ రెడ్డి నాయక్, గ్రామ సర్పంచ్ రవికుమార్‌తోపాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణ అపాలి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వం బలవంతపు భూసేకరణ తక్షణమే అపాలని కోర్టు అదేశాలను పాటించాలని మర్లకుంట తండా గిరిజనులు అగ్రహం వ్యక్తం చేశారు.బుధవారం గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ బాధితుల రిలే రిహర దీక్షలు 9వ రోజుకు చేరాయి. ఈ సంధర్బంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం పట్టా భూములు ఇవ్వని భూములపై ఉన్న టిజిఐఐసి తీసేసి అన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేయాలన్నారు. రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు ఫార్మాసిటీ గ్రామాలైన మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు మద్దతు తెలిపారు.

## పెట్రోల్ బంక్ వద్ద జన సందోహం



**ప్రజాపక్షం/కేశంపేట:** పెట్రోల్ కోసం బంక్ వద్దకు వాహనదారులు ఒక్కసారిగా రావడంతో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం కేశంపేట మండల కేంద్రంలో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్ కోసం ప్రజలు భారీగా బారులు తీరారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కేశంపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి పెట్రోల్ బంక్ వద్దకు చేరుకొని వరుస క్రమంలో వాహనాలను రప్పించి పెట్రోల్ పోయించి పంపించారు.

## యువత స్వయం ఉపాధి రంగాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** యువత స్వయం ఉపాధి రంగాలతో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పరిగి రోడ్డులో ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామానికి చెందిన రాజేందర్, రవీందర్‌లు ఏర్పాటు చేసిన అర్వ డ్రింకింగ్ వాటర్ బాటిల్ షాప్‌ను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువత సన్మార్గంలో ప్రయాణిస్తూ ఆర్థిక, వ్యాపార రంగాల్లో రాణించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అనిత రఘునాథ్ యాదవ్, బిఎస్ సుధీర్, మాజీ కౌన్సిలర్లు కానుగు అనంతయ్య, రేటికల్ నందీశ్వర్, నందకిశోర్, జూపల్లి శంకర్, చెట్ల నర్సింహులు, బిఆర్ఎస్ నాయకుడు నక్కల వెంకటేష్, మహదేవ్‌పూర్ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, కమ్మదనం సర్పంచ్ కిరణ్‌కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింలు, ఉప సర్పంచ్ జగనాథ్, వార్డు సభ్యులు నారాయణరెడ్డి, మహేష్, వెంకటేష్, శ్రీను, నాయకులు యాదయ్య, నర్సింహులు, సంతోష్ యాదవ్‌లు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతోనే మనస్సుకు ప్రశాంతత



**ప్రజాపక్షం/కేశంపేట:** ఆధ్యాత్మికతతోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కేశంపేట మండలం దేవునిగుడి తండాలో శ్రీ లక్ష్మి అలివేలుమంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ సింహద్వారాన్ని ప్రారంభించారు. శ్రీవారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో దేవునిగుడి తండా సర్పంచ్ సుజాత హన్మంత్‌నాయక్, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, ఇప్పలపల్లి సర్పంచ్ జంగయ్య, మాజీ సర్పంచులు తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, శేఖర్ పంతులు, ఆంజనేయులు, మాజీ ఎంపిటిసి రాంచందర్, ఉప సర్పంచులు రవినాయక్, జ్యోతి నరేందర్‌రెడ్డి, నాయకులు బద్రునాయక్, నరేందర్, రామకృష్ణ, హన్మంత్, శ్రీను, రతన్‌లు పాల్గొన్నారు. కేశంపేట మండల పరిధిలోని దేవునిగుడి తండాలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం, ముఖద్వార ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, లక్ష్మి నారాయణ గౌడ్, జగదీశ్వర్ గౌడ్, సర్పంచ్ సుజాత హన్మంత్‌నాయక్‌తోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పుకార్లు నమ్మొద్దు... నగరంలో ఇంధన కొరత లేదు

60 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు...
సిపి.సజ్జనార్, కలెక్టర్ హరిచందన



**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** హైదరాబాద్ నగరంలో ఇంధన కొరత లేదని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తెలిపారు. ఇంధన సరఫరాపై తలెత్తిన అపోహల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరితో కలిసి బుధవారం ఆయన ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో 60రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయన్నారు. ఆయిల్ కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. నగర వ్యాప్తంగా నిరాటంకంగా సరఫరా కొనసాగుతోందన్నారు. ప్రజలు ఒక్కసారిగా ఫుల్ ట్యాంకులు చేయించుకోవడం వల్ల డిమాండ్ పెరిగి కొన్ని చోట్ల నోస్టాక్ బోర్డులు తాత్కాలికంగా కనిపిస్తున్నాయన్నారు. దీనిని కొరతగా భావించవద్దని చెప్పారు. తప్పుడు ప్రచారాల వల్ల ఈ నెల 23న 3,024 లీటర్ల ఇంధనం అమ్ముడుపోగా ఈ నెల 24న ఇది రెట్టింపై ఆరు వేల లీటర్లకు చేరుకుందన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా బాటిళ్లు, డబ్బాలు, లూజ్ లో పెట్రోల్ విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేసే వారిపై నిఘా ఉంచామని ఆయన చెప్పారు. అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని సిపి సజ్జనార్ హెచ్చరించారు.

### కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
కలెక్టర్ హరిచందన

ఆయిల్, సివిల్ సప్లై అధికారులతో కలిసి ఇంధన సరఫరాపై నిరంతర సమీక్షిస్తున్నామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. ఈ సమీక్షలో ఆమె మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని చెప్పారు. పెట్రోలియం ఉత్పత్తుల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వియోగదారులు 04023202113 నెంబర్‌కు కాల్ చేసి సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు నిల్వలను పరిశీలిస్తున్నామన్నారు. రెవెన్యూ, పోలీస్, సివిల్ సప్లై సిబ్బందిని పెట్రోల్ బంకుల వద్ద పర్యవేక్షనకు నియమించామన్నారు. క్షేత్ర స్థాయిలో యంత్రాంగం అప్రమత్తంగా ఉందని చెప్పారు. సరఫరా వ్యవస్థ పూర్తిగా సజావుగు జరుగుతుందని, ప్రజలు వాస్తవాలను గమనించి సహకరించాలని ఆమె కోరారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు సిపి తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి శ్వేత, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

## స్వీట్ల దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి పరిధిలోని ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు నగరంలో స్వీట్ల దుకాణాలపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్వైలెన్స్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 18 సంస్థలను పరిశీలించి, 38 కాన్ఫెక్షనరీ నమూనాలను సేకరించారు. సేకరించిన నమూనాలను హైదరాబాద్‌లోని నాచారం స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి విశ్లేషణ కోసం పంపినట్లు అధికారులు తెలిపారు. ఆహార పదార్థాలలో కల్తీ ఉన్నట్లు తేలితే, నిబంధనల ప్రకారం సంబంధిత సంస్థలు, తయారీదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అదే సమయంలో, ప్రాథమిక హైజీన్, శానిటరీ నిబంధనలు పాటించని సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. కటేదాన్‌లో ఉన్న రోలెక్స్ కాన్ఫెక్షనరీ అనే సంస్థకు షోకాజ్ నోటీస్ జారీ చేయనున్నారు. అక్కడ 25 కిలోల కాన్ఫెక్షనరీ నిల్వలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (లేబెలింగ్ అండ్ డిస్‌ప్లే) రెగ్యులేషన్స్, 2020ను ఉల్లంఘించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

## ఖాళీ స్థలాల్లో నిర్మాణ వ్యర్థాలు వేస్తే భారీ మొత్తంలో జరిమానాలు

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోడ్డుపక్కన, ఖాళీ స్థలాల్లో నిర్మాణ వ్యర్థాలను వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలో 99 రోజుల కార్యాచరణ 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం హయత్ నగర్ సర్కిల్‌లోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులు, చెరువుల పునరుద్ధరణ, మౌలిక సదుపాయాలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. పద్మావతి కాలనీ మెయిన్ రోడ్డులోని దుకాణదారులతో కమిషనర్ మాట్లాడారు. చెత్తను ఎక్కడ వేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ చెత్తను స్వచ్ఛ ఆటోలకే అందిస్తున్నామని వ్యాపారులు తెలపగా, పొరపాటున కూడా రహదారులపై చెత్త వేయకూడదని ఆయన హెచ్చరించారు. కుమ్మరి కుంట లేక్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించే పనులను కమిషనర్ పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులే కాకుండా కాలనీల్లోని అంతర్గత రోడ్లు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని, ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. నగర పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. పాత సామాన్లు, ఇంట్లోని వ్యర్థాలను రోడ్లపై వేయకుండా స్వచ్ఛ ఆటోలకే అందించేలా నివాసితులకు అవగాహన కల్పించాలన్నారు.

## నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ పట్టివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలోకి ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తరలింపులపై ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. బుధవారం తెల్లవారుజామున రంగారెడ్డి జిల్లా పహాడీషరీఫ్ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో రూ. 5.80 లక్షల విలువైన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డిపిఎల్) స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదేశాల మేరకు ఎస్‌టిఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టిడిఎఫ్ బృందాలు సంయుక్తంగా ఈదాడులు నిర్వహించాయి. సరూర్‌నగర్, మహేశ్వరం ఎక్సైజ్ స్టేషన్ల సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. ఎయిర్‌పోర్ట్ సమీపంలోని పహాడ షరీఫ్ వద్ద వాహనాల తనిఖీల సమయంలో 232మద్యం బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ, గోవా ప్రాంతాల నుంచి విమానాలు, రైళ్లు, బస్సుల ద్వారా పెద్ద మొత్తంలో మద్యం తరలిస్తున్నారనే సమాచారంతో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అక్రమ రవాణాలో పాల్గొన్న 25 మందికి బిఎన్ఎస్ 35(బి) చట్టం ప్రకారం నోటీసులు జారీ చేశారు. స్వాధీనం చేసిన మద్యం సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణలో బ్రీజర్ నిల్వలు తక్కువగా ఉన్నాయనే ప్రచారాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బ్రీజర్ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ అధికారులు కూకట్‌పల్లి ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఎస్‌టిఎఫ్ ఎ టీమ్ లీడర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో 034 నంబర్ మద్యం దుకాణంలో 15 ఏపీ బ్రీజర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దుకాణంలో పని చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, స్వాధీనం చేసిన బాటిళ్లను కూకట్‌పల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఇతర రాష్ట్రాల మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

## పోలీసు అకాడమీకి 63 పతకాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విజేతలకు పోలీస్ అకాడమీలో అభినందన సభను నిర్వహించారు. ఇటీవల సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో జరిగిన ఈ క్రీడా పోటీల్లో అకాడమీ క్రీడాకారులు రాణించారు. కార్యక్రమానికి అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్తా ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ అకాడమీకి చెందిన మొత్తం 88 మంది క్రీడాకారులు పాల్గొని 63 పతకాలు సాధించడం గొప్ప విజయమని కొనియాడారు. స్పోర్ట్స్ మీట్‌కు లైజన్ అధికారులుగా పనిచేసిన అసిస్టెంట్ డైరెక్టర్ పి.ఎస్.వి. రత్నం, డిఎస్‌పి ఎ. తిరుపతిని ప్రశంసించారు. అసిస్టెంట్ డైరెక్టర్ జి.వెంకటరావు పోటీల వివరా లు, క్రీడాకారులు సాధించిన పతకాల గురించి వివరించారు. లైజన్ అధికారి డీఎస్పీ ఏ. తిరుపతి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ సి.మురళీధర్, జి.కవిత, ఎన్.వెంకటేశ్వర్లు, శ్రీరామ్మూర్తి, టేకర్ కె.ప్రసాద్, మధుకర్ స్వామి పాల్గొన్నారు.

## మాల్ పశువుల సంత వేలం

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని మాల్ వ్యాపార కేంద్రంలో ఉన్న పశువుల సంతకు వేలం నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ బెల్లి అశోక్ యాదవ్ తెలిపారు. బుధవారం గ్రామ ప్రజల సమక్షంలో ఒపెన్ వేలం నిర్వహించామన్నారు. ముందు రోజు గ్రామాలో వేలం నిర్వహిస్తున్నామని గ్రామంలో చాటింపు వేయించామన్నారు. వేలం కు చెందిన కర పత్రాలను నోటిస్ బోర్డులో అంటిచి నట్లు తెలిపారు.గ్రామ పంచాయతీ పాలక వర్గం సమక్షంలో వేలం పాట నిర్వహించినట్లు తెలిపారు. వేలంలో 1కోటి ఐదు లక్షల అరవై రెండు వేల రూపాయలకు మాల్ గ్రామానికి చెందిన నిమ్మరాజు జంగయ్య దక్కించుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వై వి రాజు , వివిధ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణాలకు గడువు పొడిగింపు

రంగారెడ్డి జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ కార్యనిర్వాహణ సంచాలకులు జొన్నలగడ్డ పద్మావతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధికల్పన కోసం రాయితీపై ఇచ్చే రుణాలకు ఏప్రిల్ రెండవ తేదీ వరకు గడువు పొడిగించిందని రంగారెడ్డి జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ కార్యనిర్వాహణ సంచాలకులు జొన్నలగడ్డ పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని ఎస్‌సి నిరుద్యోగులకు, కార్పొరేషన్ నుండి ఎస్‌సి కార్యాచరణ ప్రణాళికలో వివిధ పథకాలకు దరఖాస్తులు ఒబిఎంఎంఎస్ పోర్టల్లో నమో దు చేసుకొనుటకు ఏప్రిల్ 2వ తేదీ వరకు పొడిగించ జరిగిందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ttps://tgobmms.cgg.gog.inOBMMS పోర్టల్ లో నమోదు చేసుకోవాలని పద్మావతి తెలిపారు. దరఖాస్తుదారులు దరఖాస్తు పోర్టల్ దరఖాస్తు చేసుకున్న ఫారంతో పాటు సర్టిఫికెట్ జిరాక్స్ ప్రతులను జత చేసి తమ పరిధిలోని ఎంపిడిఒ లేదా మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో సమర్పించవలసిందిగా పేర్కొన్నారు.

# దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర 'సురవరం'

సిపిఐ నేతలు ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శితోపాటు ఎంపిగా దేశ రాజకీయాల్లో సురవరం సుధాకర్‌రెడ్డి చెరగని ముద్ర వేశారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. బుధవారం సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి 84వ జయంతిని పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల సమితి ఆధ్వర్యంలో మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్3 భూపోరాట కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సురవరం చిత్రపటానికి పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఆందోజు రవీంద్రచారీ మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికి కూడా భూస్వామ్య ఆధిపత్యానికి, భావజాలనికి వ్యతిరేకంగా సురవరం పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో రావి నారాయణరెడ్డి పేరు మీద రెండు కాలనీలు ఏర్పడటంలో సురవరం సుధాకర్ రెడ్డి కృషి మరువలేనిదన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో ఇల్లు లేని నిరుపేదలకు, భూధాన భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి ప్రభుత్వం సొంత ఇల్లు నిర్మించి పట్టాలిచ్చేంత వరకు పోరాటం చేయాలని రవీంద్ర చారి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్, అబ్దుల్లాపూర్ మెట్ మండల సహాయ కార్యదర్శి కేతా రాజు నర్సింహా, బిఒసి జిల్లా కార్యదర్శి ప్రసాద్, సైదులు ముదిరాజ్, మెట్టు మండల కార్యవర్గ సభ్యులు యేశాలి నర్సింహా, నవనీత, సిపిఐ నాయకులు గణేష్, దేవమ్మ, గోపి, వీరేష్, క్రాంతి, బిచ్చు నాయక్, ఈశ్వరయ్య, మధు, శ్రీధర్‌రెడ్డి, కావేరి, రాణి, నీలా, శ్రీను, లక్కీ, వీణ, రమేష్, పాండు పాల్గొన్నారు.

**హయత్ నగర్ :** సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి జయంతిని సిపిఐ హయత్‌నగర్ మండల పార్టీ కార్యాలయంలో మండల సహాయ కార్యదర్శి మర్రి శోభన్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సురవరం చిత్రపటానికి సిపిఐ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ హయత్ నగర్ మండలం కార్యదర్శి సరిత, రజిత, సౌజన్య, సుజాత, చంటి తదితరులు పాల్గొన్నారు.



# నల్లగా ఉన్నందుకు నన్ను కాలియా అన్నారు

## మాజీ క్రికెటర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్



భారత క్రికెట్‌లో ఒకప్పుడు అత్యంత ప్రతిభావంతులైన ఆటగాళ్లలో ఒకరిగా పేరుగాంచిన లెగ్ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్.. తన కెరీర్‌ను ప్రభావితం చేసిన కొన్ని చేదు అనుభవాలను పంచుకున్నారు. తనపై జరిగిన వర్ణ వివక్ష, జాత్యహంకార వ్యాఖ్యలు తనను మానసికంగా ఎంతగా కుంగదీశాయో తాజాగా తెలియజేశారు. ఓ జాతీయ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ సంచలన విషయాలను వెల్లడించారు. తనకు పద్నాలుగేళ్ల వయసులో ఎదురైన ఓ సంఘటనను శివరామకృష్ణన్ గుర్తుచేసుకున్నాడు. చెపాక్ స్టేడియంలో టీమిండియాకు నెట్ బౌలర్‌గా వెళ్లినప్పుడు.. స్కూల్ యూనిఫాంలో ఉన్న తనను ఓ సీనియర్ భారత బ్యాటర్ గదిలోకి పిలిచారని శివరామకృష్ణన్ తెలిపారు. గ్రౌండ్ సిబ్బందిలో ఒకడిగా భావించి, తన బూట్లు శుభ్రం చేయమని ఆ ఆటగాడు ఆదేశించాడని చెప్పారు. ఆ మాటకు నిశ్చేష్టుడైన తాను.. 'అది నా పని కాదు, మీ పని మీరు చూసుకోండి' అని బదులిచ్చినట్లు తెలిపాడు. ఒఅప్పుడు జాతి వివక్ష అంటే ఏమిటో తెలియకపోయినా ఆ ఆటగాడి ప్రవర్తన తనను తీవ్రంగా బాధించిందని శివరామకృష్ణన్ అన్నారు. ఇలాంటి అవమానాలు తన కెరీర్‌లో చాలాసార్లు ఎదురయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తమిళనాడు జట్టులో ఆడుతున్నప్పుడు కొందరు ప్రముఖ ఆటగాళ్లు తనను 'కరుపా (నల్లటి వాడు)' అని పిలిచేవారని చెప్పాడు. ముంబై, చండీగఢ్, జలంధర్ వంటి నగరాల్లో బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు, ప్రేక్షకులు 'కాలియా, తేరా క్యా హోగా (నల్లోడా, నీ గతేంటి)' అంటూ ఎగతాళి చేసేవారని గుర్తుచేసుకున్నాడు. తన 17వ పుట్టినరోజున జరిగిన మరో ఘటన తనకు కన్నీళ్లు తెప్పించిందని శివరామకృష్ణన్ తెలిపారు. ఆ రోజు తన కోసం తెచ్చిన చాక్లెట్ కేక్‌ను చూపిస్తూ ఓ సీనియర్ ఆటగాడు.. 'హే సన్నీ.. నువ్వు సరైన రంగు కేక్ ఆర్డర్ చేశావ్. ఇంత నల్లటి అబ్బాయికి ఇలాంటి డార్క్ చాక్లెట్ కేక్ కరెక్ట్' అని ఎగతాళిగా అన్నాడని గుర్తుచేశారు. ఆ మాటలతో తాను ఏడుస్తూ కేక్ కట్ చేయడానికి నిరాకరించానని, అప్పుడు దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ తనను ఓదార్చడంతో కన్నీళ్లతోనే కేక్ కట్ చేశానని ఆనాటి బాధను పంచుకున్నాడు. ఈ ఘటనలన్నీ తన మనసుపై చెరగని ముద్ర వేశాయని శివరామకృష్ణన్ అన్నారు. తన కెరీర్ ఆశించిన స్థాయిలో సాగకపోవడానికి ఇవి కూడా కారణమయ్యాయని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## 43 జట్లతో ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ టోర్నీ




**హైదరాబాద్ :** రాష్ట్ర పోలీస్ విభాగం ఆతిథ్యమిస్తున్న ప్రతిష్ఠాత్మక 74వ బిఎన్ మల్లిక్ ఆలిండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం కానున్నాయి. గచ్చిబౌలి స్టేడియంలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై టోర్నీని ప్రారంభిస్తారని డిజిపి శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. 12 రోజుల పాటు సాగే టోర్నీలో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 43 జట్లు పోటీలో ఉంటాయి.. ఇందులో 851 మంది పురుషులు, 187 మంది మహిళా ప్లేయర్లు బరిలో ఉంటారని తెలిపారు. నగరంలోని ఐదు ప్రధాన వేదికలు గచ్చిబౌలి స్టేడియం, గోల్కొండలోని హెచ్ఎఫ్సీ స్టేడియం, సర్దార్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ గ్రౌండ్, శ్రీనిధి ఫుట్బాల్ స్టేడియం, గోల్కొండలోని ఆర్టిలరీ గ్రౌండ్స్లో మ్యాచ్లు జరుగనున్నాయి. టోర్నీ కోసం భారత మాజీ ఫుట్‌బాల్ కెప్టెన్ విక్టర్ అమల్రాజ్, స్టార్ ప్లేయర్ గుగులోతు సౌమ్య, మాజీ భారత కోచ్ నయీముద్దీన్ పాల్గొంటారని డిజిపి శివధర్‌రెడ్డి తెలిపారు.

## షేన్‌వార్న్ ముందుచూపుతో ఆయన కుటుంబానికి జాక్‌పాట్




**ముంబై :** ఐపిఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ జట్టును .. అమెరికాకు చెందిన కల్ సోమానీ సుమారు రూ.15,290 కోట్లకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఫ్రాంచైజీలోని వంద శాతం వాటాను సోమానీ సొంతం చేసుకున్నారు. అయితే రాజస్థాన్ రాయల్స్‌కు తొలి సీజన్‌లో ఆస్ట్రేలియా స్పిన్ లెజెండ్ షేన్ వార్న్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. ఆర్‌ఆర్‌తో డీల్ కుదుర్చుకున్న సమయంలో ఆ ఫ్రాంచైజీలో కొంత వాటా కూడా తీసుకున్నారు. 2008 సీజన్‌లో షేన్ వార్న్ ప్రదర్శించిన ముందుచూపు.. ఇప్పుడు ఆయన కుటుంబసభ్యులకు వరాల జల్లు కురిపించనున్నది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వార్న్ ఫ్యామిలీకి బంపర్ రివార్డు అందనున్నది. రాజస్థాన్ జట్టుతో షేన్ వార్న్ డీల్ చేసుకున్న సమయంలో.. ఆ ఫ్రాంచైజీలో ప్రతి ఏడాది 0.75 శాతం వాటా ఓనర్షిప్ కూడా కుదుర్చుకున్నాడు. ఆడిన ప్రతి సంవత్సరం ఆ వాటా రావాలన్నారు. నాలుగేళ్ల పాటు వార్న్ ఆ జట్టు తరపున ఆడాడు. ఈ లోగా ఆ వాటా 3 శాతానికి పెరిగింది. అయితే ప్రస్తుతం ఆ ఫ్రాంచైజీని సోమానీ సుమారు 1.63 బిలియన్ల డాలర్లకు సొంతం చేసుకోవడం వల్ల అతని వాటా కింద సుమారు 460 కోట్లు దక్కే అవకాశాలు ఉన్నాయి. ఐపిఎల్ 2026 ఎడిషన్ ముగిసిన తర్వాత షేన్ వార్న్ ఫ్యామిలీ ఆ వాటాను అమ్ముకునేందుకు అర్హత ఉంటుంది. ఆ సేల్ ద్వారా వచ్చే డబ్బు వార్న్ ఫ్యామిలీకి దక్కుతుంది. అయితే ఈ డీల్కు బీసీసీఐ అనుమతి తప్పనిసరి అని తెలుస్తోంది. ఎమర్జింగ్ మీడియాకు చెందిన మనోజ్ బద్లే సుమారు 67 మిలియన్ల డాలర్లకు 2008లో ఫ్రాంచైజీని కొనుగోలు చేశారు. స్పిన్ లెజెండ్ షేన్ వార్న్ 2022లో అకస్మాత్తుగా మృతిచెందిన విషయం తెలిసిందే.

# విప్లవమే చరిత్ర..చరిత్రే సాహిత్యం

'రణరంగం కానిచోటు
భూస్థలమంతా వెదికినా దొరకదు
గతమంతా తడిసె రక్తమున,
కాకుంటే కన్నీళ్ళతో' అంటాడు 'దేశ చరిత్రలు' కవితలో మహాకవి శ్రీశ్రీ.




ఇది ముమ్మాటికీ నిజమని ప్రపంచంలోని చాలా దేశాల ఆధునిక చరిత్రను పరిశీలిస్తే స్పష్టమవుతుంది. దేశాలు, ప్రాంతాలతో సంబంధం లేకుండా, విప్లవం ఒక కేంద్ర బిందువుగా దర్శనమిస్తుంది. కాంబోడియా, చైనా, ఫ్రాన్స్, గ్రీస్, హైటి, ఇరాన్, ఐర్లాండ మెక్సికో, నికరాగువా, అమెరికా వంటి దేశాలే కాదు... గ్లోరియస్ రివల్యూషన్‌కు వారసుడైన యునైటెడ్ కింగ్‌డమ్ కూడా ఒక విధంగా విప్లవ నేపథ్యంతోనే ఆధునిక దశలోకి ప్రవేశించింది. ఆసియా, ఆఫ్రికా, కరిబియన్ ప్రాంతాల్లో జరిగిన వలస పాలన ముగింపు, 1991తర్వాత సోవియట్ యూనియన్ పతనం, 2011లో 'అరబ్ స్ప్రింగ్' వంటి పరిణామాలను విప్లవ ప్రభావాల విస్తరణగానే పేర్కోవాలి. ఈకారణంగా ఆధునికత అంటేనే విప్లవ అనుభవం అన్న భావన బలపడింది. 20వ శతాబ్దం మొత్తం విప్లవాలు చరిత్రకారులు, సమాజ శాస్త్రవేత్తలు, రాజకీయ ఆలోచకులకు అత్యంత ఆకర్షణీయ అంశంగా నిలిచాయి. క్రేన్ బ్రింటన్, హానా అరెండ్ థీడా స్కోచ్‌పోల్ వంటి పండితులు విప్లవాలను తులనాత్మకంగా అధ్యయనం చేశారు. కానీ తరువాత కాలంలో ఈ అధ్యయనం కొంతనిశ్శబ్దానికి లోనైంది. 'రివిజనిస్టులు' అని పిలిచే పలాయనవాద మేధావులు విప్లవాలను మహా చారిత్రక ప్రక్రియలుగా కాకుండా, స్థానిక లేదా జాతీయసంఘటనలుగా మాత్రమే చూశారు. అంతేకాదు, విప్లవాల వల్ల జరిగిన హింస, ఆకలి, శిబిరాలు, మారణహోమాలు వంటి మానవ నష్టాలపై అవగాహన పెరగడంతో, విప్లవ వాగ్దానాలపై అనుమానం మొదలైంది. ఫలితంగా విప్లవం ఒక భవిష్యత్ మార్గదర్శిగా కాకుండా, గతంలో మిగిలిపోయిన అంశంగా కనిపించ సాగింది. అయితే ఇటీవలి కాలంలో డాన్ ఎడెల్‌స్టీన్ రచించిన 'ది రివల్యూషన్ టు కమ్', డొనాల్డ్ సాసూన్ రాసిన 'రివల్యూషన్స్: ఎ న్యూ హిస్టరీ' వంటి పుస్తకాలు విప్లవ అధ్యయనాన్ని మళ్లీ కేంద్రంలోకి తీసుకొచ్చాయి. సాసూన్ సంప్రదాయ శైలిలో ఇంగ్లాండ్, ఫ్రాన్స్, రష్యా, చైనా వంటి విప్లవాలను పోల్చిచూస్తే, ఎడెల్‌స్టీన్ మాత్రం విప్లవ భావన ఎలా రూపాంతరం చెందిందో ఆలోచనా చరిత్రతో కలిపి విశ్లేషిస్తాడు. ఈ రెండు పుస్తకాలలో ఎడెల్‌స్టీన్ రచన ప్రత్యేకంగా నిలుస్తుంది, ఎందుకంటే అతను విప్లవాన్ని కేవలం సంఘటనగా కాకుండా, ఒక ఆలోచనగా పరిశీలిస్తాడు. ఎడెల్‌స్టీన్ ముఖ్యంగా, 18వ శతాబ్దం వరకు విప్లవం అంటే భయంకరమైన, అశుభకరమైన పరిణామంగా భావించే ఆలోచనా ధోరణులను ప్రస్తావిస్తాడు. గ్రీకులకు అదిస్టాసిస్ (అస్తవ్యస్తత), రోమన్లకు నోవే రెస్ (అపాయకరమైన మార్పు). సమాజ క్రమాన్ని ధ్వంసం చేసే విపత్తుగా విప్లవాన్ని చూశారు. కానీ 18వశతాబ్దం మధ్యలో, భవిష్యత్తు మెరుగైనదై ఉండవచ్చన్న ప్రగతిశీల భావనతో కలిసినప్పుడు మాత్రమే, విప్లవం విముక్తి సాధనంగా మారింది. కార్ల్ మార్క్స్ చెప్పినట్లుగా, 19వ శతాబ్దపు సామాజిక విప్లవం తన కవిత్వాన్ని గతం నుంచి కాదు, భవిష్యత్తు నుంచే తీసుకుంటుంది. ప్రాచీన చరిత్రకారుడు పాలిబియస్ ప్రతిపాదించిన అధికార సమతుల్యత సిద్ధాంతం 'చెక్స్ అండ్ బ్యాలెన్సెస్' అమెరికన్ విప్లవంలో పరాకాష్టకు చేరిందని ఎడెల్‌స్టీన్ అంటాడు. ఈఅర్థంలో అమెరికన్ విప్లవం చివరి పాలిబియన్ విప్లవం. కానీ, ఫ్రెంచ్ విప్లవంతో విప్లవ భావన పూర్తిగా మారిపోయింది. భవిష్యత్తును మానవుడు తానే నిర్మించగలడన్న నమ్మకం బలపడింది. అదే సమయంలో, ఆ భవిష్యత్తు ఒక్క దారిలోనే ఉండాలన్న భావన హింసకు దారితీసింది. ఫ్రెంచ్‌విప్లవం చివరికి టెరర్, నియంతృత్వానికి దారి తీసిన విధానాన్ని ఎడెల్‌స్టీన్ రెడ్ లెవెథన్‌గా అభివర్ణిస్తాడు. కాగా, ఈ రెండు పుస్తకాలు ఒక కీలక ప్రశ్నను ముందుంచుతాయి... భవిష్యత్తులో విప్లవం ఏరూపంలో వస్తుంది? గతంలో విప్లవాలు ప్రకాశవంతమైన భవిష్యత్తు పేరుతో జరిగాయి. కానీ ఇప్పుడు, ప్రజాస్వామ్య సంస్థల క్షీణత, స్వేచ్ఛల పరిమితీకరణ, మెల్లగా జరిగే అధికార కేంద్రీకరణ... ఇవే రాబోయే నిశ్శబ్ద విప్లవం లక్షణాలై ఉండవచ్చని ఎడెల్‌స్టీన్ హెచ్చరిస్తాడు. భవిష్యత్తులో విప్లవం ఎటువైపు నుంచైనా రావచ్చనే చర్చను ఆయన ముందుకు తెచ్చారు. అందువల్ల విప్లవం కేవలం గత చరిత్ర విషయం కాదు. అది ఇప్పటికీ మన రాజకీయాలు, సమాజాలు, భవిష్యత్తును ఆకారమిచ్చే శక్తిగానే కొనసాగుతోంది. రచనలకు స్ఫూర్తినిస్తుంది. ఒకరకంగా విప్లవం, విప్లవ సాహిత్యం పరస్పర పూరకాలు. ఒకటి లేకుండా రెండోదానిని చూడలేం. విప్లవమే చరిత్ర అయితే, చరిత్ర మొత్తం విప్లవాలతో మునిగితేలిందని సమకాలీన రచనలు మనకు స్పష్టం చేస్తుంటాయి. స్థూలంగా చూస్తే, ఈరెండు పుస్తకాలు చరిత్రను.. చరిత్రలో నిరంతరంగా సాగే విప్లవాల ప్రవాహం కనిపిస్తుంది. విప్లవమే చరిత్ర అని నినదిస్తున్నాయి.



### భారతదేశంలో బ్రిటిష్ పాలన స్థాపన..

భారతదేశంలో బ్రిటిష్ పాలన ఒక్కరోజులో ఏర్పడిన రాజకీయ పరిణామం కాదు. అది దాదాపు రెండు శతాబ్దాల పాటు సాగిన ఒక నెమ్మదైన, సంక్లిష్టమైన, కానీ వ్యూహాత్మకమైన ప్రక్రియ. మొదట వాణిజ్య ప్రయోజనాల కోసం వచ్చిన బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ క్రమంగా రాజకీయ శక్తిగా మారి, చివరకు భారత ఉపఖండాన్ని తమ వలస పాలన కిందకు తీసుకువచ్చింది. ఈ పరిణామం వెనుక అంతర్జాతీయ వాణిజ్య పోటీ, భారతదేశంలోని రాజకీయ విభజన, మొఘల్ సామ్రాజ్య పతనం, సైనిక ఆధిపత్యం, దౌత్య చాతుర్యం, అలాగే బ్రిటిషర్లు అనుసరించిన విధానాలు కీలకపాత్ర పోషించాయి. భారతదేశంలో బ్రిటిష్ రాజ్ ఏర్పడిన విధానం భారత చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన, దీర్ఘకాలిక మార్పులను తీసుకువచ్చిన అధ్యాయంగా నిలిచింది. యూరోప్‌లో జరిగిన భౌగోళిక అన్వేషణలు, వాణిజ్య విస్తరణ ప్రయత్నాలు భారతదేశాన్ని ప్రపంచ వాణిజ్య పటంలో కీలక స్థానంలో నిలిపాయి. పోర్చుగీసు వ్యాపారులు భారతదేశంలో సాధించిన విజయం బ్రిటిష్ వ్యాపారులనుఆకర్షించింది. మసాలాలు, వస్త్రాలు, పట్టు,నీలం వంటి వస్తువులపై ఉన్న విపరీతమైన లాభాలు ఇంగ్లాండ్‌లోని వ్యాపారవర్గాలను ఇటువైపు మళ్లించాయి. ఈ నేపథ్యంలోనే 1599లో మర్చంట్ అడ్వెంచరర్స్‌గా పిలుచుకునే ఇంగ్లీష్ వ్యాపారులు ఈస్ట్‌ఇండియా కంపెనీస్థాపించారు. మొదట్లో ఈ సంస్థ పూర్తిగా వాణిజ్యపరమైనదే. కానీ కాలక్రమేణా ఈ వాణిజ్య ప్రయోజనాల రక్షణ పేరుతో రాజకీయ జోక్యం ప్రారంభమైంది.



# సురవరం స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు

## సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి.ఫయాజ్

**ప్రజాపక్షం/నాగర్ కర్నూల్ :** అంతరాలు లేని సమాజం కోసం పరితపించిన వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అని సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి.ఫయాజ్ అన్నారు. బుధవారం సిపిఐ అగ్ర నాయకులు, మాజీ ఎంపి, సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి 84వ జయంతిని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సురవరం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం సురవరం చేసిన కృషి చరిత్రలో నిలిచి పోతుందన్నారు. సురవరం ఆశయాల సాధన కోసం ఆయన చూపిన మార్గాన ముందుకు సాగాలని, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించడమే సుధాకర్‌రెడ్డికి ఘనమైన నివాళులర్పించిన వాళ్ళమవుతామని, సురవరం స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగిస్తామని ఫయాజ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడె కె.కేశవులుగౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మారేడు శివశంకర్, పట్టణ కార్యదర్శి గోపీ చారి, సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి, సిపిఐ నాయకులు బాలపీర్ హుస్సేన్, జి.వెంకటస్వామి, డబ్బు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ :** సురవరం సుధాకర్‌రెడ్డి జయంతిని జిల్లాకేంద్రంలోని సురవరం వెంకటరామిరెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సురవరం చిత్రపటానికి సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం అవిశ్రాంత పోరాటం చేస్తూ తుది శ్వాస విడిచే వరకు నిలబడ్డ మహోన్నత వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అని, వారి స్ఫూర్తితో ప్రజా సమస్యలపై విస్తృత పోరాటాలు చేస్తామని బాలకిషన్ తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఎమ్.నరేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, పి.సురేష్, కె.పద్మావతి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సత్యనారాయణరెడ్డి, మహేష్ బాబు, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, శేఖర్, పట్టణ నాయకులు సుందర్ రాజు, హన్వాడ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ కార్మిక భవనంలో సురవరం సుధాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సురవరం చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ మాట్లాడుతూ రాజకీయాలలో అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్న సురవరం నిబద్ధత నిజాయితీ క్రమశిక్షణకు మారుపేరుగా పార్టీలో అంచలంచలుగా ఎదిగినారన్నారు. చివరి వరకు కమ్యూనిస్టు పార్టీతోనే ఉంటూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పని చేసిన గొప్ప త్యాగశీలి సురవరం అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, అజ్జ వేణు, మీసం లక్ష్మణ్, వడ్డేపల్లి లక్ష్మణ్, మమత తదితరులు పాల్గొన్నారు.







# ఎలాంటి రుసుం వసూలు చేయకుండా కొండపైకి ఆటోలు అనుమతించాలి

## ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండి.ఇమ్రాన్ డిమాండ్




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట కొండపైకి నడిచే ఆటోలకు దేవస్థానం వారు ఎలాంటి రుసుములు వసూలు చేయకుండా కొండపైకి ఆటో నడిపేందుకు యధావిధిగా అనుమతించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండి.ఇమ్రాన్ డిమాండ్ చేశారు. బుధవారం జై హనుమాన్ ఆటో యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) జనరల్ బాడీ సమావేశం స్థానిక కెబిఆర్ ఫంక్షన్ హాల్లో అధ్యక్షుబు కళ్లెం సిద్ధులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం పేరుతో మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలలో ప్రయాణికులు ఎక్కడం లేదని దీంతో ఆటోడ్రైవర్లు తమ పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి కిరాయిలు, ఆటో ఇన్సూరెన్స్, నెలవారి కిస్తీలు కట్టలేక కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారి దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో 12 వార్డు సిపిఐ కౌన్సిలర్ బబ్బురి శ్రీధర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పెరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, ఎఐటియుసి జిల్లా సహాయకార్యదర్శి గోపగాని రాజు, కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు గనబోయిన వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సామల భాస్కర్, గౌరవ అధ్యక్షులు మన్సూర్ పాషా, ఉపాధ్యక్షులు నర్ర నాగరాజు, తుమ్మల ఇస్తారీ, ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి శీను, కోశాధికారి తంతరపల్లి పాండుతో పాటు పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 1 నుంచి 'ఇంటింటికీ సిపిఐ




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఏప్రిల్ 1 నుండి 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ సిపిఐ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్.విలాస్, సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి భూక్యా రమేష్ తెలిపారు. బుధవారం నిర్మల్ జిల్లాకేంద్రంలో పద్మకుమారి ఆధ్యక్షతన నిర్వహించిన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి విలాస్, భూక్యా రమేష్ హాజరై మాట్లాడారు. సమావేశంలో విలాస్ మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుండి 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటికీ సిపిఐ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే సిపిఐకి ప్రజలు స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి సహకరించాలని కోరారు. పార్టీ సిద్ధాంతాల పట్ల ఆసక్తి ఉన్న వారికి ఈ ప్రచారంలో భాగంగా నూతన సభ్యత్వాలను అందజేయనున్నట్లు తెలిపారు. రాబోయే జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో సిపిఐ స్వతంత్రంగా పోటీ చేస్తామని తెలిపారు. పార్టీ బలోపేతానికి మండల స్థాయి సమావేశాలు నిర్వహిస్తామని, కార్యకర్తలకు రాజకీయ అవగాహన కల్పించేందుకు మే నెలలో ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని భూక్యా రమేష్ పేర్కొన్నారు. ప్రజా పక్షాన నిలబడి అక్రమాలను ప్రశ్నించే శక్తులకు ప్రజలు మద్దతు తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ నాయకులు ఎస్.ఎన్.రెడ్డితో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణిలో రాజకీయ జోక్యం తగదు

## సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీతారామయ్య, రాజ్‌కుమార్






**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందని, రాజకీయ జోక్యంతోనే సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని శాశ్వత వేజ్ బోర్డు సభ్యులు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్‌కుమార్‌లు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సింగరేణి కార్మిక హక్కుల సాధన పరిరక్షణ కోసం ఈనెల 18న గోలేటిలో ప్రారంభమైన సేవ్ సింగరేణి బస్సు జాతా యాత్ర బుధవారం భూపాలపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎఐటియుసి భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో బస్‌జాత బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. జిల్లాకేంద్రంలోని సిఆర్ నగర్ బాంబుల గడ్డ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా ఫైవ్ ఇంక్లైన్ క్రాస్ నుంచి అంబెద్కర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో సీతారామయ్య, రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో మెడికల్ బోర్డులో పాత విధానంలోనే నిర్వహించాలని, కార్మికుల చిరకాల కోరిక అయిన సొంత ఇంటి కలను యాజమాన్యం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. స్ట్రక్చర్ కమిటీ మీటింగ్‌లలో ఒప్పుకున్న నిర్ణయాలను అమలు చేయాలన్నారు. విజిలెన్స్ కేసులను త్వరగా విచారించాలని కోరారు. కోల్ ఇండియా మాదిరిగా పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ సమస్యలను పరిష్కరించాలన్నారు. కరోనా సమయంలో వివిధ కారణాలతో డిస్మిస్ అయిన కార్మికులకు మరొక అవకాశం కల్పించాలన్నారు. ఇటీవల కాలంలో మెడికల్ ఫిట్ అయిన 300 మందికి త్వరగా పోస్టింగ్ ఇవ్వాలని, క్లర్క్ పోస్టులకు వెంటనే పరీక్ష నిర్వహించాలన్నారు. సింగరేణికి రావలసిన రాష్ట్ర ప్రభుత్వ బాకాయిలు 51 వేల కోట్ల రూపాయలను వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. 30న జరిగే జాతాలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి సెంట్రల్ కమిటీ డిప్యూటీ సెక్రటరీలు వీరభద్రయ్య, వైవి.రావు, ముష్కె సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గురిజేపల్లి సుధాకర్‌రెడ్డి, ఆసిఫ్‌పాషా, జి.శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, రవి కుమార్, తోట రామచందర్, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్, బ్రాంచ్ నాయకులు నూకల చంద్రమౌళి, తాళ్ల పోచం, కరీముల్లా, ఎల్.శంకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీని ముట్టడించి తీరుతాం



**ప్రజాపక్షం/ వెల్దండ :** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ ఈనెల 30న అసెంబ్లీని ముట్టడించి తీరుతామని నాగర్ కర్నూలు జిల్లా తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ జంగిలి నిరంజన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, అధికారంలోకి రావడానికి ముందు ఉద్యమకారులకు తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కార్డులతో పాటు హెల్త్ కార్డులు, 250 చదరపు గజాల ఇంటి స్థలం, 25 వేల పెన్షన్ అందజేస్తామని అధికారం చేపట్టాక వారిని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మండల అధ్యక్షులు గజిని శ్రీనివాస్, టౌన్ ఉపాధ్యక్షులు జంగిలి రవి, జంగిలి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి కర్నాకంటి వెంకటయ్యల తదితరులు ఉన్నారు.

## పెండింగ్ బిల్లులు కోసం నిరసన



**ప్రజాపక్షం/ ధన్వాడ :** మండల కేంద్రమైన ధన్వాడలో గత కొన్ని ఏళ్ల క్రితం గ్రామపంచాయితీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరుతూ అంజయ్య పంచాయితీ సమావేశంలో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం పంచాయితీ పాలకవర్గం సమావేశం జరుగుతుండగా అంజయ్య అంబేద్కర్ చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని నల్ల కండువ ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల పంచాయితీలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధుల్లో పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లు విషయమై సమావేశంలో సర్పంచ్ భర్త తో పాటుగా మరిది అంజయ్య తో వాగ్వాదానికి దిగారు. వార్డు సభ్యులు నచ్చ చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. సమావేశంలో అంబేద్కర్ చిత్రపటాన్ని నల్ల కండువా వేసుకొని సమావేశంలో చర్చ కొనసాగించారు.

## తప్పడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** మహబూబ్ నగర్ జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఏమీ లేదని జిల్లా ఎస్పి డి.జానకి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో వస్తున్న వదంతుల కారణంగా ప్రజలు ఆందోళనకు గురై, ఒకేసారి పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనాలకు ఫుల్ ట్యాంక్ నింపుకునే ప్రయత్నం చేయడం వల్ల అనవసర రద్దీ ఏర్పడుతున్నదని తెలిపారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతున్నదని ఎస్పి తెలిపారు. ఇంధన కొరతకు సంబంధించిన ఎలాంటి పరిస్థితి లేదని, ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవద్దని సూచించారు. అలా చేయడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలుగుతాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న అసత్య సమాచారం, వదంతులను నమ్మవద్దని, నిర్ధారణ చేయని సమాచారాన్ని ఇతరులకు పంపించడం ద్వారా గందరగోళం సృష్టించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వదంతులు వ్యాప్తి చేసే వారి పై, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మహనీయుల ఆశయ సాధనే బిసి జాగృతి సేన లక్ష్యం



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో బిసి జాగృతి సేన జిల్లా అధ్యక్షుడు కోట కొండ కుర్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే, అంబేద్కర్, బిపి మండల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నాయకులు బిసి జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ మహనీయుల జయంతి మాసంలో భాగంగా నేడు పూలే, అంబేద్కర్ జయంతిని నిర్వహించామని తెలిపారు. అణగారిన ప్రజల బ్రతుకు ల్లో అక్షర జ్యోతి వెలిగించిన పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఉన్నత చదువులు చదివిన తర్వాత గొప్పగా జీవించే అవకాశం ఉన్నా షెడ్యూల్ కులాల ప్రజలతో పాటు దేశ ప్రజలకు రాజ్యాంగం ద్వారా స్వేచ్ఛ, సమానత్వం, హక్కులు కల్పించారని అన్నారు. రెండవ మండల్ కమిషన్ చైర్మన్ బిందేశ్వరి ప్రసాద్ మండల్ కృషి ఫలితంగానే బిసిలకు ప్రభుత్వ ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్‌లు అమలు అయ్యాయని, ముగ్గురు మహనీయుల ఆశయ సాధన కై నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. బిసి జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూమహనీయుల ఆశయ సాధనకై బిసిలు ఏకతాటిపైకి రావలసిన సమయం ఆసన్నమైందని అగ్రకుల పార్టీల జెండాలను వదిలి ఉద్యమం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ యాదవ్, బిసి జాగృతి సేన జిల్లా అధ్యక్షులు కోటకొండ కుర్మయ్య, జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'

**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దామర్గిద్ద సర్పంచ్ కనికి రెడ్డి రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరం ప్రారంభించినారు. ప్రత్యేక వైద్య నిపుణులు ద్వారా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఇట్టి శిబిరంలో స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ గణేష్, చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సంతోష్, దంత వైద్య నిపుణుడు డాక్టర్ భాను, జనరల్ మెడిసిన్ డాక్టర్ అమృత, యముకల వైద్య నిపుణుడు డాక్టర్ సంతోష్ రెడ్డి, కళ్ల వైద్య నిపుణులు డాక్టర్ సునీల్ కుమార్, వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. అలాగే మందులు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ అంబికా, డాక్టర్ ఐశ్వర్య, డాక్టర్ అమీర్ సోహెల్, డాక్టర్ హరి చందన, పి.నారాయణ సామాజిక ఆరోగ్య అధికారి, వెంకట్ రాంరెడ్డి ఫార్మసీ ఆఫీసర్ వెంకటేష్ హెల్త్ సూపర్ వైజర్, కిష్టమ్మ హెల్త్ సూపర్ వైజర్, శివలీల తదితరులు పాల్గొన్నారు.



# ఏరియర్స్ బడ్జెట్ పక్కదారి పట్టకుండా కార్మికులకు తక్షణమే అందించాలి

- ఎఐటియుసి పోరాటం, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక కృషి ఫలితంగానే పడకల పెంపు
- జిఒ 60 ప్రకారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పూర్తిస్థాయి వేతనం అందించాలి
- తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పడకల సామర్థ్యం అసంబద్ధంగా 83 నుంచి 50 పడకలకు తగ్గించిన నేపథ్యంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) పోరాటం, స్థానిక శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ప్రత్యేక కృషితో తిరిగి 100 పడకల సామర్థ్యానికి గత నెల పెరిగిందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి. సురేష్ అన్నారు. బుధవారం జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులకు పడకలు తగ్గాయన్న నెపంతో కట్ చేసిన కార్మికుల కటింగ్ జీతం యొక్క ఏరియర్స్ బడ్జెట్ విడుదల అయిన నేపథ్యంలో ఏరియర్స్ బడ్జెట్ పక్కదారి పట్టకుండా తక్షణమే కార్మికుల వేతనాలు చెల్లించాలని, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హార్ష దుల్లాకి వినతి పత్రాన్ని అందజేశారు. ముందుగా ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ హర్షదుల్లాకి పారిశుధ్య కార్మికులు శాలువ కప్పి సత్కరించారు. ఈసందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ ఏలాం టి పారదర్శకత లేకుండా ఆసుపత్రి పడకల సామర్థ్యం తగ్గించి కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులను అనేక ఇ బ్బందులకు గురి చేయడమే కాకుండా కార్మికుల వేతనాలు పెద్ద సంఖ్యలో కోల్పోయి తక్కువ జీతాలకే విధులు నిర్వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) పడకల సామర్థ్యానికి సంబంధం లేకుండా పనిచేస్తున్న పారిశుద్ధ్య, పేషంట్ కేర్, సెక్యూరిటీ సూపర్వైజర్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని పడకల సామర్థ్యం పెంచాలని డిమాండ్ చేస్తూ దశల వారీగా పోరాటం నడుపుతూనే మరోపక్క వైద్య ఆరోగ్య శాఖ అధికారులను స్థానిక ఎమ్మెల్యే వైద్య శాఖ మంత్రి ప లు దఫాలుగా కలిసి వినతి పత్రాలు అందజేసి కార్మికుల వేతలను వివరించామని అన్నారు. మానవత త్రిపథంతో ప్రభుత్వం తగ్గించిన పడకలను తిరిగి నంద పడకలకు పెంచడం శుభ పరిణామం అని అన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం కార్మికులకు పూర్తిస్థాయి వేతనం, పిఎఫ్, ఇఎస్ఐలు సక్రమంగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, కనీస వేతనం రూ.26,000 అందే విధంగా నూతన టెండర్లను ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ యూనియన్ నేత లు కార్మికులు నాగరాజు, నరసింహ, నవీన్, పేర్మల్, రామకృష్ణ, రాజేష్, మన్నెమ్మ, పద్మ, శివలీల నీరజ, అలివేల, నరసమ్మ, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి

### పెబ్బేరు పర్యటనలో కలెక్టర్ ఆదేశాలు



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల కేంద్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ పెబ్బేరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది, ఆహార పదార్థాల నిల్వ గదిని పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. మెస్ కమిటీ విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, పాఠశాలకు సరుకులు వచ్చిన ప్రతిసారి రిజిస్టర్లలో మెస్ కమిటీ విద్యార్థులు సంతకం చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే ఆహార పదార్థాల గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అనంతరం ఎస్ఎస్‌సి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి, బాగా సిద్ధమై పరీక్షలను మంచిగా రాయాలని ప్రోత్సాహించారు. మంచి మార్కులు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పిఎం శ్రీ పథకం కింద పాఠశాలలో చేపట్టిన పనులపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, పాఠశాలకు అవసరమైన అంశాలపై వెంటనే ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు.

### అంగన్వాడీ భవనాల పరిశీలన

పెబ్బేరు మండల కేంద్రంలోని హరిజనవాడ, చెలిమెల్లలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద ఎబిడి లిక్కర్ సంస్థ ఆధ్వర్యంలో పునరుద్ధరించిన అంగన్‌వాడి భవనాలను సందర్శించారు. శ్రీరంగాపురం, పెబ్బేరు మండలాల పరిధిలో 10 అంగన్వాడీ సెంటర్లను రూ.35లక్షల వ్యయంతో వీరు సిఎస్ఆర్ కింద పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. ఈ భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా సంక్షేమ అధికారిని సుధారాణి, డివైఎస్ఓ సుధీర్‌రెడ్డి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిసిడిఒ శుభలక్ష్మి, పెబ్బేరు తాహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఎంపిఒ రోజా , మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## స్పెషల్ బ్రాంచ్ పనితీరు ప్రశంసనీయం

**ప్రజాపక్షం/వనపర్తి :** బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు సిబ్బందితో జిల్లా ఎస్పి సునితరెడ్డి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి స్పెషల్ బ్రాంచ్ విభాగం పనితీరును ప్రశంసిస్తూ, మరింత సమర్ధవంతంగా పనిచేసి ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ స్పెషల్ బ్రాంచ్ విభాగం జిల్లా భద్రతా వ్యవస్థలో కీలక స్థంభం స్పెషల్ బ్రాంచ్ అందిస్తున్న సమాచారంతో నేరాలను ముందుగానే అడ్డుకోవడం సాధ్యమవుతోంది. ఇదే ఉత్సాహంతో మరింత క్రమశిక్షణతో, పారదర్శకతతో పనిచేస్తూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి. ప్రతి పని సమయానికి పూర్తి చేయడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల నమ్మకం మరింత పెరుగుతుందని పాస్‌పోర్టు వెరిఫికేషన్ ప్రక్రియ, ఉద్యోగ వెరిఫికేషన్‌లు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు జారీ, ఇతర విభాగాలకు సమన్వయంతో సహకారం అందించడం అన్ని అంశాల్లో స్పెషల్ బ్రాంచ్ పనితీరు ప్రశంసనీయమని ఎస్పి అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ నరేష్, ఎస్సై రామేశ్వర్ రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## వెన్నచెర్లలో హెల్త్ క్యాంప్

**ప్రజాపక్షం/ పెద్దకొత్తపల్లి :** మండలంలోని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెన్నచర్ల గ్రామ గ్రామంతో పాటు అన్ని గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం హెల్త్ కాప్ హెల్త్ క్యాంపు ఉంటుందని, గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపిపి సూర్య ప్రతాప్ గౌడ్ అన్నారు. నేడు ఉదయం 10 గంటలకు హెల్త్ క్యాంపు ఉంటుందని ఈ క్యాంపులో ఇఎన్‌టి జనరల్ మెడిసిన్, గైకానాలజీ, ఆర్థోపెటిక్, పీడియాట్రి క్, తదితర సంబంధిత వైద్య నిపుణులు ఉంటారని హె ల్త్ క్యాంపుని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎం పిపి సూర్య ప్రతాప్ గౌడ్, మండల ప్రజలకు పిలుపునిచ్చారు.

## అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం

### టౌన్ అధ్యక్షులు జె. చిన్న హనుమంతు



**ప్రజాపక్షం/ మక్తల్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని మక్తల్ పట్టణ అధ్యక్షుడు జె.చిన్న హనుమంతు తీవ్రంగా ఖండించారు. శాంతియుత నిరసనలు తెలుపుతున్న వారిని, ముఖ్యంగా బిఆర్ఎస్ నేతలను పోలీసులు అమానుషంగా నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్న వారిని, నిరసనలు తెలుపుతున్న వారిని పోలీసులు ఉసిగొల్పి అణచివేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీలను నెరవేర్చలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిరుద్యోగ భృతి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చలో అసెంబ్లీ ముట్టడికీ వెళ్లకుండా టిఆర్ఎస్ పార్టీని ఎదుర్కోలేక అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని ఆరోపించారు. ఈ అరెస్టులు ప్రజాస్వామ్య విరుద్ధమని, ప్రభుత్వం తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని వారు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మన్నన్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ నమోదుపై బిఎల్‌ఓలకు ప్రత్యేక శిక్షణ

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఓటర్ నమోదు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు బూత్ లెవల్ అధికారులకు (బిఎల్‌ఒలు) ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కీలక అంశాలపై ట్రైనర్ ఆంజనేయులు, ఆర్‌ఐ కురుమూర్తి మార్గదర్శకాలు అందించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారుల మార్గనిర్దేశంతో బిఎల్‌ఒలకు ఓటర్ నమోదు, పేరు మార్పులు, చిరునామా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తులను ఎలా స్వీకరించాలి, పరిశీలించాలి. సరైన విధంగా నమోదు చేయాలనే అం శాలపై ప్రాక్టికల్ డెమో కూడా బిఎల్‌ఓలకు చూపించారు.

## వరి ధాన్యం సేకరణ పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/ గద్వాల రూరల్ :** 2025–26 యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పూర్తి ఏర్పాట్లు చేసి, నిబంధనల ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లాలో మొత్తం 87 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుపుతూ, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన గన్ని బ్యాగులు, టార్పాలిన్‌లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, తేమ నిర్ధారణ యంత్రాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల వద్ద నుండి అదనపు చార్జీలు (హమాలీ, గన్ని బ్యాగులు మొదలైనవి) వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. వ్యవసాయ అధికారులు ధాన్యం తేమ శాతాన్ని తప్పనిసరిగా పరీక్షించి నమోదు చేయాలన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, అందులో టోల్ ఫ్రీ నంబర్, కనీస మద్దతు ధర, తదితర వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో మూవ్‌మెంట్ రిజిస్టర్ నిర్వహిస్తూ రోజు వారీ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్టుల ద్వారా అక్రమ రవాణాను అరికట్టాలను పోలీస్ అధికారులకు ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం జిల్లాలోకి రాకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని సూచించారు. ఆర్డీఓ అధికారులు రవాణా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి ముందస్తు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తని ఖీలు నిర్వహించడం జరుగుతుందని, విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారుల పై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగ రావు, అదనపు ఎస్పి శంకర్, ఆర్‌డిఓ శ్రీనివాస రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, పౌర సరఫరాల మేనేజర్ విమల, జిల్లా వ్యవసాయాధికారి వీరప్ప, కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారిని పుష్పమ్మ, డిఆర్‌డిఎడిడి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలకు దోహదం

నమూనా ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావే శం నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయక త్వ లక్షణాలు పెంపొందించేందుకు దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అ న్నారు. జల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో, నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం సహకారంతో బుధవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ కార్యక్రమంలో జిల్లాలోని 22 పిఎం శ్రీ పాఠశాలల నుంచి 44 మంది విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా పాల్గొని తమ వాణి వినిపించారు. మానవ హక్కులు, వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ పై నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సుమారు 193 దేశాలు ఐక్య రాజ్య సమితి సభ్య దేశాలుగా ఉన్నాయని, విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో మైఖేల్, సోషల్ ఫోరం ప్రతినిధులు లక్ష్మీ నారాయణ, ప్రతాప్, నరసింహులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు

### జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించినర జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించి ఇసుక బుకింగ్, సరఫరా, ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మండలాల వారీగా మన ఇసుక వాహనం ద్వారా ఇసుక బుకింగ్, కూపన్లు ఆన్లైన్ , ఆఫ్ లైన్ లో జారీ సరఫరా పై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుండి నూరు శాతం మన ఇసుక వాహనం ద్వారా ఆన్లైన్ ద్వారా మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించారు. గతంలో తనిఖీ కమిటీ గుర్తించిన 16 రీచ్‌లలో భాగంగా రెండు మాత్రమే ఇసుక బుకింగ్ కు నడుపబడుతున్నట్లు అధికారులు వివరించారు. ఇందులో అడ్డాకుల మండలం కన్మనూర్, మూసాపేట మండలం పోల్కాంపల్లిలో ఇసుక రీచ్‌ల నుండి మన ఇసుక వాహనం ద్వారా ఇసుక బుకింగ్ సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. మిగతా 14 ఇసుక రీచ్ లను ఆన్లైన్ బుకింగ్ ద్వారా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు మండల స్థాయిలో తహసీల్దార్‌లు, పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల ని ఆదేశించారు. తనిఖీల్లో అక్రమ ఇసుక రవా ణా స్వాధీనం, అక్రమ ఇసుక డంప్‌ల వివరా లు, అక్రమ రవాణాలో పట్టుకున్న లారీలు, ట్రా క్టర్లు, అలాగే అక్రమ ఇసుక తవ్వకాలపై విధిచిన జరిమానాలపై సమగ్ర సమాచారం ఇసుక వాట్సప్ గ్రూప్‌లో వివరాలు పోస్ట్ చేయాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. ఇకపై అన్ని ఇ సుక బుకింగ్‌లు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశం లో ఇంచార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మ ధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ, అదనపు ఎస్పి ఎన్‌బి. రత్నం, జడ్. పిసిఇఒ ఇంచార్జ్ డిపిఒ వెంకట రెడ్డి, ఆర్‌డిఇఒ. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీలో రోటవేటర్



**ప్రజాపక్షం/నర్వ :** నర్వ మండలంలోని ఉందెకోడ్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డా.వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, నిర్వహించిన ఫార్మ్ మెకానైజేషన్ సబ్సిడీలో భాగంగా గ్రామంలో గుర్రం పెద్ద బాలయ్య కి రోటవేటర్, అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్వ మండల ఎఒ అఖిలారెడ్డి, గ్రామ వ్యవసాయ అధికారి హర్షియ, నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి.అశోక్ గౌడ్, గ్రామ అధ్యక్షులు కొండప్ప, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సి.నాగప్ప గౌడ్, కే.భాస్కర్ రెడ్డి, కుమ్మరి ఆంజనేయులు, రామలింగం, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉట్కూరులో ఆర్థిక అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ ఉట్కూరు :** నేషనల్ సెంటర్ ఫర్ ఫైనాన్స్ ఎడ్యుకేషన్ సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో ఉట్కూరు మండల గ్రామ పంచాయితీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని చాంద్ సుల్తానా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేణుక భరత్, గ్రామ ఎస్సై రమేష్, పోస్ట్మాన్ సర్వతం చారి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు బ్యాంకు ఖాతాలు, ఈ కేవైసీ, ఆధార్ అనుసందానం, అలాగే ప్రభుత్వ వివిధ సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. ప్రజలు తమ బ్యాంకు ఖాతాలను సక్రమంగా ఉపయోగించుకొని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని వారు సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం

**ప్రజాపక్షం/అమరచింత :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా అమరచింత మండల పరిధిలోని ధర్మాపూర్, నందిమల్ల, చింతరెడ్డి పల్లెలో లబ్దిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్లను బుధవారం రాష్ట్రమంత్రి వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా వాకిటి లలితమ్మ ప్రారంభోత్సవం చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మ హాజరై ఆయా గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా నూతన గృహప్రవేశం చేస్తున్న సాంప్రదాయపరంగా ఇంటి ఆడపడుచుగా భావించి పట్టు వస్త్రాలను పెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు సావిత్రమ్మ, శ్రీశ్రీ కురుమూర్తి స్వామి దేవస్థాన కమిటీ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నల్లగొండ కోర్టు కఠిన తీర్పు -రూ.30 వేల జరిమానా విధింపు

**ప్రజాపక్షం/నల్లగొండ:** పట్టణంలో జరిగిన హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ కోర్టు కఠిన తీర్పు వెలువరించిందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో నమోదైన కేసులను విచారించిన నల్లగొండ ప్రత్యేక ఎస్సి,ఎస్టి పీఓఏ చట్ట కేసుల కోర్టు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఈ తీర్పు ఇచ్చారు.ఈకేసులో ప్రధాన నిందితుడు మొహమ్మద్ మొసిన్ ఖాన్ మృతి చెందగా,ఎ2 నిందితుడు మొహమ్మద్ దర్వేశ్ మొహియుద్దీన్ అలియాస్ నయాబ్‌పై కోర్టు శిక్ష విధించింది.2018 జనవరి 18న రాత్రి సుమారు 10 గంటల సమయంలో నల్లగొండ పట్టణంలోని భారత్ గ్యాస్ గోదాం సమీపంలోని ఓపెన్ ప్రదేశంలో కనగల్ మండలం పాలకురి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పాలకురి రమేష్ (30)ను నిందితులు హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది.నేరానికి ఆధారాలను సేకరించి కోర్టులో సమర్పించడంతో నిందితుడిని దోషిగా తేల్చారు.సెక్షన్ 302 కింద జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా,సెక్షన్ 201 కింద 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేల జరిమానా,సెక్షన్ 153(A) కింద 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధించింది.జరిమానా చెల్లించకపోతే అదనంగా శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.

## జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులు సద్వినియోగం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఈనెల 28వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా క్షేత్రస్థాయి పోలీసు అధికారులతో ఎస్పీ కె నరసింహ బుధవారం తన కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. రాజీపడదగిన కేసులను గుర్తించి కేసుల్లో ఉన్న ఇరువర్గాల వారికి అవగాహన కల్పించాలని, దీనిని సద్వినియోగం చేసుకునేలా చూసి ఎక్కువ మొత్తంలో కేసులు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జాతీయ మెగా లోక్అదాలత్ ద్వారా [illegible] తిన, ఇరువైపుల సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందన్నారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం, కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం తదితర కేసులు పరిష్కరించుకోవచ్చని వివరించారు. కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు.

## చెక్‌బౌన్స్ కేసులో నిందితురాలికి రూ. 10 లక్షల జరిమానా

**ప్రజాపక్షం/కోదాడ :** కోదాడ పట్టణంలోని మొదటి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు చెక్‌బౌన్స్ కేసులో బుధవారం తీర్పు వెలువరించింది. నింధితురాలు కొప్పుల కామేశ్వరమ్మ భర్త ఆరె రవీందర్ రెడ్డి రూ.10లక్షల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. మునగాల మండలం నర్సింహాపురానికి చెందిన వేమూరి సత్యనారాయణ వద్ద 2017లో కామేశ్వరమ్మ రూ.5లక్షలు అప్పుగా తీసుకున్నారు. తిరిగి చెల్లించే క్రమంలో ఇచ్చిన చెక్కు బౌన్స్ కావడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించారు. ఫిర్యాదుదారుని తరపున న్యాయవాది డి. నాగార్జున రావు వాదనలు వినిపించారు. తీసుకున్న మొత్తానికి రెట్టింపు చెల్లించాలని, లేనిపక్షంలో నాలుగు నెలల జైలు శిక్ష అనుభవించాలని జడ్జి ఆదేశించారు.

## నేడు బొమ్మగాని ధర్మంభిక్షం విగ్రహావిష్కరణ

**ప్రజాపక్షం/మోత్కూర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు మాజీ పార్లమెంట్, శాసనసభ్యులు, గీతాఫని వారల సంఘం వ్యవస్థాపకులు, బొమ్మగాని ధర్మబిక్షం విగ్రహావిష్కరణ మోత్కూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలో నేడు జరుగుతున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా గీతా పనివాళ్ల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య ప్రకటనలో కోరారు. బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తుంగతుర్తి శాసనసభ్యులు మందుల స్వామేలు, మునుగోడు మాజీ శాసనసభ్యులు సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లి కంటి సత్యం, గీతా పనివారల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొంటారని కార్యక్రమానికి గీతా కార్మికులు వివిధ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అరెస్ట్ అప్రజాస్వామికం



**ప్రజాపక్షం/దేవరకొండ:** పోలీసులు ఎన్ని కుట్రలు చేసిన, అక్రమ అరెస్టులు చేసిన పోలీసుల నిర్బంధాన్ని తప్పించుకొని అసెంబ్లీకి ఎఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం అసెంబ్లీ ముట్టడికి చేరుకున్నారు. బడ్జెట్‌లో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటా యించడాన్ని నిరసిస్తూ, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని అసెంబ్లీ ముట్టడికి వచ్చిన ఏఐఎస్ఎఫ్ నాయకులను అసెంబ్లీ ముందు అడ్డుకొని అరెస్ట్ చేసిన పోలీసులు, పోలీసులకు ఎఐఎస్ఎఫ్ నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా అరెస్ట్ ఆయిన ఆంజనేయులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు 15 శాతం కూడా కేటాయించలేదని అగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖను తన వద్దనే పెట్టుకున్న సిఎం రేవంత్‌రెడ్డి విద్యను నిర్వీర్యం చేస్తున్నాడని, విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తే అరెస్టులు చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు.

## 31వరకు చేయూత ఆసరా పింఛన్ల పంపిణీ

**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లాలోని తెలంగాణ ఆసరా పింఛన్ దారులకు ఈనెల 27వ తేదీ వరకు పోస్ట్ ఆఫీస్ ద్వారా పింఛన్లు బట్వాడా చేయనున్నట్లు జిల్లా గ్రామాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి తెలిపారు.అర్హత కలిగిన వృద్ధాప్య,వితంతు,వికలాంగులు,కల్లుగీతి కార్మికులు,ఇతర ఒంటరి మహిళా పింఛన్ దారులు తమ పింఛన్ పొందాలని సూచించారు.పింఛన్ మొత్తాన్ని నేరుగా సంబంధిత పోస్టల్ శాఖ సిబ్బంది వారి వద్దకే పంపిణీ చేస్తారని,మధ్యవర్తులు ఎవరూ ఉండరని స్పష్టం చేశారు. పింఛన్ పొందడానికి ఎటువంటి నామినీ చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పింఛన్ మొత్తానికి అదనంగా రూ.16 సహా ఎలాంటి రుసుములు చెల్లించవద్దని హెచ్చరించారు.

# పెట్రోల్,డీజిల్ నో స్టాక్ బోర్డులు





నల్లగొండలో బంక్‌ల వద్ద భారీ క్యూలు.. ఆందోళనలో వాహనదారులు

**ప్రజాపక్షం/నల్లగొండ :** పెట్రోల్,డీజిల్ కొరత భయాందోళనలు రేపుతోంది. నల్లగొండ జిల్లాలో పలు పెట్రోల్ బంకుల వద్ద బుదవారం వాహనాలు బారులు తీరగా,గంటల తరబడి వాహనదారులు క్యూలలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కనిపించడం ప్రజల్లో మరింత ఆందోళనకు దారి తీసింది.పెట్రోల్,డీజిల్ సరఫరాలో అంతరాయం రావడానికి ప్రధాన కారణంగా ఆయిల్ కంపెనీల కొత్త నిబంధనలు నిలుస్తున్నాయి. ఇప్పటివరకు బంకులకు ముందుగా ఇంధనం సరఫరా చేసి,అమ్మకాలు పూర్తయ్యాక ఒకటి రెండు రోజుల తర్వాత డబ్బులు చెల్లించే విధానం అమలులో ఉండేది.కానీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది.ముందుగా నగదు చెల్లిస్తేనే స్టాక్ అనే విధానాన్ని ఆయిల్ కంపెనీలు అమలు చేయడంతో సమస్య తలెత్తింది.పాత బాకీలు తీర్చడంతో పాటు కొత్త స్టాక్ కోసం ముందే భారీ మొత్తంలో డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి రావడంతో,పలు బంకులు మూతపడుతున్నాయి. దీంతో యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులు ఇంధనం కోసం ఉదయం నుంచే బంకుల వద్దకు చేరుకుంటున్న వాహనదారులు గంటల తరబడి క్యూలలో నిలబడాల్సి వస్తోంది. అత్యవసర పనుల కోసం వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో పూర్తిస్థాయి ఇంధన కొరత లేదని అధికారులు చెబుతున్నప్పటికీ,సరఫరా అంతరాయం వల్ల తాత్కాలిక సమస్యలు తలెత్తుతున్నాయి.

**పెట్రోల్, డీజిల్ కొరతపై పుకార్లు నమ్మొద్దు: పౌరసరఫరాల శాఖ**

జిల్లాలో పెట్రోల్,డీజిల్ కొరత ఉందన్న ప్రచారం నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ కీలక ప్రకటన విడుదల చేసింది.సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాల కారణంగా వాహనదారులు ఒక్కసారిగా పెట్రోల్ బంకుల వద్దకు చేరుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరిపడ స్థాయిలో నిల్వ లు అందుబాటులో ఉన్నాయని,అన్ని పెట్రోల్ బంకులు యథావిధిగా పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. కొరత ఉందన్న పుకార్లు పూర్తిగా అసత్యమని,వాటిని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా బకాయిలు చెల్లించాలి

సూర్యాపేట జిల్లాకు బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలి : పబ్బు వీరస్వామి

జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ముందు ధర్నా




**ప్రజాపక్షం/నల్లగొండ :** గీతవృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని గీత పనివారాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ముందు గీత పనివారాల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో పబ్బు వీరస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రమాదవశాత్తు చెట్లపై నుంచి పడి మరణించిన వికలాంగులైన గీత కార్మిక కుటుంబాలకు ఇవ్వాల్సిన 13 కోట్ల రూపాయల ఎక్స్‌గ్రేషియా బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. గీత వృత్తిలో మరణించిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను 10 లక్షలకు, గాయపడిన వారికి 2 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.మెడికల్ బోర్డు విధానాన్ని రద్దు చేసి,ప్రభుత్వ సివిల్ అసిస్టెంట్ సర్జన్ పర్యవేక్షణలో వికలాంగుల నిర్ధారణ సర్టిఫికెట్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు.రాష్ట్ర బడ్జెట్‌లో గీత వృత్తి పరిశ్రమకు తగిన నిధులు కేటాయించి, గీతకార్మికులందరికీ కాటమయ్య కిట్లు అందించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ సహకార సంఘాలను బలోపేతం చేయడంతో పాటు వృత్తి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,గీత వృత్తిదారులకు పెన్షన్‌ను వృత్తి పెన్షన్‌గా ప్రకటించి పెంచాలని,స్త్రీ పురుషులకు సమానంగా వర్తింపజేయాలని తెలిపారు.స్వాతంత్ర్య సమరయోధుడు బొమ్మగాని ధర్మభిక్షం పేరును సూర్యాపేట జిల్లాకు పెట్టడంతో పాటు ఆయన జయంతి,వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో అసంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సురిగి చలపతి,చింతపల్లి పుల్లయ్య,బొమ్మరబోయిన లాలు,కుంభం జయరాములు,సహాయ కార్యదర్శులు,జోగు సురేందర్, గురిజ రామచంద్రం జోగు కృష్ణ,బొంది వెంకన్న,మాదగోని మల్లయ్య, నాతి నర్సింహా,వి.లెనిన్,పేరువాల రాములు,యాకాలపు పాండు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో పనిచేస్తే చేనేత అభివృద్ధి



భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ప్రభుత్వం ప్రవేట్ భాగస్వామ్యంతో కృషి చేస్తే చేనేత అభివృద్ధికి సరికొత్త శోభ వస్తుందని దానిని ఎవ్వరూ ఆపలేరని అడ్డుకోలేరని కార్మికుల నిరంతర శ్రమకు అనంత వైభోగం వస్తుందని భువనగిరి యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. బుధవారం ఆయన కేంద్ర ప్రభుత్వ ఎన్ఐయుఐ నలుగురు మేధావుల అధ్యయన బృందంతో కలిసి పోచంపల్లి క్షేత్ర పర్యటన చేశారు. పోచంపల్లి చేనేత పరిశ్రమను ఎలా ఆదుకోవాలో మార్కెటింగ్ పబ్లిసిటీ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం ఎలా చేయాలో మార్గనిర్దేశం చేశారు. పట్టు చీరలు తయారీ పరిశ్రమను వీవర్స్ దగ్గరికి వెళ్లి స్వయంగా ఆయన పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో ఎన్ని నిధులు వెచ్చించినా సంస్థాగతంగా చిత్తశుద్ధితో నాయకులు పనిచేయకపోతే పరిశ్రమ ఎలా కుంటుపడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డిఆర్‌డిఓ నాగిరెడ్డికి చేనేత కార్మికుల ఉపాధి కోసం తక్షణంగా తీసుకోవలసిన చర్యలను ఆయన ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించాల్సిందిగా సూచించారు.ఆయన వెంట ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా ఆయన వెంట ఉండి పర్యవేక్షించారు. టూరిజం పార్క్ పోచంపల్లి మాస్టర్ వీవర్స్‌అయ్యప్ప స్వామి దేవాలయం మార్కండేశ్వర స్వామి దేవాలయం కళా పునర్వి యూనిట్ శ్రీ రంజన్ యూనిట్, అయ్యప్ప స్వామి టెంపుల్, వెళ్లి ఆయన పరిశీలించారు. దేవాలయాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు పూర్తి సమాచారాన్ని ఆయనకు నివేదించారు.

## విధుల పట్ల అలసత్వం వహించొద్దు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ప్రజాపక్షం/రామన్నపేట :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు మరియు సిబ్బంది ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని రిజిస్టర్లను చెక్ చేశారు. డాక్టర్లు, సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ప్రతిరోజు ఓ.పికి ఎంత మంది వస్తున్నారని రిజిస్టర్‌ను పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఆసుపత్రి ఆవరణలో తిరుగుతూ పేషంట్ల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన చికిత్సలు అందిస్తున్నారా అని ఆసుపత్రికి వచ్చిన పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణీ స్త్రీలతో మాట్లాడుతూ డాక్టర్లు సరిగా చూస్తున్నారా, సమయానికి మందులు ఇస్తున్నారా,రక్త పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేస్తున్నారా అని ఆరా తీశారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను ప్రతి రోజు శుభ్ర పరచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. శానిటేషన్ కాంట్రాక్టర్‌కి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ రామన్నపేట లోని నర్సరీని సందర్శించి అక్కడ మొక్కల పెంపకం ,సంరక్షణను పరిశీలించారు. మొక్కలు పెట్టినవి పెరగకుండా చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటి వాటిని నీరు పోసి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాములు, ఎంపీఓ రవూఫ్ అలీ, ఏపీవో వెంకన్న, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.



## ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాస్థాయి శాండ్ కమిటి సమావేశంలో వెబెక్స్ ద్వారా జిల్లా ఎస్‌పి కె నరసింహాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 6 ఇసుక రిచ్‌లలో అక్రమ ఇసుక రవాణా వాహనాలు పట్టుబడితే బైండోవర్ కేసులు నమోదు చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. ప్రతి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో ఇసుక అందించుటకు గాను ఆన్‌లైన్‌లో నమోదు చేపించాలని, ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కొరత రాకుండా చూడాలని సూచించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి పోలీస్, రెవెన్యూ, మైనింగ్ వారి ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ఒక మొబైల్ టీంను ఏర్పాటు చేయాలని, ఈ టీం జిల్లాలోని ఇసుక రిచ్‌లు పర్యటిస్తూ అక్రమ ఇసుక రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 729 ఆమోదం పొందిన ఇసుక ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించాలని, సిసి, ఏఎన్‌పిఆర్ కెమెరా పర్యవేక్షణతో పాటు ప్రతి సాండ్ టాక్సీ రీచ్‌లో 24 గంటల పర్యవేక్షణ కోసం హై ఎండ్ సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏదైనా అనధికార వాహనం కెమెరాలో గుర్తిస్తే ఆ వాహనాన్ని బ్లాక్ చేయబడుతుందని, సిసి కెమెరాతో అమర్చబడిన మొబైల్ వాహనం ద్వారా రీచ్ పరిసర ప్రాంతాలలో నిరంతరం సంచరిస్తూ అక్రమ ఇసుక రవాణాను తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్లు వారానికి కనీసం రెండు సార్లు రీచ్‌లను తప్పనిసరిగా సందర్శించాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుండి ఇసుక సరఫరాకు మ్యాన్యువల్ ఉండదని ఆన్‌లైన్ ట్రాన్సిస్ట్ పాస్ సిస్టమ్ (ఓటిపిఎస్), మన ఇసుక వాహనం ద్వారా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయితీ సెక్రటరీ ఇసుక ఎంత కావాలో నిర్ధారిస్తే, సంబంధిత తహశీల్దార్ పర్యవేక్షణలో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తారని వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, రెవెన్యూ డివిజనల్ అధికారి వేణుమాధవరావు, మైనింగ్ ఏడి విజయ రామారావు, డిపిఓ యాదగిరి, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి బాలు పాల్గొన్నారు.

## ఇక్కడ బదిలీలు ఉండవా?

కస్తూర్బా ఎఒ దురుసు ప్రవర్తన

సిబ్బందిపై అవమానకర వ్యాఖ్యలు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాల ఏవో ఏకంగా 8 సంవత్సరాలు ఒకే పాఠశాలలో (హాస్టల్) కొనసాగుతూ ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దిష్ట కాలం తర్వాత బదిలీలు జరగాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం ఆ వ్యవస్థ పూర్తిగా పక్కన పెట్టినట్టుగా కనిపిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. 'ఇక్కడ బదిలీలు ఉండవా..? లేక కొందరికి ప్రత్యేక అనుకూలతలేనా? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్ల తరబడి ఒకే చోట ఉండటం వల్ల సిబ్బందిపై స్థానికంగా పెత్తనం ప్రదర్శిస్తున్నారని తమకు నచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది విద్యాసంస్థ నిర్వహణపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పారదర్శకత పై సందేహాలు తలెత్తుతున్నాయి ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని బదిలీల వ్యవస్థను సమీక్షించి అవసరమైన మార్పులను చేపట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. బదిలీల ప్రక్రియను వెంటనే అమలు చేయాలని కోరారు. ఇదిలా ఉండగా విధుల్లో ఉన్న సిబ్బందిపై ఏవో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అందరి ముందే తిడుతూ అవమానించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిబ్బంది తక్కువ చేసి మాట్లాడటం అక్కడ సాధారణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అవమానకర వాతావరణంలో పని చేయడం కష్టమని వాపోయారు. అధికార దుర్వినియోగం చేసి సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేయడం సరైన విధానం కాదని ప్రజాసంఘాలు నాయకులు మండిపడుతున్నారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో 24 మంది లబ్ధిదారులకు రూ.9,26,500 విలువైన చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. గత 20 నెలల్లో మా తరపున 98 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.40,25,500 అందించామని గుర్తు చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలందరికి ఆరోగ్య భద్రత కల్పించాలని ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా సిఎం రిలీఫ్ ఫండ్ పేరు మీద 1000 కోట్లకు పైగా నిధులను మంజూరు చేశారని తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హులకు ఫండ్ అందిస్తున్నామన్నారు. మాకు సహకరిస్తున్న ఎంపి రఘువీర్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న సందర్భంగా పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కౌన్సిలర్ కొనతం రాజేష్ రెడ్డి, జ్యోతి కరుణాకర్, వల్దాస్ దేవేందర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అన్ని పథకాల గ్రౌండింగ్ లక్ష్యాలను బ్యాంకర్లు పూర్తి చేయాలి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈఆర్థిక సంవత్సరం ముగింపు దశలో ఉన్నందున బ్యాంకుల అనుసంధానంతో అమలు చేస్తున్న ప్రభుత్వ ప్రాధామ్య పథకాలతో పాటు,అన్ని పథకాల గ్రౌండింగ్ లక్ష్యాలను బ్యాంకర్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కోరారు.బుధవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో2025/26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సెప్టెంబర్,డిసెంబర్ 2025 త్రైమాసిక లక్ష్యాల సాధనపై బ్యాంకుల నియంత్రణ అధికారులు,జిల్లా అధికారులతో సమీక్షించారు. అమలు చేసే పథకాలపై కూడా బ్యాంకర్లు ఈ నెల 30 లోపు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా నాబార్డ్ ఆధ్వర్యంలో 2026/27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 16,861 కోట్ల రూపాయల తో రూపొందించిన సామర్థ్య ఆధారిత రుణ ప్రణాళిక (పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ 2026 27)ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఆర్‌బిఐ ఎల్‌డిఓ గోమతి,నాబార్డ్ డిడిఎమ్ వినయ్, నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ శంకర్ రావు,సంబంధిత శాఖల జిల్లా అధికారులు,బ్యాంకుల నియంత్రణ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## మొగులయ్య ఆశయాలను కొనసాగిద్దాం



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** బోగారం మొగులయ్య ఆశయ సాదనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన బుధవారం మోటకొండూరు మండల కేంద్రంలో సిపిఐ సీనియర్ నాయకులు బోగారం మొగులయ్య గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా ఆయన మృతదేహానికి సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, సిపిఐ సీనియర్ నాయకులు రేగు యాదయ్యలతో కలిసి ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొగిలయ్య తన చిన్నతనం నుండి సిపిఐ పార్టీలో పని చేస్తూ కీలక పాత్ర పోషించిన నాయకుడని, మోటకొండూరు గ్రామ పంచాయతీలో పనిచేసుకుంటూ ఏఐటీయూసీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్‌లో ముఖ్య పాత్ర పోషించాడని, తుదిశాస వరకు కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ మృతి చెందడం సిపిఐ పార్టీకి, తన కుటుంబానికి తీరని లోటనిఅన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నల్ల రాములు, బీరకాయల మురళి, వంగపల్లి సాయిలు, పాండు, గుంశి తదితరులు పాల్గొన్నారు.

# లీల

‘ ఆహా ఓటిటిలో తురుమ్ ఖాన్ స్టార్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై తెలంగాణ యాస, భాష నేపథ్యంలో విలేజ్ నేటివిటీతో తెరకెక్కిన అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌లు. ఆహా ఓటిటి వేదికగా తురుమ్ ఖాన్‌లు స్ట్రీమింగ్ అవుతుంది. కడుపుబ్బ నవ్వించే కామెడీ సన్నివేశాలతో అలరించేలా సాగే ఈ చిత్రం. ’

## షూటింగ్‌లో రామ్ చరణ్‌కు గాయాలు



హీరో రామ్‌చరణ్‌కు గాయాలు అయ్యాయి. పెద్ది సినిమా షూటింగ్‌లో రామ్‌చరణ్‌కు గాయం అవడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. రామ్ చరణ్ కంటికి గాయమైనట్లు సమాచారం. అయితే కంటికి చిన్న గాయమేనని కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని వైద్యులు తెలిపినట్టు పెద్ది సినిమా పిఆర్ టీమ్ వెల్లడించింది. దీంతో కొన్ని రోజుల పాటు షూటింగ్ వాయిదా పడినట్టు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ త్వరగా రామ్‌చరణ్ కోలుకోవాలని ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

## మైత్రీ మూవీ మేకర్స్‌లో ‘సూరి’



మైత్రి మూవీ మేకర్స్ తమ మూడవ తమిళ చిత్రం మైత్రి తమిళ్ 3ను అనౌన్స్ చేసింది. ఈ చిత్రంలో కోలీవుడ్ టాలెంటెడ్ సూరి హీరోగా నటిస్తుండగా దర్శకుడు ఆర్ రవికుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్నారు. ఈ అనౌన్స్మెంట్ పోస్టర్ విడుదల చేశారు. పోస్టర్లో హీరో వెనుక నుంచి కనిపిస్తూ, మురికిగా ఉన్న వరద నీటిలో నడుము వరకు నిలబడి ఉంటాడు. అతని ప్రతిబింబం నీటిలో కనిపిస్తూ ఒక స్యూరియల్ ఫీల్ ఇస్తోంది. కుడిచేతిలో ఆయుధం పట్టుకుని ఉండటం ప్రమాదం, బతుకుబాట మధ్య పోరాటాన్ని సూచిస్తోంది. చుట్టూ పగిలిపోయిన సామాన్లు, చెదరిపోయిన వస్తువులు, తలకిందులైన గ్యాస్ సిలిండర్.. ఇవన్నీ విపత్తు తర్వాతి పరిస్థితిని చూపిస్తున్నాయి. ముందున్న తలుపు నుంచి వచ్చే ఎర్రటి వెలుతురు ఒక ఇంటెన్స్ వాతావరణాన్ని సృష్టిస్తోంది. నీటిలో కనిపించే ప్రతిబింబం పైన కథలో హింస, భావోద్వేగాలను సూచిస్తోంది. పోస్టర్ మిస్టీరియస్గా, టెన్షన్తో నిండి ఉండటంతో సినిమాపై ఆసక్తి పెంచుతోంది. ఇటీవల ‘కొట్టుక్కాళి’, ‘విదుదలై’, ‘మామన్నన్’ వంటి సినిమాలతో మంచి ఫామ్లో ఉన్న సూరి, ఈ చిత్రంతో మరొక బలమైన పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు ఆర్ రవికుమార్ ‘ఇంద్రు నేట్రు నాళై’, ‘అయలాన్’ వంటి సైన్స్ ఫిక్షన్ సినిమాలతో తన ప్రత్యేకతను చూపించాడు.మరోవైపు మైత్రీ మూవీ మేకర్స్ ఇప్పటికే తమిళంలో అజిత్ నటించిన ‘గుడ్ బ్యాడ్ అగ్లీ’, ప్రదీప్ రంగనాథన్ నటించిన ‘డ్యూడ్’ వంటి ప్రాజెక్టులతో విజయాల్ని అందుకుంది. ఈ చిత్రానికి సంబదించిన మిగితా వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని నిర్మాతలు తెలిపారు.

## ‘యూత్’ రిలీజ్ తేది మారింది




కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్ని యాదవ్, మీనాక్షి ధినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవి ‘యూత్’ ఈ నెల 26న రిలీజ్ కావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాలతో ఈ సినిమా ఒక రోజు ఆలస్యంగా ఈ నెల 27న థియేటర్స్ లోకి రాబోతోంది. ఇప్పటికే తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని ఇ2సి బ్యానర్‌పై తెలుగు ప్రేక్షకుల ముందుకు నిర్మాతలు వినీత్, సందీప్ తీసుకువస్తున్నారు. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. 'కమ్ విత్ యువర్ గ్యాంగ్, నోట్ నో ఏజ్ లిమిట్' అనే స్లోగన్ తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు. ఈ మూవీ ప్రమోషనల్ కంటెంట్ కు, సాంగ్స్ కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. యూత్ ఆడియెన్స్ ఈ సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షో చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.
కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్ని యాదవ్, మీనాక్షి దినేష్, తదితరులు నటించారు.

## హైదరాబాద్ కల్చర్‌ను గొప్పగా చూపించే ‘దేత్తడి’


### గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ లో నిర్మాత దిల్ రాజు

రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన ఆశిష్ హీరోగా నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం ‘దేత్తడి’. ఈ ప్రాజెక్ట్ తో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్డ్రాప్లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. తాజాగా నెక్ లెస్ రోడ్ లో గ్లింప్స్ ఈవెంట్ నిర్వహించారు. ఈ గ్లింప్స్ హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పండుగలు, వేడుకలకు ఉత్సాహాన్ని నింపే పాపులర్ డ్రమ్మర్ ఘున్ను భాయ్ వరల్ ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ఘున్ను భాయ్, అతని టీం దాదాపు ఏడు కిలోల డ్రమ్ములను మోస్తూ, గంటల తరబడి విరామం లేకుండా ప్రదర్శన ఇస్తూ ప్రశంసలు అందుకున్నారు. ఆ సంగీతం వెనుకకనిపించే ఆత్మగౌరవం, హుందాతనం ఉన్నాయి. ఈ గ్లింప్స్ ఆ విషయాన్ని ఎంతో సున్నితంగా, శక్తివంతంగా ప్రజెంట్ చేసింది. ఆశిష్ నటన అద్భుతంగా వుంది. అతని రఫ్ మేకోవర్ ఆ పాత్రకు చక్కగా సరిపోయింది. ఆ పాత్రలో ఎంత సహజంగా జీవించారు. అతని హావభావాలు, నేచురల్ ప్రజెన్స్, డ్రింక్ చేసే విధానం, అలవోకగా పలికే హైదరాబాద్ యాస ఈ పాత్రకు బలమైన మాస్ ఫ్లేవర్ను జోడించాయి. మొత్తం మీద, పర్ఫెక్ట్గా కట్ చేసిన ఈ గ్లింప్స్, సినిమా ఏమి అందించబోతోందో స్పష్టంగా ప్రజెంట్ చేసింది. చిత్రం థియేటర్లలోకి రావడానికి సిద్ధమవుతోందని సూచిస్తూ.. ‘జాతర త్వరలో ప్రారంభమవుతుంది, ‘అని చిత్ర నిర్మాతలు ప్రకటించారు. 'ది గ్లింప్స్' అత్యద్భుతంగా లాంచ్ చేశారు. 500 మందికి పైగా స్ట్రీట్ డ్రమ్మర్లు ఏకతాటిపై హోరెత్తిస్తూ, వాతావరణాన్ని ఎనర్జీని నింపేశారు. వారి ఉత్సాహాభరితమైన పెర్ఫార్మెన్స్ ఈవెంట్ స్థాయిని పెంచడమే కాకుండా, సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఆదిత్య కథ అద్భుతంగా రాసుకున్నాడు. ఆదిత్యతోపాటు ప్రసన్న ఈ స్క్రిప్ట్ ని ఫుల్ పూర్తి స్థాయిలో రాసుకున్నారు. హైదరాబాద్ కల్చర్‌ని ప్రపంచానికి గొప్పగా చూపించబోయే సినిమాతో వస్తున్నారు అన్నారు. డైరెక్టర్ ఆదిత్య మాట్లాడుతూ మా టీం ని సపోర్ట్ చేసిన దిల్ రాజు గారికి ధన్యవాదాలు. ఈ సినిమా ముందుకెళ్లడానికి కారణం మా హీరో. ఆయనే మొదటగా కథని నమ్మారు. అక్కడి నుంచి మా జర్నీ మొదలైంది. రైటర్ ప్రసన్న మాట్లాడుతూ ఈవెంట్ కి వచ్చి సపోర్ట్ చేస్తున్న బ్యాండ్ కమ్యూనిటీ మొత్తానికి థాంక్యూ సో మచ్. ఈ సినిమా వచ్చిన తర్వాత బ్యాండ్ ఆర్టిస్ట్ అనే గౌరవం తెచ్చేలాగా ఉంటుంది. ఇప్పటివరకు హైదరాబాది బ్యాక్ డ్రాప్‌లో చాలా సినిమాలు వచ్చాయి. కానీ అసలైన హైదరాబాద్ కల్చర్ చూపించే ఫస్ట్ సినిమా ఇదే కాబోతోంది. త్వరలోనే మీ ముందుకు వస్తాం. మీ అందరి ఆశీస్సులు కావాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే, సంభాషణలు, క్రియేటివ్ హెడ్: ప్రసన్న కుమార్ బెజవాడ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మురళీ పున్న (బిట్టు).




## కోసింది కొయగూర పాట ఆవిష్కరణ

శ్రీ ఫుల్ మీడియా ఫ్యాక్టరీ ఇప్పుడు ఆంధ్రప్రదేశికి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి కథని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది మెరుస్తోంది. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. బుర్రకథలు చెప్పడమే కాదు, బుర్రకథను ఓ ఉద్యమంగా మార్చిన గరివిడి లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. టిజి. విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. తాజాగా అద్భుతమైన జానపదం’ కోసింది కొయగూర’ సాంగ్ ని రిలీజ్ చేశారు. చరణ్ అర్జున్ ఈ జానపదాన్ని డ్యాన్స్ నెంబర్ గా కంపోజ్ చేశారు. అనన్య భట్, షకలక శంకర్, గౌరీ నాయుడు జమ్ము వోకల్స్ మరింత వైబ్ ని యాడ్ చేశాయి. ఉత్తరాంధ్ర జనపదం మూలం నుంచి స్వరపరిచిన ఈ పాటకు గంటేడ గౌరునాయుడు, గౌరీ నాయుడు జమ్ము రాసిన అదనపు సాహిత్యం మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. ఈ సాంగ్ లో ఆనంది పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. రాగ్ మయూర్ ప్రజెన్స్ డ్యాన్స్ మూమెంట్స్ మరింత జోష్ ని తీసుకొచ్చింది. ఈ పాటకు సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో నరేష్, రాశి, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.గరివిడి లక్ష్మి మన ఊరి పాటలు, అనుభూతులు, మన మూలాల నుంచి వచ్చే ఆత్మగౌరవానికి సెల్యూట్ లాంటి సినిమా అని నిర్మాతలు తెలిపారు. నరేష్, రాశి, ఆనంది, రాగ్ మయూర్, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్, కంచరపాలెం కిషోర్, శరణ్య ప్రదీప్, కుశాలిని నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ ఆదిత్య సంగీతం: చరణ్ అర్జున్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ చౌదరి కొల్లి, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సుకుమార్ కిన్నెర.



## హీరోయిన్‌గా చేయాలని లేదు

## ఎవరిని తొక్కి ఈ స్థాయికి రాలేదు



జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక కొణిదెల పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ ఉమేష్ కుమార్ బన్సాల్తో కలిసి ‘రాకాస’ మూవీని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు.
తాజాగా ఈ చిత్ర విశేషాల్ని పంచుకునేందుకు దర్శకురాలు మానస శర్మ మీడియాతో ముచ్చటించారు.మాది శ్రీకాకుళం. నేను మొదటగా యూట్యూబ్లో ‘మ్యాడ్ హౌస్’ చేశాను. ఆ తరువాత ‘ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ’కి క్రియేటర్, రైటర్గా పని చేశాను. ఆ తరువాత ‘బెంచ్ లైఫ్’ సిరీస్ చేశాను. ఇది నాకు నాలుగో ప్రాజెక్ట్. ఫాంటసీ, అడ్వెంచర్లతో తీసిన ‘రాకాస’ చాలా కొత్తగా ఉండబోతుంది.రాకాసని ఫాంటసీ, అడ్వెంచర్, కామెడీ జానర్లో తీశాం. ఇప్పటికే అందరూ మా టీజర్ని చూసి ఉంటారు. కామెడి ప్రధాన అంశంగా, కొద్దిగా హారర్ ఎలిమెంట్స్తో పూర్తి ఫాంటసీ, అడ్వెంచర్గా ఈ మూవీని తీశాం. ‘రాకాస’ కథని ముందుగా నెట్ ఫ్లిక్స్తో సిరీస్ కోసం చెప్పాను.

## నిరుద్యోగ యువతపై టిజిపిఎస్‌సి వైఖరి సరికాదు


- ఒటిఆర్‌పై ఉన్న శ్రద్ధ.... జాబ్ క్యాలెండర్‌పై లేకపోవడం సిగ్గు చేటు
- ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో లక్షలాది నిరుద్యోగ యువత తమ భవిష్యత్తు కోసం ఆశగా ఎదురు చూస్తున్న ఈ సమయంలో, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్(టిజిపిఎస్‌సి) మంగళవారంతో ముగియనున్న వన్ టైం రిజిస్ట్రేషన్ (ఒటిఆర్)కు తుది గడువు విధించడం తీవ్ర అన్యాయమని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సమితి పేర్కొంది. టిజిపిఎస్‌సి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి నాయకులు మంగళవారం నాంపల్లిలోని టిజిపిఎస్‌సి కార్యాలయంలో కార్యదర్శి హరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక సౌకర్యాలు లేని యువత టిజిపిఎ నిర్ణయంతో వెనుకబడే ప్రమాదం ఉందని, సత్వరమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి టిజిపిఎస్‌సి నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ఆదేశించాలని, వన్ టైం రిజిస్ట్రేషన్ గడువును పొడిగించి, నిరంతర ప్రక్రియగా మార్చాలని వారు కోరారు. రాష్ట్రంలో లక్షలాది నిరుద్యోగ యువత జీవితం ఇప్పటికే నిరాశలో ఉందని, ఉద్యోగాలు ఇవ్వలేకపోయిన ప్రభుత్వం, ఇప్పుడు టిజిపిఎస్‌సి వన్ టైం రిజిస్ట్రేషన్ (ఒటిఆర్)కు గడువు విధించి, వారి ఆశలను పూర్తిగా ఛిద్రం చేయాలని చూస్తోందని, ఈ చర్యలను ఎఐవైఎఫ్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం కాదని, యువతపై స్పష్టమైన దాడిగా తాము అభివర్ణిస్తున్నామన్నారు ఒటిఆర్ గడువు పేరుతో యువతను బయటకు తోసేయాలనే ప్రయత్నం వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు. గ్రామీణ, బడుగు, బలహీన వర్గాల యువతకు ప్రత్యేక సహాయం అందించాలని,మీసేవ, గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్ సౌకర్యాలు కల్పించాలని, సర్వర్ సమస్యలు, సాంకేతిక లోపాల వల్ల దరఖాస్తు చేయలేకపోయిన వారికి మరో అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా టిజిపిఎస్‌సికు ఒటిఆర్ పై ఉన్న శ్రద్ధ.... జాబ్ క్యాలెండర్ పై లేకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికీ జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. జాబ్ క్యాలెండర్ అంటే ఒక సంవత్సరంలో ఏ శాఖలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నారు, నోటిఫికేషన్ ఎప్పు డు వస్తుంది, పరీక్షలు ఎప్పుడు జరుగుతాయి, ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారు అనే పూర్తి సమాచారాన్ని ముందుగానే ప్రకటించడం. ఇది యువతకు దిశానిర్దేశం చేసే మార్గదర్శక పథకంలాంటిది. ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించాల్సిన సమయంలో, ఇలా గడువులు విధించడం యువతను మరింత నిరాశలోకి నెట్టే చర్య అని, ఇది ఉద్యోగావకాశాలపై నమ్మకాన్ని దెబ్బ తీసే నిర్ణయమన్నారు.ఈ అన్యాయ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతతో కలిసి రోడ్లపైకి దిగి పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ నేతలు సిద్ధార్థ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్రాబాద్ గిరిజనుల పునరావాసానికి ప్రభుత్వం ముందడుగు

### 14 మంది గిరిజన కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో నివసిస్తున్న గిరిజన కుటుంబాల అభివృద్ధి, అటవీ మరియు వన్యప్రాణి సంరక్షణను సమన్వయం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ లోని గిరిజన గ్రామాలకు చెందిన కుటుంబాలకు పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది..అందులో భాగంగా మొదటి దశలో నాలుగు గ్రామాలకు చెందిన మొత్తం 417 కుటుంబాలకు పునరావాసం కల్పించే దిశగా ముందడుగు పడింది. అసెంబ్లీ కౌన్సిల్ హాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు సమక్షంలో 14 మంది గిరిజన కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ అమ్రాబాద్ అడవుల్లో శతాబ్దాలుగా ప్రకృతితో మమేకమై జీవిస్తున్న గిరిజనుల జీవితాల్లో అభివృద్ధి వెలుగులు నింపడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అదే సమయంలో అటవీ, వన్యప్రాణి సంరక్షణకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. ఇది సాధారణ పరిపాలనా నిర్ణయం కాదు& చారిత్రాత్మక సామాజిక–పర్యావరణ సంస్కరణ అని ఆయన పేర్కొన్నారు. గిరిజన కుటుంబాలను స్వచ్ఛందంగా పునరావాసం చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పులులు సహా వన్యప్రాణులకు సహజ ఆవాసాలు తిరిగి లభిస్తాయని అన్నారు. ఈ ప్రక్రియ పూర్తిగా గిరిజనుల అభీష్టం మేరకే జరుగుతోందని చెప్పారు.వారి ఎంపిక ప్రకారం రెండు విధాలుగా సహాయం అందిస్తున్నారు. 160 కుటుంబాలకు ఒక్కొక్కరికి ₹15 లక్షల నగదు పరిహారం,‘ 257 కుటుంబాలకు నాగర్‌కర్నూల్ జిల్లా బచారం వద్ద ఆధునిక గృహ వసతితో పాటుగా 5 ఎకరాల వ్యవసాయ భూమి ఇస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ మంత్రి కొండాసురేఖ, పిసిసిఎఫ్ డాక్టర్ సువర్ణ ,ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, రాజేష్ రెడ్డిలతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు..

## సురవరం ఆదర్శప్రాయం

(మొదటి పేజీ తరువాయి)

సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఇటి నరసింహ, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆశీనులయ్యారు. రాజా మాట్లాడుతూ ప్రజలతో కలిసి జీవిస్తూ, వారి సమస్యలను అర్థం చేసుకుని ఉద్యమాన్ని ముందుకు నడిపినప్పుడే పార్టీ నిజమైన ప్రజా పార్టీగా ఎదుగుతుందని అన్నారు. సమాజంలో లింగభేదంతో పాటు తరాల మధ్య ఉన్న అంతరాలు, విభేదాలు తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో కమ్యూనిస్టు శక్తుల ఐక్యత అత్యవసరమని, ఇందుకు సురవరం సుధాకర్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని తెలిపారు. సుధాకర్ రెడ్డి వ్యక్తిగత జీవితం, ఆయన రాజకీయ, సిద్ధాంతపరమైన నిబద్ధత నుండి ప్రేరణ తీసుకుని, పార్టీని మరింత బలోపేతం చేయాలని, ఇందుకు ప్రజలతో అనుబంధాన్ని మరింత పెంపొందించుకోవాలని రాజా సిపిఐ శ్రేణులకు సూచించారు. సురవరం సుధాకర్ రెడ్డితో తనకు ఉన్న అనుబంధం, సాన్నిహిత్యాన్ని రాజా గుర్తు చేసుకున్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి బతుకంతా దేశం, తెలంగాణ ప్రజలతో పెనవేసుకున్న సంబంధమని, ఆ మహామనిషి మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన ఆకాంక్షలు, ఆశయాలతో నిత్యం మన మధ్యే ఉంటారన్నారు. విద్యార్థి నాయకుడిగా, యువ నాయకుడిగా, కమ్యూనిస్టు నాయకుడిగా, సుప్రసిద్ధ పార్లమెంటేరియన్‌గా విశేషమైన సేవలను అందించిన మహా వ్యక్తి అని కొనియాడారు. సుధాకర్ రెడ్డి చివరి దశలో తాను ఏమి చేయగలనో అంతా చేశానని, నేను సైతం విప్లవాగ్నికి సమిధనొక్కటి ఆహుతినిచ్చానని పేర్కొన్నారన్నారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి కమ్యూనిస్టు పార్టీకి సుర స్వరమని అన్నారు. అందరూ మరణించడం సహజమని, అయితే ఆదర్శ, ఉత్తమ కమ్యూనిస్టు మరణిస్తే ప్రజలు ఏలా నీరాజనాలు పలుకుతారో అనే దానికి సువరం సుధాకర్‌రెడ్డి అంతిమయాత్ర నిదర్శమన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి మరణించినా ఆయన ఎప్పుడు ప్రేరణను ఇస్తునే ఉంటారన్నారు. ఖమ్మంలో సిపిఐ 100 ఏళ్ల బహిరంగ సభలో భౌతికంగా లేకపోవడం లోటుగా కనిపించిందన్నారు. కమ్యూనిస్టులుగా మన బాధ్యతను నెరవేర్చుకుంటూ ముందుకు సాగడమే సురవరం సుధాకర్ రెడ్డికి మనమిచ్చే ఘనమైన నివాళి అని సాంబశివరావు అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా సురవరం సుధాకర్ రెడ్డి, యువజన నాయకుడిగా తాను నిర్వహించిన అనేక పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ప్రధానంగా 18 ఏళ్లకే ఓటు హక్కు, బ్యాంకుల జాతీయ కరణ, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి లాంటివి వాటిలో అనేకం ఉన్నాయని తెలిపారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ తాను మునుగోడు ఎంఎల్ఎగా, నల్లగొండ ఎంపిగా సుధాకర్ రెడ్డి ఫ్లోరోసిస్‌తో సతమతమవుతున్న ప్రాంత ప్రజలకు కృష్ణా జలాలను అందించేందుకు చేసిన కృషిని గుర్తు చేశారు. సుధాకర్ రెడ్డి అంటే అప్పట్లో ఏ ముఖ్యమంత్రికైనా ఎంతో గౌరవం ఉండేదని తెలిపారు. వ్యక్తిత్వం, రాజకీయ జీవితం అన్ని అంశాల్లో ప్రత్యేకతతో కూడుకున్న వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. ఎఐటియుసి, ఎన్ఎఫ్ఐడబ్ల్యు మాజీ నాయకురాలు, సుధాకర్ రెడ్డి సతీమణి డాక్టర్ బి.వి.విజయలక్ష్మి మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డికి తన స్వీయ అనుభావాలను పుస్తక రూపంలో రాయాలని ఆలోచన లేదని, పార్టీ నాయకులు పుస్తకం రాయాలని ఒత్తిడి తేవడంతో చివరి దశలో మాత్రం నోట్స్ రూపంలో రాశారని, దానిని పూర్తిగా క్రోడీకరించి పుస్తక రూపంలో తీసుకువచ్చామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి సభకు ‘ప్రజలతో నా ప్రయాణం’ పుస్తకాన్ని పరిచయం చేస్తూ ఈ పుస్తకం వామపక్ష ఉద్యమకారులకే కాకుండా రాజకీయ నాయకులందరికీ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కమ్యూనిస్టు పార్టీలు స్థానిక సమస్యలు, పరిస్థితులకు అనుగుణంగా అనువహించుకోవాలని సురవరం సుధాకర్ రెడ్డి తన అభిప్రాయంగా వెల్లడించారని తెలిపారు. పుస్తకాన్ని పరిచయం చేస్తున్న సమయంలో సురవరం సుధాకర్ రెడ్డితో తనకున్న సాన్నిహిత్యం గుర్తుకు రావడంతో శ్రీనివాస్‌రెడ్డి ఒక్క సారిగా భావోద్వేగానికి గురయ్యారు.






## ప్రతిపక్షాల ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

చెందిన మహువా మాజీ తదితరులు పాల్గొన్నారు. ‘ఖాళీ సిలిండర్లు, ఖాళీ వాగ్దానాలు’ అని రాసి ఉన్న భారీ బ్యానర్‌తో ఎంపిలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి సౌగతా రాయ్ మాట్లాడుతూ.. ఎల్‌పిజి సంక్షోభంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎంపి ప్రమోద్ తివారీ మాట్లాడుతూ.. దేశంలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం అబద్ధాలు చెబుతుందన్నారు. గ్రామాలు, నగరాల్లో గ్యాస్ కొరత తీవ్రంగా కన్పిస్తుందన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో ఈ ఎల్‌పిజి కొరత ఏర్పడింది. దీని తరువాత, ఎల్‌పిజి ఉత్పత్తి, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సిఎన్‌జి), పైపుల ద్వారా సరఫరా చేసే వంటగ్యాస్ రంగాలకు దేశీయంగా ఉత్పత్తి అయ్యే సహజ వాయువు కేటాయింపులకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. సవాలుతో కూడిన భౌగోళిక రాజకీయ వాతావరణం మధ్య, గ్యాస్ పంపిణీని క్రమబద్ధీకరించడానికి, సరఫరా ఒత్తిళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com